


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+20 వెల: ₹5.00

సంపుటి: 12
సంచిక: 260

బుధవారం 11-12-2019

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**రూ.12 వేల కోట్ల లెక్కతప్పింది**

ఆర్‌బీఐ ఆడిట్‌లో పెరిగిన ఎస్‌బీఐ మొండి బకాయిలు – బిజినెస్‌లో



**టాప్ లేపిన భారత్**

దక్షిణాసియా క్రీడల్లో 312 పతకాలు సొంతం – స్పోర్ట్స్‌లో



# సమాన హక్కులెలా?

## మహిళల మీద అత్యాచారాలు, హింసపై రాష్ట్రపతి ఆందోళన

మానవ హక్కులపై అందరిలో ఆత్మశోధన అవసరం

దార్శనికుల స్వప్నాలను సాకారం చేద్దామని పిలుపు

మానవ హక్కుల దినోత్సవ కార్యక్రమంలో ప్రసంగం

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా మహిళలపై పెరిగిపోతున్న నేర ఘటనలపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో సమానహక్కులు అన్న సార్వత్రిక లక్ష్యం సఫలతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. మానవ హక్కుల దినోత్సవాల్లో భాగంగా మంగళవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో రాష్ట్రపతి మాట్లాడారు. ఐక్యరాజ్యసమితి 1948లో యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ (యూడీహెచ్‌ఆర్)ను ఆమోదించగా.. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని

మిగతా 2వ పేజీలో ▶






బిల్లుపై చర్చించి ఆమోదించనున్న మంత్రివర్గం

అనంతరం శాసనసభ, మండలిలో ప్రవేశపెట్టనున్న సర్కారు

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలకు పాల్పడితే మరణశిక్ష విధించేలా సరి కొత్త చట్టం తేవడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా భారత శిక్షా స్మృతి(ఐపీసీ–ఇండియన్ పీనల్ కోడ్)లోని సెక్షన్ 354కు సవరణలు చేసి.. కొత్తగా 354–ఈని చేర్చనుంది. మహిళలు, చిన్నారులపై అత్యాచారాలకు, అఘాయిత్యాలకు పాల్పడితే.. అలాంటి కేసులపై వారం రోజుల్లోగా విచారణ పూర్తి చేసి, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి రెండు వారాల్లోగా ట్రయల్ పూర్తి చేసి శిక్షపడేలా చేయడం ఈ చట్టం ఉద్దేశం. ఇలాంటి కేసుల్లో రెడ్ హ్యాండెడ్‌గా ఆధారాలుంటే నిందితులకు మూడు వారాల్లోగా ఉరిశిక్ష విధించడానికి ఈ చట్టం దోహదం చేస్తుంది. ఈ విప్లవాత్మక చట్టాన్ని అమల్లోకి తేవడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుంబిగించారు. ఇందుకు సంబంధించిన బిల్లుపై చర్చించి.. ఆమోదించడానికి సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో మంత్రివర్గం బుధవారం సమావేశం కానుంది. మహిళా భద్రత బిల్లుపై ఆమోదముద్ర వేశాక శాసనసభ, మండలిలో దీన్ని ప్రవేశపెట్టనున్నారు.

# రైతు పక్షపాత ప్రభుత్వమిది

## రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి

**రైతు భరోసాపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో సీఎం వైఎస్ జగన్**

కనీస గిట్టుబాటు ధరల గురించి మరోసారి గురువారం యాడ్ ఇస్తాం

ప్రకటించిన రేటు కంటే రైతులు తక్కువకు అమ్ముకోవాల్సిన పనిలేదు

సమస్యలు చెప్పడానికి టెలిఫోన్ నంబరు ఇస్తాం

సాక్షి, అమరావతి

**త**మ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం అసెంబ్లీలో రైతు భరోసాపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. తమది చంద్రబాబులా మోసం చేసే ప్రభుత్వం కాదని, రైతుల కోసం నాలుగు అడుగులు ముందుకు వేసే ప్రభుత్వమని స్పష్టం చేశారు. పంటలకు ప్రకటించిన గిట్టుబాటు ధర గురించి.. ఏ పంటకు ఎంత రేటో మరోసారి గురువారం పత్రికల్లో అడ్వర్టైజ్‌మెంట్ ఇస్తామన్నారు. 'వరి, జొన్న, మొక్కజొన్న, రాగి, పత్తి, కందులు, మినుములు, పెసలు, శనగ, వేరుశనగ, పసుపు, మిరప మొదలైన పంటలను కనీస గిట్టుబాటు ధరల కన్నా తక్కువ రేటుకు ఏ రైతు కూడా అమ్ముకోవాల్సిన పనిలేదు. కనీస గిట్టుబాటు ధరకు

మిగతా 2వ పేజీలో ▶



మంగళవారం శాసనసభలో మేనిఫెస్టో చూపిస్తూ మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

> రైతు బజార్లలో ఇవాళ ఇంత క్యూలు ఉన్నాయంటే దానికి కారణం వినియోగదారులు హెరిటేజ్ షాపుల్లో కిలో రూ.200 పెట్టి కొనుక్కోలేక పోవడమే. రైతు బజార్లలో రూ.25కే కిలో ఉల్లిపాయలు అందిస్తున్నాం కనుకే జనం క్యూ కడుతున్నారు. ఈ విషయాలేవీ చంద్రబాబుకు అర్థం కావు. శవాల మీద రాజకీయం చేసే రకం.
>
> **– సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి**

## ఇక మార్కెట్ యార్డుల్లోనూ ఉల్లి

రైతు బజార్లలో యధాతథంగా అమ్మకాలు

ఉల్లిపై చర్చలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఎంత ఖర్చయినా పర్వాలేదు..

వినియోగదారులకు కేజీ రూ.25కే

ఇప్పటి దాకా 38,496 క్వింటాళ్లు సరఫరా

రేపో ఎల్లుండో మరికొన్ని వందల క్వింటాళ్లు రాక

దేశమంతట్లోకి ఏపీలోనే తక్కువ ధర

- వివరాలు 2లో

## నాణ్యమైన బియ్యమే ఇస్తాం



**విపక్షం ఓర్వలేక సన్న బియ్యం అంటూ గందరగోళం సృష్టిస్తోంది**

**అసెంబ్లీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి**

శ్రీకాకుళంలో పైలెట్ ప్రాజెక్టు కొనసాగుతోంది..

పేదలు ఈ బియ్యాన్ని అమ్ముకోకుండా తినగలిగేలా ఇస్తున్నాం

ఈ బియ్యం బాగున్నాయని అందరూ చెబుతున్నారు

ఏప్రిల్ నుంచి రాష్ట్రమంతటా స్వర్ణ తరహా నాణ్యమైన బియ్యం

మేనిఫెస్టోలో చెప్పకపోయినా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాం

ఇందుకోసం అదనంగా రూ.1,400 కోట్లు ఖర్చు

- వివరాలు 3లో



# చతికిలబడ్డ ప్రతిపక్షం

**ఉల్లిపై శవరాజకీయం బట్టబయలు**

హెరిటేజ్‌పై బెడిసికొట్టిన సవాల్.. రైతు భరోసా పైనా అక్కరకురాని లెక్కలు

దిక్కుతోచని స్థితిలో సభ నుంచి నిష్క్రమించిన చంద్రబాబు అండ్ కో

సాక్షి, అమరావతి:

**ఉ**ల్లిపై చర్చ తలబొప్పి కట్టించేలా చేసింది. హెరిటేజ్‌పై చేసిన సవాల్ ఇరుకున పడేసింది. రైతు భరోసాపై చెప్పిన లెక్కలన్నీ తప్పి తిప్పలుపెట్టాయి... వెరసి మంగళవారం అసెంబ్లీలో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ దిక్కు తోచని స్థితిలో పడిపోయింది. చివరకు సభ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. ఉల్లి ధరలపై చర్చించాల్సిందేనని డిమాండ్ చేసిన చంద్రబాబు, ఆయన సహచరులకు ఊహించని షాక్ తగిలింది. ఉల్లిపాయలకోసం రైతుబజార్ క్యూలో నిలబడి చనిపోయాడని చంద్రబాబు వ్యాఖ్యానించగా అది పూర్తిగా అవాస్తవమని పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని వీడియో సాక్ష్యంతో రుజువు చేశారు. హెరిటేజ్ ఫ్రెష్ నాది కాదు ఫ్యూచర్ గ్రూప్‌కు అమ్మేశామని, తనదని నిరూపిస్తే రాజీనామా చేస్తానని చంద్రబాబు సవాల్ చేశారు. అయితే ఆధార సహితంగా ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రుజువుచేయడంతో ఇరుకునపడ్డారు. కేంద్ర పథకానికి జతచేసి రైతుభరోసా ఇస్తున్నారంటూ అధికారపక్షాన్ని ఇరకాటంలోకి నెట్టడానికి ప్రయత్నించిన చంద్రబాబు చివరకు తానే ఇరుక్కున్నారు. తన హయాంలో రుణమాఫీ పేరుతో దగాచేశారని, కేంద్రపథకాలన్నిటినీ చంద్రన్న పేరు తగిలించి ప్రచారం చేసుకున్నారంటూ

మిగతా 2వ పేజీలో ▶

> ఉల్లిపాయల కోసం క్యూలో నిలబడాల్సిన అవసరం మా కుటుంబానికి లేదు. సాంబిరెడ్డి గుడికి వెళ్లొస్తూ మార్కెట్ నుంచి కూరగాయలు తీసుకొస్తుంటారు. సోమవారం ఆయన మార్కెట్‌కు వెళ్లినప్పుడు గుండెపోటుతో కుప్పకూలి మరణించాడు. టీడీపీ వాళ్లు దీన్ని కూడా రాజకీయం చేయాలని చూడటం దుర్మార్గం.
>
> *– సాంబిరెడ్డి కుటుంబీకులు*

## బాబూ.. మీరు మాఫీ చేసిందెంత?

**ప్రతిపక్ష నేతకు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ సూటి ప్రశ్న**

నాలుగు, ఐదు విడతల్లో చెల్లించాల్సిన రుణమాఫీ సొమ్ముపై కోర్టుకెళతామన్న చంద్రబాబు

బాబు మోసంపై వీడియో ప్రదర్శన, బడ్జెట్ లెక్కలతో వివరించిన బుగ్గన 2లో











ప్రయోగానికి సిద్ధంగా ఉన్న పీఎస్‌ఎల్‌వీ సి-48 రాకెట్

## నేడు నింగిలోకి పీఎస్‌ఎల్‌వీ సీ–48

**మధ్యాహ్నం 3.25 గంటలకు శ్రీహరికోట నుంచి ప్రయోగం**

- 576 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి రీశాట్–2బీఆర్1 ఉపగ్రహం
- అమెరికా, జపాన్, ఇటలీ, ఇజ్రాయెల్ ఉపగ్రహాలు సైతం
- ఇది చరిత్రాత్మక ప్రయోగమన్న ఇస్రో చైర్మన్ కె.శివన్

5లో

## 12 ఏళ్ల వేదన.. 12 గంటల్లో సాంత్వన

ఇది తండ్రీబిడ్డల హృదయ 'స్పందన'

2007లో తప్పిపోయిన ఆదిలక్ష్మి

- అప్పటి నుంచి కుమార్తె కోసం తండ్రి వెతుకులాట
- తన తల్లిదండ్రుల ఆచూకీ కోసం తమిళనాడు నుంచి వచ్చిన ఆదిలక్ష్మి
- సోమవారం విజయవాడ 'స్పందన'లో విజ్ఞప్తి
- గంటల వ్యవధిలోనే వారిని గుర్తించి.. ఆమెను కుటుంబం చెంతకు చేర్చిన పోలీసులు

'స్పందన'కు చేతులెత్తి మొక్కుతున్నానన్న ఆదిలక్ష్మి



ఆదిలక్ష్మితో తల్లిదండ్రులు చెంచమ్మ, లక్ష్మీనారాయణ. చిత్రంలో విజయవాడ సీపీ ద్వారకా తిరుమలరావు

- వివరాలు 4లో

## నేడు రాజ్యసభకు పౌరసత్వ సవరణ బిల్లు

- బిల్లు ఆమోదం కోసం అమిత్ షా వ్యూహాలు
- శివసేన యూ టర్న్.. జేడీయూలో అభిప్రాయభేదాలు
- బిల్లు పాసవుతుందని బీజేపీ ధీమా



13లో

ఇదం జగత్




... డెన్మార్క్‌లో మగవారు ఉండరా అండీ!

# కలుషితం.. నదీజలం

**వంశధారే ఊరట.. కృష్ణా, గోదావరి సహా తెలుగు రాష్ట్రాల్లో స్వచ్ఛత కోల్పోతున్న నదులు**

ప్రమాదకర స్థాయిలో డీవో, బీవోడీ, పీహెచ్, కోలి

- శుద్ధి చేయకుండా ఈ నీళ్లను తాగడం శ్రేయస్కరం కాదు
- అంతరిస్తున్న మత్స్య సంపద
- దిద్దుబాటు చర్యలు చేపట్ట కుంటే ఇబ్బందులు తప్పవు
- అధ్యయనంలో హెచ్చరించిన జల్ శక్తి, కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండళ్లు




**కాలుష్యానికి ప్రధాన కారణాలు**
- పారిశ్రామిక వ్యర్థాలు, మురుగునీటిని నదుల్లోకి పెద్ద ఎత్తున వదలడం.
- విచ్చలవిడిగా గనుల తవ్వకం.

**ఏం జరుగుతుంది?**
- పరిస్థితులు ఇలాగే కొనసాగితే నదీ జలాలు స్నానానికి కూడా పనికి రావు
- శుద్ధి చేయని నదీ జలాలను తాగితే ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది



సాక్షి, అమరావతి

తెలుగు రాష్ట్రాలను తడిపి సిరులు కురిపించే నదీ జలాలు స్వచ్ఛమైనవి కావా? వీటిల్లో కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుందా? దిద్దుబాటు చర్యలు చేపట్టకుంటే ఆరోగ్య సమస్యలు తప్పవా? అనే ప్రశ్నలకు అవుననే హెచ్చరిస్తోంది కేంద్ర జల్‌శక్తి శాఖ. గోదావరి, కృష్ణా, పెన్నా, కుందూ, నాగావళి, మానేరు, కిన్నెరసాని తదితర నదుల్లో బయో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్(బీవోడీ), డిసాల్వ్‌డ్ ఆక్సిజన్(డీవో), క్షార స్వభావం (పీహెచ్) ప్రమాదకర స్థాయికి చేరిందని తాజా నివేదిక తేల్చింది. ఈ నదుల్లోని నీటిలో కోలి బ్యాక్టీరియా, కరిగిన ఘన పదార్థాల(టీడీఎస్) శాతం ప్రమాదకరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇతర నదులతో పోల్చితే వంశధారలో కాలుష్య ప్రభావం కాస్త తక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. దేశవ్యాప్తంగా 323 నదుల్లో కాలుష్య ప్రభావంపై కేంద్ర పర్యావరణ నియంత్రణ మండలి(సీపీసీబీ), అన్ని రాష్ట్రాల కాలుష్య నియంత్రణ మండళ్లు(పీసీబీ), కేంద్ర జల్ శక్తి శాఖ సంయుక్తంగా అధ్యయనం నిర్వహించాయి.

**సీపీసీబీ ప్రకారం నీటి స్వచ్ఛత ప్రమాణాలు ఇవీ..**

- మనుషులు తాగడానికి వినియోగించే నీటిలో కోలి బ్యాక్టీరియా ఎంపీఎన్ (మోస్ట్ పాపులర్ నంబర్) వంద మిల్లీ లీటర్లకు 50 లోపు ఉండాలి. పీహెచ్ శాతం 6.5 వరకు ఉండవచ్చు. లీటర్ నీటికి డీవో ఆరు మిల్లీ గ్రాములు, బీవోడీ 2 మిల్లీ గ్రాముల వరకు ఉండవచ్చు.
- మనుషులు స్నానానికి వినియోగించే నీటిలో కోలి బ్యాక్టీరియా ఎంపీఎన్ వంద మిల్లీలీటర్లకు 500 వరకు ఉండవచ్చు. పీహెచ్ 6.5 శాతం వరకు ఉండవచ్చు. లీటర్ నీటికి

మిగతా 3వ పేజీలో ▶

# రైతు పక్షపాత ప్రభుత్వమిది

▶ మొదటి పేజీ తరువాయి

మీరు అమ్ముకోలేని పరిస్థితి ఉంటే ఫలానా చోటుకు వెళ్లి అమ్ముకోండి.. ప్రభుత్వమే దగ్గరుండి కొనుగోలు చేస్తుందనే వివరాలు ప్రకటనలో ఇస్తాం. మీ కరపత్రం 'ఈనాడు'లో కూడా యాడ్ (ప్రకటన) ఇచ్చి రైతులకు మంచి చేస్తాం' అని సీఎం వైఎస్ జగన్ అన్నారు.

**అన్నదాతలకు అండగా ఉంటాం**

రైతులకు ఏదైనా సమస్య ఉంటే టెలిఫోన్ నంబరు కూడా ఇస్తున్నామని, సమస్య తెలుసుకుని సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరిస్తారని సీఎం తెలిపారు. రూ.3 వేల కోట్ల ధరల స్థిరీకరణ నిధి ద్వారా రైతుకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. 'ధాన్యం కొనుగోళ్ల గురించి ప్రతిపక్ష నేత మాట్లాడుతున్నారు.. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి గత ప్రభుత్వంలో రూ.960 కోట్లు బకాయిలు పెడితే, మేం అధికారంలోకి వచ్చాక చెల్లించాము అని చెప్పడానికి గర్వపడుతున్నాం. ఆ డబ్బు ఇవ్వలేనందుకు ప్రతిపక్ష నేత సిగ్గుతో తలవంచుకోవాలి' అన్నారు. అంతకు ముందు ప్రతిపక్ష నేత చంద్రబాబు రుణమాఫీ, రైతుభరోసాపై పదే పదే అబద్ధాలు వల్లె వేయడంపై సీఎం స్పందిస్తూ.. కుక్క తోక వంకర అన్న సామెతకు చంద్రబాబు సరిగ్గా అతికినట్టు సరిపోతారంటూ సభలో ఆయన (చంద్రబాబు) వైపునకు తిరిగి నమస్కారం చేశారు.

## క్లుప్తంగా..

### మృతి చెందిన మాజీ ఎమ్మెల్యేలకు అసెంబ్లీ నివాళి

**సాక్షి, అమరావతి:** రాష్ట్రానికి విశేష సేవలు అందించి ఇటీవలి కాలంలో మరణించిన మాజీ శాసనసభ్యులకు రాష్ట్ర శాసనసభ మంగళవారం నివాళులు అర్పించింది. స్పీకర్ తమ్మినేని సీతారాం సంతాప ప్రతిపాదన చేయగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. వి.నరసింహారావు దొర, పి.బ్రహ్మయ్య, డాక్టర్ కోడెల శివప్రసాదరావు, బి.సత్యారావు, టి.రామారెడ్డి, వాసిరెడ్డి వరద రామారావు, చదలవాడ జయరాం బాబు, ముప్పలనేని శేషగిరిరావు, యల్లూరి వెంకటరెడ్డిలకు సభలో నివాళులర్పించారు.

### ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి అస్వస్థత

**సాక్షి, అమరావతి:** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మంగళవారం అసెంబ్లీలో అస్వస్థతకు గురయ్యారు. అసెంబ్లీలో చర్చ జరుగుతున్నప్పుడు ఒక్క సారిగా అస్వస్థతకు గురికావడంతో ఆయనను సహచర ఎమ్మెల్యేలు అసెంబ్లీలోని ఆసుపత్రికి తీసుకువెళ్లారు. శ్రీధర్‌రెడ్డి రక్తపోటుతో బాధపడుతున్నట్టు వైద్యులు గుర్తించారు. అనంతరం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు.

### అసెంబ్లీలో మూడు బిల్లులు

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర శాసనసభలో మంగళవారం మూడు బిల్లులను సంబంధిత మంత్రులు ప్రవేశపెట్టారు. ఆంధ్రప్రదేశ్ ధర్మదాయ, హిందూ ధార్మిక సంస్థలు, దేవాలయాల(రెండో సవరణ) బిల్లును దేవదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ ఆబ్కారీ(సవరణ) బిల్లును ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, ఏపీ పాఠశాలల విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్(సవరణ) బిల్లును విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రవేశపెట్టారు. ఏపీ విశ్వవిద్యాలయాల చట్టాల సవరణ ఆర్డినెన్స్–2019ను, ఏపీ పాఠశాల విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సవరణ ఆర్డినెన్స్ పత్రాలను కూడా విద్యాశాఖ మంత్రి సభ ముందుంచారు.

# ఫీజుల దోపిడీకి కళ్లెం..

- పాఠశాల విద్య పర్యవేక్షణ, నియంత్రణ కమిషన్‌కు అధికారం
- అసెంబ్లీలో సవరణ బిల్లు ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం

**సాక్షి, అమరావతి:** ఇష్టానుసారం ఫీజులు వసూలు చేస్తూ దోపిడీ సాగిస్తున్న ప్రైవేటు జూనియర్ కళాశాలల ఆటలు ఇకపై సాగవు. ఇలాంటి కాలేజీలపై చర్యలు తీసుకునే అధికారాన్ని పాఠశాల విద్యా పర్యవేక్షణ, నియంత్రణ కమిషన్‌కు కల్పిస్తూ ప్రభుత్వం మంగళవారం శాసనసభలో సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో పాఠశాల విద్య క్రమబద్ధీకరణ, పర్యవేక్షణ కమిషన్ చట్టం–2019 పేరుతో ప్రభుత్వం ఇప్పటికే చట్టాన్ని చేయడం తెలిసిందే. ఇది నవంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. పాఠశాలల్లో విద్యాప్రమాణాల నిర్వహణ, ఫీజుల క్రమబద్ధీకరణ, ఉపాధ్యాయుల అర్హత, పాఠశాలల తనిఖీ, పర్యవేక్షణ చేపట్టేలా కమిషన్‌కు ఈ చట్టం అధికారాన్ని కల్పించింది. అయితే కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారం ఫీజులను పెంచుకుంటూ పోతున్న నేపథ్యంలో.. జూనియర్ కాలేజీల్లోనూ అధిక ఫీజుల వసూలును నియంత్రించేందుకు కమిషన్ పరిధిని ఇంటర్ వరకు విస్తరింపచేయాలని ప్రభుత్వం అప్పట్లోనే ప్రతిపాదించింది. అయితే అప్పటికే శాసనసభ ప్రొరోగ్ అవడంతో అక్టోబర్ 30న రాష్ట్ర గవర్నర్ ఆ చట్టానికి సవరణ ఆదేశాలు జారీచేశారు. ఈ ఆదేశాల స్థానంలో ప్రభుత్వం తాజా సవరణ బిల్లును ప్రస్తుతం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. గతంలో 'సెకండరీ విద్య' వరకు మాత్రమే వర్తించేలా ఈ చట్టంలో నిబంధనలు పొందుపర్చగా మంగళవారం ప్రవేశపెట్టిన సవరణ బిల్లులో ఇంటర్మీడియెట్ విద్యను చేర్చింది.

# ఇక మార్కెట్ యార్డుల్లోనూ ఉల్లి

**రైతు బజార్లలో యథాతథంగా అమ్మకాలు**

**ఉల్లిపై చర్చలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి**

సాక్షి, అమరావతి

ప్రజలు ఇక్కట్లు పడకుండా రైతు బజార్లలో కిలో రూ.25 చొప్పున విక్రయాలు కొనసాగిస్తూనే వచ్చే శుక్రవారం నుంచి మార్కెట్ యార్డులలోనూ ఉల్లిగడ్డలను అమ్మిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రజలకు మంచి జరగాలన్నదే తమ ధ్యేయమని, అందుకోసం ఎంత ఖర్చయినా పర్వాలేదన్నారు. ఈనెల 12, 13 తేదీలలో విదేశాల నుంచి ఉల్లిగడ్డలు ముంబయి పోర్టుకు రానున్నాయని, వాటిల్లోనూ మన రాష్ట్రానికే అత్యధికంగా కేటాయించాలని ఇండెంట్ పెట్టామన్నారు. ఉల్లిపై మంగళవారం రాష్ట్ర శాసనసభలో చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి ఈ విషయం చెప్పారు. ఉల్లిపై ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడం బాధనిపిస్తోందన్నారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

> ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే కిలో రూ.25 చొప్పున 38,496 క్వింటాళ్లు సరఫరా చేశాం. ఏ రాష్ట్రంలోనూ ఇవ్వని విధంగా సబ్సిడీ ఇస్తున్నాం. ఈ స్థాయిలో ధరల విషయంలో జోక్యం చేసుకున్న రాష్ట్రం దేశంలో ఏదీ లేదు. సెప్టెంబర్ 27న ఉల్లి మార్కెట్‌లో తొలిసారి జోక్యం చేసుకున్నాం. ఆ తర్వాత నుంచి నిత్యం పర్యవేక్షిస్తున్నాం.

**ఏపీలోనే తక్కువ ధర**

'దేశంలో ఉల్లిని తక్కువ ధరకు విక్రయిస్తున్న రాష్ట్రాలలో నంబర్ వన్ రాష్ట్రం మనదే. బిహార్‌లో కిలో ఉల్లి రూ.35, పశ్చిమ బెంగాల్‌లో రూ.59, తెలంగాణలో రూ.40, తమిళనాడులో రూ.35–40 మధ్య, మధ్యప్రదేశ్‌లో రూ.50 చొప్పున పరిమితమైన సరుకు అమ్ముతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే కిలో రూ.25 చొప్పున విక్రయిస్తున్నాం. తెలంగాణలో ఒకే ఒక్క రైతుబజార్లో 25 టన్నులు, తమిళనాడులో 50 టన్నులు కన్నా తక్కువగా విక్రయించారు. బిహార్‌లో నవంబర్ 22 నుంచి 28 వరకు అమ్మకాలు జరిగాయి. మహారాష్ట్రలో ఇంకా మొదలు కాలేదు. కేంద్ర ప్రభుత్వం దిగుమతి చేసుకుంటున్న ఉల్లిపాయల్లో అత్యధికంగా 2,100 మెట్రిక్ టన్నులకు మన రాష్ట్ర ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. ఈ సరుకు ఈనెల 12, 13 తేదీల్లో ముంబయికి రాబోతోంది. ప్రజలకు మంచి చేసే సమయంలో ఎలాంటి జాప్యం, లోపం చూపించాల్సిన అవసరం లేదని, కాస్త దూకుడు(అగ్రెసివ్)గా ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించాం. రైతు బజార్లలోనే కాకుండా వచ్చే శుక్రవారం నుంచి మార్కెట్ యార్డుల్లోనూ సబ్సిడీపై ఉల్లిపాయల అమ్మకం ప్రారంభిస్తాం. దేశంలో మరెక్కడా కూడా ఈ స్థాయిలో ప్రభుత్వం జోక్యం చేసుకోలేదు. అయినా ప్రతిపక్షం రాజకీయం చేస్తోంది. ఇది ధర్మమేనా? వాళ్లు గుండెల మీద చేయి వేసుకుని మనస్సాక్షిని ప్రశ్నించుకోవాలి' అని సీఎం వైఎస్ జగన్ అన్నారు.



### కొరత ఉన్నా ఇబ్బంది పడకుండా చూస్తున్నాం : మోపిదేవి



మార్కెటింగ్ శాఖ మంత్రి మోపిదేవి వెంకట రమణారావు ఉల్లిపై చర్చను ప్రారంభిస్తూ.. దేశ వ్యాప్తంగా సెప్టెంబర్ మధ్య నుంచి కొరత ప్రారంభమైందన్నారు. డిసెంబర్ మొదటి వారానికి హోల్‌సేల్ మార్కెట్లలో కిలో ఉల్లి రూ.100–130 మధ్య పలికిందని, ప్రస్తుతం రూ.80–100 మధ్య ఉందన్నారు. తక్కువ విస్తీర్ణంలో సాగు చేయడం వల్ల దిగుబడి తక్కువగా వచ్చిందని చెప్పారు. కర్ణాటక, మహారాష్ట్ర తదితర ఉల్లి సాగు చేసే రాష్ట్రాలలో పంట నష్టం జరిగిందని వివరించారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి సూచన మేరకు కిలో రూ.25కే వినియోగదారులకు సరఫరా చేస్తున్నామన్నారు. కర్నూలు, తాడేపల్లిగూడెం, హైదరాబాద్, షోలాపూర్, అల్వార్ మార్కెట్ల నుంచి ఉల్లిపాయలు తెప్పించామని తెలిపారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకోకుండా ప్రతిపక్షం దుర్బుద్ధితో విమర్శలు చేస్తోందని దుయ్యబట్టారు.

### ప్రతిదీ రాజకీయమేనా బాబూ?: కన్నబాబు



కిలో ఉల్లికి వంద రూపాయల సబ్సిడీ ఇచ్చిన ప్రభుత్వం ఈ దేశంలో ఎక్కడైనా ఉందా? అని వ్యవసాయ శాఖ మంత్రి కన్నబాబు విపక్షాన్ని ప్రశ్నించారు. రాజకీయాన్ని వ్యవసాయానికి ముడిపెట్టవద్దని చంద్రబాబుకు హితవు పలికారు. ప్రతిదాన్నీ రాజకీయం చేయాలని చూడడం బాబు దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. మహిళల భద్రతపై చర్చ జరుగుతుంటే సమయం, సందర్భం చూడకుండా శవం బొమ్మలతో ఉల్లిదండలు వేసుకుని వచ్చి ఆటంకం సృష్టిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడివాడలో ఓ వ్యక్తి సహజ మరణాన్ని తన రాజకీయ స్వార్థం కోసం వినియోగించుకోవడాన్ని ఆక్షేపించారు. చంద్రబాబు సోమవారం సభలో చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, సభను తప్పుదోవ పట్టించినందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంలో చంద్రబాబు, మంత్రి కొడాలి నాని మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం టీడీపీ సభ్యురాలు భవాని చర్చలో పాల్గొంటూ రేషన్ డిపోలలోనూ ఉల్లిని విక్రయించాలని, గ్రామ వలంటీర్లతో ఇంటింటికీ సరఫరా చేయించాలన్నారు.

### ముందే గుర్తించి చర్యలు : పార్థసారథి



అతివృష్టి, అనావృష్టి కారణంగా దేశంలో ఉల్లి కొరత ఏర్పడితే అదేదో మన రాష్ట్రం ఒక్కదానికే పరిమితమైన సమస్యగా విపక్షం చిత్రీకరిస్తోందని ఎమ్మెల్యే పార్థసారథి విమర్శించారు. సమస్య తీవ్రతను తమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మూడు నెలల ముందే గుర్తించి మార్కెట్‌లో జోక్యం చేసుకోండని అధికారులను ఆదేశించారన్నారు. ముందు చూపుతో వ్యవహరించినందు వల్లే ప్రజలకు ఇబ్బంది లేకుండా సరుకు తెప్పించి కిలో రూ.25కు సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఇవేవీ పట్టించుకోకుండా సహజ మరణాలను కూడా ఉల్లి మరణాలుగా చిత్రీకరిస్తూ ప్రతిపక్షం శవ రాజకీయం చేస్తోందని విమర్శించారు. జగన్ మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి కాగా, చంద్రబాబు రైతు వ్యతిరేకన్నారు. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి రైతులకు, వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చేస్తుంటే ఓర్వలేక బాబు విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. దళారులను నిలువరించిన ఘనత జగన్‌దేనని వివరించారు. డాక్టర్ వైఎస్సార్ పాలనలో రైతుకు జరిగిన మేలును ఈ సందర్భంగా ప్రస్తావించారు.

# మాటల తూటాలు..

- రైతు భరోసాపై అసెంబ్లీలో వాడి వేడి చర్చ
- నాలుగు, ఐదు విడతల్లో చెల్లించాల్సిన రుణమాఫీ సొమ్ముపై కోర్టుకెళతామన్న చంద్రబాబు
- బాబు మోసంపై వీడియో ప్రదర్శన, బడ్జెట్ లెక్కలతో వివరించిన మంత్రి బుగ్గన
- చర్చను పక్కదోవ పట్టించేలా చంద్రబాబు వ్యాఖ్యలు.. తిప్పికొట్టిన అధికార పక్ష సభ్యులు



**సాక్షి, అమరావతి :** అసెంబ్లీలో మంగళవారం 'వైఎస్సార్ రైతు భరోసా – పీఎం యోజన'పై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదాలు, విమర్శలు, ప్రతి విమర్శలతో వాడి వేడి చర్చ జరిగింది. మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, కన్నబాబు, కొడాలి నాని, ప్రతిపక్ష నేత చంద్రబాబు మధ్య మాటల తూటాలు పేలాయి. చర్చను పక్కదోవ పట్టించేలా చంద్రబాబు చేసిన వ్యాఖ్యల్ని అధికార పక్ష సభ్యులు అంబటి రాంబాబు, రోజాలు తిప్పికొట్టారు. దీంతో ప్రతిపక్ష నేత చంద్రబాబు ఎదురు దాడికి దిగారు. చివరకు వ్యక్తిగత వ్యవహారాలపైనా వ్యాఖ్యలు చేశారు. రుణమాఫీ పథకానికి పేరు పెట్టనందున 'చంద్రన్న దగా' అని పెడితే బాగుంటుందని మంత్రి కన్నబాబు ఎద్దేవా చేశారు. సభలో ప్రతిపక్ష నేత, సభా నాయకుడిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై మంత్రి కొడాలి నాని మండిపడ్డారు. తొలుత ప్రతిపక్ష నేత చంద్రబాబు మాట్లాడుతూ రైతులకు రూ.12,500 ఇస్తామని చెప్పి రూ.7,500 మాత్రమే ఇచ్చి మోసం చేశారని వ్యాఖ్యానించారు. నాలుగు, ఐదు విడతల్లో చెల్లించాల్సిన రైతు రుణమాఫీపై అవసరమైతే కోర్టుకు వెళతామన్నారు.

**తుస్సుమన్న చంద్రబాబు సవాల్**

హెరిటేజ్ తనది కాదని, నిరూపిస్తే ఎమ్మెల్యేగా, ప్రతిపక్ష నేతగా రాజీనామా చేస్తానని చంద్రబాబు సవాల్ చేశారు. దీనిపై ఆర్థిక మంత్రి స్పందిస్తూ రిటైల్ విభాగంలోని హెరిటేజ్ ఫ్రెష్‌ను ఫ్యూచర్ గ్రూప్‌నకు రూ.296 కోట్లకు విక్రయించారని, దీని ద్వారా చంద్రబాబుకు చెందిన హెరిటేజ్ గ్రూప్‌నకు ఫ్యూచర్ గ్రూప్‌లో 3.5 శాతం వాటా దక్కిందని ఆధారాలతో సహా వివరించారు. దీంతో చంద్రబాబు మిన్నకుండిపోయారు.

**రైతులకు మేలు చేసిన ఏకైక సీఎం జగన్ : మంత్రి కన్నబాబు**

అధికారంలోకి వచ్చిన రెండో ఏడాది నుంచి నాలుగేళ్ల పాటు రూ.50 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చినప్పటికీ రైతు కష్టాలు తెలిసిన నేతగా సీఎం వైఎస్ జగన్ ఈ పథకాన్ని ఐదేళ్ల పాటు అమలు చేయాలని నిర్ణయించారని వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు తెలిపారు. ఏడాదికి పెట్టుబడి సాయాన్ని రూ.12,500 నుంచి రూ.13,500కు పెంచారని తెలిపారు. పెట్టుబడి సాయాన్ని రూ.50 వేల నుంచి రూ.67,500కు పెంచడం విశేషమన్నారు. రైతు భరోసా మొదటి విడతగా మే నెలలో రూ.7,500, రెండో విడత అక్టోబర్‌లో రూ.4,000, మూడో విడత జనవరిలో రూ.2,000 సాయం అందుతుందని తెలిపారు. కౌలు రైతులతో పాటు దేవాలయ భూములు సాగు చేస్తున్న రైతులను, రికగ్నైజేషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్ (ఆర్వోఎఫ్ఆర్) కింద పట్టా పొంది సాగు చేస్తున్న గిరిజనులకు, భూసేకరణ చేసి పరిహారం అందని రైతులకు పెట్టుబడి సాయం అందించాలని సీఎం నిర్ణయించారని తెలిపారు. మొత్తం 45,82,500 రైతు కుటుంబాలకు రూ.5,230.24 కోట్ల లబ్ధి కలిగిందన్నారు. అర ఎకరంలో కూరగాయలు సాగు చేసే రైతులను కూడా ఈ పథకంలో లబ్ధిదారులుగా చేర్చామన్నారు. 10 సెంట్లలో తమలపాకు పండించే రైతులకు కూడా పెట్టుబడి సాయం అందిస్తున్నామన్నారు. వైఎస్ జగన్ మానసపుత్రిక రైతు భరోసా పథకం ప్రకటించే నాటికి పీఎం కిసాన్ యోజన పథకంపై ప్రకటన రాలేదని తెలిపారు. చంద్రబాబు అమలు చేసిన ఎన్టీఆర్ హౌసింగ్, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన, ఎన్టీఆర్ ఆరోగ్య సేవ, పింఛన్లు, చంద్రన్న బీమా ఇలా ఏ పథకం తీసుకున్నా.. కేంద్రం వాటా ఉందని గుర్తు చేశారు. రైతులు, కౌలు రైతులకు మేలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. ఒక్క ధాన్యం గింజ కూడా వదలకుండా కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించారని తెలిపారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబుకు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. కిలో ఉల్లి రూ.25కే అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని హిందూ పత్రికలో వచ్చిన వార్తను మంత్రి కన్నబాబు సభకు చూపించారు.

### బాబూ.. మీరు మాఫీ చేసిందెంత?: బుగ్గన



చంద్రబాబు తన హయాంలో ఎంత మొత్తం రుణమాఫీ చేశారని ఆర్థిక మంత్రి బుగ్గన ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు రైతు రుణాలన్నీ (రూ. 87,612 కోట్లు) బేషరతుగా మాఫీ చేస్తామని చెప్పిన బాబు, రూ.24 వేల కోట్లకు కుదించి.. రూ.15 వేల కోట్లే ఇచ్చారన్నారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ఇచ్చిన హామీల వీడియోలను సభలో ప్రదర్శించారు. చంద్రబాబు ఇంకా నేరపూరితంగా మాట్లాడుతున్నారంటే ఆయనకు హ్యాట్సాఫ్ అని వ్యాఖ్యానించారు. చంద్రబాబు నిర్వాకంతో బ్యాంకులు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌కు అనుగుణంగా కూడా లోన్‌లు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. సున్నా వడ్డీ పథకాన్ని కూడా రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాత సుఖీభవ పథకానికి కూడా డిస్కమ్ నిధులు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌ను తాకట్టు పెట్టి వాడారని మండిపడ్డారు. కేంద్ర పథకాలకు చంద్రన్న బాట, చంద్రన్న బీమా వంటి పేర్లు పెట్టుకున్నారని, నీరు–చెట్టు పథకంతో టీడీపీ నేతలు వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. రుణమాఫీపై చిత్తశుద్ధి ఉంటే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఎందుకు కేటాయింపులు జరపలేదని ప్రశ్నించారు. రైతులకు ఇచ్చిన రుణ ఉపశమన పత్రాలు పసుపు–కుంకుమ పొట్లాలు కట్టుకునేందుకు మాత్రమే ఉపయోగపడుతున్నాయని చెప్పారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ తనకు వయసు మళ్లిందని, 70 ఏళ్లు పైబడ్డాయని అంతా అంటున్నారని, తనకు 25 ఏళ్ల కుర్రాడి ఆలోచనలున్నాయని చెప్పారు.

## ఎమ్మెల్యేలు ఏమన్నారంటే..

### జగన్‌తో స్వర్ణ యుగం

రైతు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ స్వర్ణ యుగాన్ని తీసుకువచ్చారు. రైతులకు ఉచితంగా బోర్లు వేయించడానికి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 రిగ్గులు, లోక్‌సభ నియోజకవర్గానికి ఒకటి చొప్పున 25 రిగ్గులు కొనుగోలు చేయాలని నిర్ణయించడం ఈ ప్రభుత్వానికే సాధ్యమైంది. రైతుల కోసం ఇంతగా చేస్తుంటే.. పచ్చ చొక్కాల వారికి కనిపించకపోవడం వింతేమీ లేదు.

**– కాకాణి గోవర్ధన్‌రెడ్డి**

### చంద్రబాబు సభను పక్కదారి పట్టిస్తున్నారు

చంద్రబాబు రెచ్చగొట్టే కార్యక్రమంతో సభను పక్కదోవ పట్టిస్తున్నారు. టీడీపీ సభ్యులకు సభా సంప్రదాయాలు తెలియడం లేదు. ఉదయం నుంచి చంద్రబాబును గమనిస్తున్నా.. చాలా స్పీడ్‌గా మాట్లాడుతున్నారు. 25 ఏళ్ల వయసులో ఉన్నట్టు ప్రవర్తిస్తున్నారు. 150 మంది ఎమ్మెల్యేలు వచ్చినా ఎదుర్కొంటా అంటున్నారు.. ఇదేమన్నా.. ఫైటింగా? లేక మీరేమైనా బాహుబలా చంద్రబాబూ?.

**– అంబటి రాంబాబు**

### రైతులు అప్పుల పాలైంది నిజం కాదా?

టీడీపీ పాలనలో రైతులు 90 శాతం అప్పులపాలైంది నిజం కాదా?. చంద్రబాబు, ప్రతిపక్ష సభ్యులు వీధి రౌడీల్లా ప్రవర్తిస్తున్నారు. రైతుల విషయంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రెండు అడుగులు ముందుకేస్తే.. ఆయన కుమారుడు సీఎం వైఎస్ జగన్ నాలుగడుగులు ముందుకు వేశారు. రైతు భరోసా కార్యక్రమం నాలుగేళ్లు అమలు చేస్తానని ఐదేళ్లు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌దే.

**– ఆర్కే రోజా**

### బాబుకు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదు

అధికారంలో ఉన్నన్నాళ్లూ వ్యవసాయ రంగాన్ని పట్టించుకోని టీడీపీకి రైతుల గురించి మాట్లాడే అర్హత లేదు. బాబు హయాంలో మైదుకూరులో గిట్టుబాటు ధర లేక ఉల్లి రైతులు పంటను రోడ్లపైన పారబోశారు. టమాటాలను పొలాల్లోనే పశువులకు విడిచి పెట్టేశారు. రైతులను ఆదుకోవాలని తాము ధర్నాలు చేసినప్పటికీ చంద్రబాబు పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. అత్యధిక ధరలకు రైతుల నుంచి పంటలను కొనుగోలు చేస్తున్నారు. వినియోగదారులకు సబ్సిడీతో విక్రయిస్తున్నారు.

**– రఘురామిరెడ్డి**

### కౌలు రైతులను ఆదుకున్నది సీఎం జగనే

కౌలు రైతులను ఆదుకునేందుకు ఏకంగా చట్టం తీసుకువచ్చిన రైతు బంధు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చినవే కాకుండా ఇవ్వని వాటిని కూడా అమలు చేస్తూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది. ఇచ్చిన మాటకు కట్టుబడ్డ ప్రభుత్వాన్ని రైతులు సమర్థించడాన్ని సహించలేకే టీడీపీ అవాస్తవ విమర్శలు చేస్తోంది.

**– కరణం ధర్మశ్రీ**

# సమాన హక్కులెలా?

▶ మొదటి పేజీ తరువాయి

ఏటా డిసెంబరు 10వ తేదీని మానవ హక్కుల దినంగా పాటిస్తున్నారు. యూడీహెచ్ఆర్ రూపకల్పనలో భారత్‌కు చెందిన సంఘసంస్కర్త, విద్యావేత్త హన్సా జీవ్‌రాజ్ మెహతా కీలకపాత్ర పోషించారని, ఆ ప్రకటనలోని ఆర్టికల్ 1 ముసాయిదాలో 'ఆల్ మెన్ ఆర్ బోర్న్ ఫ్రీ అండ్ ఈక్వల్'అన్న వాక్యాన్ని హన్సా 'ఆల్ హ్యూమన్స్...'గా మార్చడానికి కృషి చేసి విజయం సాధించారని రాష్ట్రపతి గుర్తు చేశారు. అయితే స్త్రీ, పురుష సమానత్వం, మానవ హక్కుల విషయంలో హన్సా లాంటి దార్శనికుల స్వప్నాలను సాకారం చేసేందుకు చేయాల్సింది ఇంకా ఎంతో ఉందని రాష్ట్రపతి అన్నారు. సమాన హక్కులు, గౌరవమన్న విషయాల్లో మనల్ని మనం ప్రశ్నించుకోవడం ద్వారా ఈ దిశగా తొలి అడుగు వేయాలని సూచించారు.

**జాతిపిత చెప్పిందీ అదే..**

దురదృష్టవశాత్తూ ఇటీవలి కాలంలో జరుగుతున్న వరుస సంఘటనలు మనల్ని పునరాలోచనలో పడేస్తున్నాయని రాష్ట్రపతి ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై హింసాత్మక ఘటనలు పెరిగిపోతున్నాయని, ఇది ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రపంచమంతా మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోంది. దీనిపై ప్రతి ఒక్కరూ ఆత్మశోధన చేసుకోవాలి'అని ఆయన అన్నారు. దీంతోపాటు యూడీహెచ్ఆర్‌ను సమీక్షించి మానవ హక్కులను పునః నిర్వచించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. పిల్లలు, వెట్టిచాకిరీలో మగ్గుతున్న వారు, స్వల్ప నేరాలకు గాను దీర్ఘకాలంగా జైళ్లలో మగ్గుతున్న వారిపట్ల సానుభూతి చూపాల్సిన అవసరముందని, వీరి హక్కుల విషయంలో మరింతగా ఆలోచన చేయాల్సి ఉందని వివరించారు. మానవ హక్కుల విషయంలో ఆత్మశోధన ఎంత అవసరమో, సమాజం, తన హక్కుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవడమూ అంతే అవసరమని రాష్ట్రపతి తెలిపారు. జాతిపిత మహాత్మాగాంధీ సైతం మానవ హక్కులు, పౌర విధులు ఒకే నాణేనికి రెండు పార్శ్వాల వంటివని చెప్పారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ అధ్యక్షుడు జస్టిస్ హెచ్.ఎల్.దత్తు, భారత్‌లో ఐక్యరాజ్య సమితి రెసిడెంట్ కోఆర్డినేటర్ రెనెటా లోక్ డెస్సాలియన్ తదితరులు పాల్గొన్నారు.

# చతికిలబడ్డ ప్రతిపక్షం

▶ మొదటి పేజీ తరువాయి

మంత్రులు, అధికారపక్ష సభ్యులు ధ్వజమెత్తడంతో ప్రతిపక్షం వద్ద సమాధానమేలేకపోయింది.

**శవం దొరికింది కదా అని రెచ్చిపోతారా..?**

శాసనసభలో మంగళవారం టీ విరామం అనంతరం మార్కెటింగ్ శాఖ మంత్రి మోపిదేవి వెంకటరమణ ఉల్లిపై స్వల్పకాలిక చర్చను ప్రారంభించగా.. అనంతరం కొలుసు పార్థసారథి మాట్లాడారు. ఆ తర్వాత వ్యవసాయ మంత్రి కన్నబాబు మాట్లాడుతుండగా.. చంద్రబాబు జోక్యం చేసుకుంటూ గుడివాడలో ఓ వ్యక్తి రైతుబజార్ వద్ద ఉల్లిపాయల కోసం క్యూలో నిలబడి చనిపోయాడని అన్నారు. ఈ దశలో పౌర సరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని జోక్యం చేసుకుని 'శవాల మీద రాజకీయం చేసిందెవరు. గుడివాడలో సాంబిరెడ్డి అనే వ్యక్తి గుండెపోటుతో మరణిస్తే ఆయన శవం బొమ్మలతో సభకొచ్చి గందరగోళం సృష్టించింది తమరు కాదా?. సాంబిరెడ్డి ఉల్లిపాయల కోసం క్యూలో నిలబడి చనిపోయాడని ఆయన కుటుంబ సభ్యులతో చెప్పించాలని ప్రయత్నించారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల డెస్క్ ఇన్‌చార్జ్‌లు, జిల్లా టీడీపీ నాయకుడు ఒకరు బాధితుని కుటుంబసభ్యులపై వత్తిడి తెచ్చి.. సాంబిరెడ్డి ఉల్లిపాయల కోసమే క్యూలో నిల్చొని చనిపోయాడని చెప్పించాలని ప్రయత్నించారు. అలా చెబితే తెల్లారేసరికి చంద్రబాబు గుడివాడ వస్తారని.. రూ.25 లక్షల నష్టపరిహారం వచ్చేలా చూస్తారని చెప్పిన మాట నిజమా? కాదా?. ఎంత వత్తిడి చేసినా సాంబిరెడ్డి కుటుంబీకులు మాత్రం తమ ఇంటికి రావొద్దని తెగేసి చెప్పి నిజాయితీని చాటుకున్నారు. ఈ రాష్ట్రం నీ జాగీరు కాదు. గుడివాడలో ఉన్నది కొడాలి నాని అని గుర్తు పెట్టుకో' అంటూ చంద్రబాబును దులిపేశారు. అనంతరం సాంబిరెడ్డి కుమారుడు, బావమరిది చెప్పిన మాటలున్న వీడియోను సభలో ప్రదర్శించారు. అందులో 'ఉల్లిపాయల కోసం క్యూలో నిలబడాల్సిన ఖర్మ తమ కుటుంబానికి లేదని, సాంబిరెడ్డి గుడికి వెళ్తొస్తూ మార్కెట్ నుంచి కూరగాయలు తీసుకొస్తుంటారని, అదే క్రమంలో సోమవారం ఆయన మార్కెట్‌కు వెళ్లినప్పుడు గుండెపోటుతో కుప్పకూలి మరణించారని' సాంబిరెడ్డి కుటుంబీకులు వివరించారు. ఎక్స్‌గ్రేషియో కోసం పాకులాడాల్సిన దుస్థితిలో తమ కుటుంబం లేదన్నారు. టీడీపీ వాళ్లు తమ కుటుంబాన్ని రాజకీయాల్లోకి లాగాలని చూడడం, చావును రాజకీయం చేయాలని చూడటం దుర్మార్గమని ఆ వీడియోలో వివరించారు. పిచ్చిరాతలు రాసే వారిపై అవసరమైతే పరువు నష్టం దావా వేస్తామని కూడా స్పష్టం చేశారు. దీంతో కంగుతిన్న ప్రతిపక్షానికి నోట మాట లేకుండాపోయింది.

**హెరిటేజ్‌లో రూ.200కి అమ్మడం నిజం కాదా..**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబుకు చెందిన హెరిటేజ్ సంస్థలో కిలో ఉల్లిని రూ.200కు అమ్ముతున్నారనడంతో ఉలిక్కిపడిన చంద్రబాబు 'హెరిటేజ్ ఫ్రెష్ నాది కాదు. ఫ్యూచర్ గ్రూప్‌నకు అమ్మేశాం. అది నాదని నిరూపిస్తే నేను రాజీనామా చేస్తా. లేకుంటే మీకు ముఖ్యమంత్రిగా ఉండే అర్హత లేదు. ఏదిపడితే అది మాట్లాడటానికి వీల్లేదు' అంటూ శివాలెత్తారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ జోక్యం చేసుకుంటూ ఫ్యూచర్ గ్రూప్‌లో చంద్రబాబుకు 3.65 శాతం షేర్లు ఉన్నట్లు బిజినెస్ స్టాండర్డ్ పత్రికలో వచ్చిన కథనాన్ని సభ ముందుంచి బాబును ఆత్మరక్షణలో పడేశారు. షేర్లు ఉన్నాయో లేవో చెప్పాలని నిలదీశారు. దీంతో ఉక్కిరిబిక్కిరైన చంద్రబాబు తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదంటూ సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించి బయటకు వెళ్లిపోయారు.

**రైతుభరోసాపైనా ఇరకాటమే..**

రైతు భరోసాపై చంద్రబాబు మాట్లాడుతూ రైతులకు రూ.12,500 ఇస్తామని చెప్పి రూ.7,500 మాత్రమే ఇచ్చి జగన్ మోసం చేశారని వ్యాఖ్యానించారు. నాలుగు, ఐదు విడతల్లో చెల్లించాల్సిన రైతు రుణమాఫీపై అవసరమైతే కోర్టుకు వెళతామన్నారు. దీనిపై మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, కన్నబాబు, కొడాలి నాని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం పీఎం యోజన ప్రకటించడానికి ముందే జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా పథకాన్ని ప్రకటించారని గుర్తుచేశారు. బేషరతుగా రుణమాఫీ చేస్తానన్న చంద్రబాబు చివరకు దానిని చంద్రన్న దగాపథకంగా మార్చారని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ఇచ్చిన హామీల వీడియోలను సభలో ప్రదర్శించారు.

# నాణ్యమైన బియ్యమే ఇస్తాం

**విపక్షం ఓర్వలేక సన్న బియ్యం అంటూ గందరగోళం సృష్టిస్తోంది**

**అసెంబ్లీలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టీకరణ**

- శ్రీకాకుళంలో పైలట్ ప్రాజెక్టు కొనసాగుతోంది..
- పేదలు ఈ బియ్యాన్ని అమ్ముకోకుండా తినగలిగేలా ఇస్తున్నాం
- ఏప్రిల్ నుంచి రాష్ట్రమంతటా స్వర్ణ తరహా నాణ్యమైన బియ్యం
- ఈ పథకానికి అదనంగా రూ.1,400 కోట్ల ఖర్చు

**సాక్షి, అమరావతి:** వచ్చే ఏప్రిల్ నుంచి రాష్ట్ర మంతటా పేదలకు నాణ్యమైన స్వర్ణ తరహా బియ్యాన్ని అందిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం శాసనసభలో తెలిపారు. తమ మేనిఫెస్టోలో లేని ఈ పథకం కోసం అదనంగా రూ.1,400 కోట్లు ఖర్చు పెడుతున్నామని చెప్పారు. సన్నబియ్యం ఇస్తామని చెప్పి మాట మార్చారంటూ ప్రశ్నోత్తరాల సమయంలో టీడీపీ సభ్యులు చేసిన ఆరోపణలపై సీఎం సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం ఏమన్నారంటే..

**ఇదీ మా చిత్తశుద్ధి..**

'అధ్యక్షా.. ఇదీ మా మేనిఫెస్టో. పాదయాత్రలో ప్రజల దగ్గర నుంచి రకరకాల సూచనలు తీసుకున్నాం. ఎన్నికలకు వెళ్లే ముందు దీన్ని విడుదల చేశాం. టీడీపీ వాళ్లకు మేనిఫెస్టో మీద గౌరవం లేదు. దాన్ని చెత్తబుట్టలో వేశారు. ప్రజలు కొడతారని ఆన్‌లైన్ నుంచి కూడా తీసేసిన చరిత్ర వాళ్లది. కానీ మా మేనిఫెస్టో మాకు బైబిల్, ఖురాన్, భగవద్గీత. ఇందులో ప్రతిదీ చేస్తామని చెప్పి ఓట్లడిగాం. ఈ రకమైన బియ్యం ఇస్తామని మేనిఫెస్టోలో ఎక్కడా పెట్టలేదు. కావాలంటే అద్దాలు సరిచేసుకుని చూసుకోండి. అసలు మేనిఫెస్టోలో చెప్పని కార్యక్రమాన్ని చేసి చూపించాలని, ప్రజలకు మంచి చెయ్యాలనే తపన, తాపత్రయంతో ఉన్నామనేది ముందుగా అర్థం చేసుకోవాలి.



పేదలకు నాణ్యమైన బియ్యం ఇచ్చే కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభించాం. ఈ బియ్యాన్ని పేదలు అమ్ముకోకుండా తినగలిగేలా ఇస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని శ్రీకాకుళంలోనే కాకుండా రాష్ట్రమంతటా ఎందుకు అమలు చేయడం లేదని టీడీపీ వాళ్లే అడుగుతున్నారు. దీన్నిబట్టి అక్కడ నాణ్యమైన బియ్యం ఇస్తున్నామని వారు కూడా ఒప్పుకుంటున్నట్లే కదా! ఏప్రిల్ నుంచి ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర మంతటా విస్తరింప చేసేందుకు అన్ని రకాలుగా సన్నద్ధమవుతున్నాం.

–సీఎం వైఎస్ జగన్

**గర్వంగా చెబుతున్నాం**

చంద్రబాబు హయాంలో పంపిణీ చేసిన బియ్యాన్ని ప్రజలు తినలేక అమ్ముకున్నారు. ప్రజలు రూపాయికి తీసుకున్న బియ్యాన్ని డీలర్ రూ.7కు కొనుగోలు చేస్తే, వీరి నుంచి రైస్ మిల్లర్లు ఇంకో రెండు రూపాయలు ఎక్కువకు కొనుగోలు చేసి.. అదే బియ్యాన్ని రీ పాలిష్ చేసి వాటిని తిరిగి ప్రజా పంపిణీ వ్యవస్థలోకి తీసుకొచ్చిన పరిస్థితి. ప్రజలు ఏమాత్రం తినలేని బియ్యం ఇచ్చే ఈ పథకాన్ని పూర్తిగా మార్పు చేసి, నాణ్యమైన బియ్యాన్ని అందించాలనుకుంటున్నాం. పైలట్ ప్రాజెక్టు కింద శ్రీకాకుళం జిల్లాలో మేం ప్యాకెట్లు కట్టి.. సార్టెక్స్ చేసి ఇస్తున్నాం. ఈ బియ్యాన్ని, గతంలో చంద్రబాబు హయాంలో ఇచ్చిన బియ్యం నాణ్యతను పోల్చి చూడండి. ఇప్పుడు ప్రతి ఒక్కరూ ఆనందంగా తింటున్నారని ఈ సభలో గర్వంగా చెబుతున్నాను. ఆరు నెలలు పైలెట్ ప్రాజెక్టు ఇక్కడ నడుస్తుంది. 80 శాతం స్వర్ణలాంటి క్వాలిటీ పెంచిన బియ్యం ఇక్కడ పంపిణీ చేస్తున్నాం. ఇందులోనూ 20 శాతం వేరే బియ్యం ఉన్నాయి. వచ్చే ఏప్రిల్ నాటికి ఈ 20 శాతం కూడా పోయి, వంద శాతం స్వర్ణలాంటి నాణ్యమైన బియ్యాన్ని ప్రతి జిల్లాలోనూ ఇస్తాం. గత ప్రభుత్వం కొనుగోలు చేసిన బియ్యాన్ని (ప్రస్తుతం గోడౌన్లలో ఉన్నాయి) డిసెంబర్ నాటికి పూర్తిగా పంపిణీ చేస్తాం. నేనేమన్నా.. మీరేమంటున్నారు? నేనేం చెప్పానో ఓసారి వీడియో చూద్దాం. (పలాస సభలో సీఎం మాట్లాడిన క్లిప్పింగ్ చూపించారు.) మేనిఫెస్టోలో లేని పనులు కూడా ఈ ప్రభుత్వం చేస్తుంటే, అది కూడా జీర్ణించుకోలేని వీళ్ల ఈర్ష్య, దురద చూస్తుంటే పిచ్చాసుపత్రిలో తప్ప వీళ్లను నయం చేసే వాళ్లు ఎవరూ ఉండరు.

**నూకలు, రంగు ఉన్న గింజ శాతం తగ్గిస్తాం**

ఖరీఫ్, రబీ సీజన్‌లో మేం స్వర్ణ లేదా అలాంటి నాణ్యమైన రకాలకు చెందిన ధాన్యాన్నే ఈ పథకం కోసం సేకరించండని ఆదేశాలిచ్చాం. ఆరు నెలలు నిల్వబెట్టి మరీ ఇస్తాం. ఇంతకు ముందు పంపిణీ చేసిన బియ్యంలో నూకలు 25 శాతం ఉండేవి. మేం అందించే బియ్యంలో దీన్ని 15 శాతానికి తగ్గిస్తాం. 3 శాతం ఉండే డ్యామేజీ, రంగు మారిన (డిస్కలర్) బియ్యాన్ని 0.75 శాతానికి పరిమితం చేయాలని ఆదేశించాం. గతంలో 5 శాతం ఉన్న షాకీగ్రేన్ ఒక్క శాతంకు మించి ఉండకూడదని చెప్పాం' అని సీఎం స్పష్టం చేశారు.

## ఇంగ్లిష్ వద్దన్న వారే యూటర్న్ తీసుకున్నారు

**ప్రతిపక్షాల తీరుపై విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్**

**సాక్షి, అమరావతి:** ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం వద్దన్న వారే యూటర్న్ తీసుకుని స్వాగతిస్తున్నట్లు చెప్పారని విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. శాసన మండలిలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంపై మంగళవారం జరిగిన స్వల్పకాలిక చర్చకు మంత్రి బదులిస్తూ.. పేద పిల్లల భవిష్యత్ కోసం అమల్లోకి తెస్తున్న ఇంగ్లిష్ మీడియంను దయచేసి అడ్డుకోవద్దని విజ్ఞప్తి చేశారు. 21వ శతాబ్దపు నవ తరం బంగారు భవిత కోసం ప్రాథమిక పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఇంగ్లిష్‌లో బోధన కోసం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో శిక్షణ కార్యక్రమాలు చేపడతామని, 13 జిల్లాల్లోనూ ప్రత్యేక శిక్షణ సెంటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో పాఠశాలల అభివృద్ధికి రూ.10 వేల కోట్లతో ప్రత్యేక ప్రాజెక్ట్ అమలు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు.

**ప్రతిపక్షాల బాయ్‌కాట్**

ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాలపై దాదాపు ఆరు గంటలపాటు సాగిన చర్చలో జంగా గౌతమ్ (వైఎస్సార్‌సీపీ), డొక్కా మాణిక్యవరప్రసాద్ (టీడీపీ), మాధవ్ (బీజేపీ), విఠపు బాలసుబ్రమణ్యం (పీడీఎఫ్) తదితర 13 మంది సభ్యులు పాల్గొన్నారు. మంత్రి బదులిస్తున్న సమయంలో ఇంగ్లిష్‌తోపాటు తెలుగు మీడియం పెడతారా? పెట్టరా? చెప్పండంటూ ప్రతిపక్షాలు అడ్డ తగిలాయి.




- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శాసనమండలిలో మంత్రి బుగ్గన వెల్లడి
- అన్ని రాష్ట్రాల్లో మాదిరే మన రాష్ట్రంలోనూ ఆదాయం తగ్గుదల

# ఆర్థిక మాంద్యం లేదు

**సాక్షి, అమరావతి:** దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మాదిరే మన రాష్ట్రంలోనూ ప్రభుత్వ ఆదాయం కొంత మేర తగ్గింది తప్పితే, ఆర్థిక మాంద్యం (రెసిషన్) వంటి పరిస్థితులు రాష్ట్రంలో లేవని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పారు. శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై జరిగిన చర్చలో మంత్రి జవాబిచ్చారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాదిలో కేవలం 8 శాతం మాత్రమే ప్రభుత్వ ఆదాయం తగ్గిందని తెలిపారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగని కారణంగా కేంద్రం నుంచి విడుదల కావాల్సిన నిధులు నిలిచిపోయాయని, ఆర్థిక సంఘం సిఫార్సులకు అనుగుణంగా రెవెన్యూ లోటు రూపంలో కేంద్రం రాష్ట్రానికి కేటాయించిన నిధులు తక్కువగా ఉండడం వంటి కారణాలతో ఆదాయం తగ్గిందని చెప్పారు. నేరుగా రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయం విషయంలో మాత్రం గత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల కాలంతో పోలిస్తే ఈ ఏడాది ఆ కాలానికి కేవలం నాలుగు శాతం మాత్రమే తగ్గుదల కనిపిస్తోందని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం తమ ప్రభుత్వానికి దాదాపు రూ. 60 వేల కోట్ల బిల్లుల బకాయిలు పెట్టిపోయిందని చెప్పారు. ఈ ఆరు నెలల్లో తమ ప్రభుత్వం రూ. 20 వేల కోట్ల బకాయిలు చెల్లించిందని చెప్పారు. రాష్ట్ర కాగా, తమ సూచనలు వినాలని నాలెడ్జ్ తెచ్చుకోవాలని టీడీపీ సభ్యుడు అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలపై బుగ్గన మండిపడ్డారు. నియోజకవర్గం అభివృద్ధి పనుల గురించి అప్పటి విపక్ష సభ్యులు అప్పటి సీఎంను కలిస్తే, తమ పార్టీ వాళ్లు కాదని, నిధులు ఇచ్చే ప్రసక్తే లేదని చెప్పారని తెలిపారు.

**రంగులపై మీరా విమర్శించేది?: పెద్దిరెడ్డి**



టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు శ్మశానం గోడలకూ ఆ పార్టీ రంగులు వేయించిందని.. ఇప్పుడు ఆ పార్టీ నేతలు సచివాలయ భవనాల రంగులపై తమ పార్టీని విమర్శించడం విడ్డూరంగా ఉందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండిపడ్డారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల్లో ఆయన మాట్లాడుతూ, టీడీపీ నేతలు ఆరోపణలు చేస్తున్నట్టు జాతీయ జెండాకు ఎక్కడా వైఎస్సార్‌సీపీ రంగు వేయలేదని వివరించారు. సర్పంచుల ఆధ్వర్యంలోనే గ్రామ సచివాలయాలు పనిచేస్తాయని, సచివాలయ భవనాలలోనూ సర్పంచికి ప్రత్యేకంగా ఒక గదిని ఏర్పాటు చేసినట్టు వివరించారు.

**మార్చిలోగా ఇమామ్‌లకు ఇళ్ల స్థలాలు: అంజాద్ బాషా**



అర్హత గల ఇమామ్‌లు, మౌజన్‌లకు వచ్చే ఏడాది మార్చిలోగా ఇళ్ల స్థలాలను కేటాయించి, రిజిస్టర్ చేయిస్తామని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా శాసనమండలిలో చెప్పారు. రాష్ట్రంలో సుమారు 9,000 మంది ఇమామ్‌లు, మౌజన్‌లు ఉన్నారని చెప్పారు. రాష్ట్ర రాజధానిలో కొత్తగా హజ్ హౌస్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకోసం రెండు మూడు స్థలాలు పరిశీలనలో ఉన్నట్టు తెలిపారు.

## మీడియా పాయింట్

**అనవసరంగా బురద జల్లుతున్నారు: కొరుముట్ల**

అతి త్వరలో 2100 మెట్రిక్ టన్నుల ఉల్లిపాయలు బాంబే పోర్టు నుంచి రాష్ట్రానికి వస్తాయని ఎమ్మెల్యే కొరుముట్ల శ్రీనివాసులు చెప్పారు. సీఎం వైఎస్ జగన్ మంచిగా పరిపాలన చేస్తుంటే చంద్రబాబు అనవసరంగా బురద చల్లుతున్నారని మండిపడ్డారు.

**సభను అడ్డుకుంటున్నారు: కాపు రామచంద్రారెడ్డి**

సభలో ఉల్లిపాయల ధరల గురించి చర్చ నడుస్తుంటే టీడీపీ నేతలు అడుగడుగునా అడ్డుకున్నారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు ప్రవర్తన, హావభావాలు చూసి వారి సభ్యులే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వానికి చంద్రబాబు మంచి సలహాలు ఇవ్వాల్సిందిపోయి అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

**ధాన్యం కొనుగోళ్లు మొదలైనా ఆరోపణలా: ఎలీజా**

ధాన్యం కొనుగోలు చేస్తున్నా చేయడం లేదంటూ పవన్ కల్యాణ్ పసలేని ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా విమర్శించారు. అన్ని జిల్లాల కంటే ముందుగా పంట చేతికి వచ్చే పశ్చిమ గోదావరి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు మొదలుపెట్టినా ఆరోపణలు చేస్తున్నారన్నారు.

**బాబు హయాంలోనూ ఉల్లి ధరలు పెరిగాయి: శ్రీదేవి**

చంద్రబాబు హయాంలోనూ ఉల్లి ధరలు పెరిగాయని.. అప్పటి ధరల పెరుగుదలకు ఆయన బాధ్యత వహిస్తారా అని ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ప్రశ్నించారు. ఎక్కువగా వర్షాలు పడడం వల్లే ఉల్లి పంట చేతికి రాక ధరలు పెరిగాయని చెప్పారు.

## స్వర్ణ రకమే సన్న బియ్యం

**మంత్రి రంగనాథరాజు**

**సాక్షి, అమరావతి:** స్వర్ణ రకాలనే సన్నబియ్యం అని అంటారని రాష్ట్ర మంత్రి చెరుకువాడ రంగనాథ రాజు తెలిపారు. ప్రభుత్వం దీన్నే రాష్ట్ర ప్రజలకు అందించాలని అనుకొందని చెప్పారు. సన్నబియ్యం ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదంటూ టీడీపీ సభ్యులు అచ్చెన్నాయుడు, రామానాయుడు మంగళవారం అసెంబ్లీలో ప్రశ్నించిన సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జోక్యం చేసుకున్నారు. బియ్యం మీద రంగనాథ రాజుకు మంచి అవగాహన ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో మంత్రి మాట్లాడుతూ.. స్వర్ణ వెరైటీ ఎంటీయూ 7029, 1121 రకాలు సన్నబియ్యాలని, 1010, 1001 అనేవి ముతక రకాలని తెలిపారు. అంతకు ముందు పౌర సరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని మాట్లాడుతూ, తాము సన్నబియ్యం ఇస్తామని ఎక్కడా చెప్పలేదన్నారు. అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శ్రీ రంగనాథరాజు మాట్లాడుతూ.. ఈ ఏడాది దాన్యం దిగుబడి బాగా పెరిగిందని, 60 లక్షల టన్నులకు పైగా ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.

**రాష్ట్రంలో 10 డయాలసిస్ కేంద్రాలు: ఆళ్ల నాని**

రాష్ట్రంలో పది డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉందని ఆరోగ్య వైద్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ఆళ్ల నాని మంగళవారం శాసనసభలో చెప్పారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అడిగిన లిఖిత పూర్వక ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. మైలవరం నియోజకవర్గంలోని ఓ కేంద్రంలో కూడా డయాలసిస్ సెంటర్ ప్రతిపాదన ఉందన్నారు. రాష్ట్రంలోని వివిధ డయాలసిస్ కేంద్రాలలో సుమారు పది వేల మంది డయాలసిస్ చేయించుకుంటున్నారని చెప్పారు.

# కలుషితం.. నదీజలం

▶ మొదటి పేజీ తరువాయి

డీవో 5 మిల్లీగ్రాములు, బీవోడీ మూడు మిల్లీ గ్రాముల వరకు ఉండవచ్చు.

- అడవి జంతువులు తాగడానికి, చేపల జీవనం, పెంపకానికి వినియోగించే నీటిలో పీహెచ్ 6.5 శాతం, డీవో లీటర్ నీటికి నాలుగు మిల్లీ గ్రాముల దాకా ఉండవచ్చు.

**కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం...**

- గోదావరి, కృష్ణా, పెన్నా, తుంగభద్ర, నాగావళి, కుందూ, మానేరు, కిన్నెరసానిలో కాలుష్య తీవ్రత ప్రమాదకర స్థాయికి చేరినట్లు తాజా సర్వేలో వెల్లడైంది.
- తెలుగు రాష్ట్రాల్లో ప్రవహించే నదుల్లో కోలి బ్యాక్టీరియా మోతాదు పరిమితి దాటింది. డీవో, బీవోడీ, పీహెచ్ శాతం కూడా అధికంగా ఉంది. శుద్ధి చేయకుండా నదీ జలాలను తాగితే మూత్రపిండాలు, శ్వాసకోస సంబంధ వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది.
- తెలుగు రాష్ట్రాల్లో అన్ని నదులతో పోల్చితే తుంగభద్రలో కాలుష్య తీవ్రత అధికంగా ఉంది. తుంగభద్ర జలాల్లో ఘన వ్యర్థాలు ఒక లీటర్ నీటిలో గరిష్టంగా 347 మిల్లీగ్రాములున్నాయి. ఇష్టారాజ్యంగా గనుల తవ్వకం, పారిశ్రామిక వ్యర్థాలు, మురుగు నీరు చేరడమే దీనికి ప్రధాన కారణం.
- కుందూ నదిలో కోలి బ్యాక్టీరియా వంద మిల్లీ లీటర్లకు గరిష్టంగా 900(టి.కోలి 800, ఎఫ్.కోలి 100) ఉండటం గమనార్హం.
- వంశధార నదీ జలాల్లో పీహెచ్, డీవో, బీవోడీ, టి.కోలి, ఎఫ్.కోలి, టీడీఎస్ శాతం ఇతర నదులతో పోల్చితే కాస్త తక్కువగా ఉన్నప్పటికీ శుద్ధి చేయకుండా తాగడం శ్రేయస్కరం కాదు.
- నదీ జలాల్లో కాలుష్య తీవ్రత వల్ల వన్య ప్రాణులు మృత్యువాత పడుతున్నాయి. మత్స్య సంపద కూడా అంతరిస్తోంది.



**నదుల్లో నీటి కాలుష్యం ఇలా..**

| నది పేరు | పీహెచ్ (శాతం) | డీవో (మిల్లీగ్రాములు) | బీవోడీ (మిల్లీగ్రాములు) | టి.కోలి (వంద మిల్లీలీటర్లకు) | ఎఫ్.కోలి (వంద మిల్లీలీటర్లకు) | టీడీఎస్ (మి.గ్రా) |
|---|---|---|---|---|---|---|
| గోదావరి | 7.9 | 7.0 | 1.7 | 120 | 9 | 280 |
| కృష్ణా | 7.8 | 6.7 | 1.3 | 300 | 100 | 254 |
| తుంగభద్ర | 7.6 | 6.5 | 1.5 | 600 | 100 | 347 |
| నాగావళి | 8.2 | 7.3 | 2.2 | 120 | 7 | 210 |
| కుందూ | 7.7 | 6.8 | 1.2 | 800 | 100 | 246 |



# రూ.1605 కోట్ల జీఎస్టీ బకాయిలు విడుదల చేయండి

**కేంద్ర ఆర్థిక మంత్రికి విజయసాయిరెడ్డి విజ్ఞప్తి**

**సాక్షి, న్యూఢిల్లీ:** జీఎస్టీ కింద ఆంధ్రప్రదేశ్‌కి రావలసిన రూ.1605 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి కేంద్ర ఆర్థిక మంత్రికి విజ్ఞప్తి చేశారు. రాజ్యసభలో మంగళవారం ప్రత్యేక ప్రస్తావన ద్వారా ఆయన ఈ అంశాన్ని లేవనెత్తుతూ.. రాష్ట్రం ఎన్నడూ లేనంత ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో జీఎస్టీ బకాయిల విడుదల మరింత జాప్యమైతే రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదని అన్నారు. జీఎస్టీ కారణంగా రాష్ట్ర ఆదాయంలో నష్టం వాటిల్లితే జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి మొదటి ఐదేళ్లూ ఆ నష్టాన్ని కేంద్రమే భరిస్తుందని చట్టం స్పష్టం చేస్తోందన్నారు. గతేడాది జీఎస్టీ కింద వసూలైన మొత్తం రూ. 95 వేల కోట్లని పేర్కొన్నారు. ఈ ఏడాది అక్టోబర్ చివరి నాటికి జీఎస్టీ వసూళ్లు రూ. 55 వేల కోట్లని, గతేడాది ఇదే కాలానికి వసూలైన మొత్తం కంటే ఇది 1.5 శాతం అధికమని చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ ఆదాయంలో నష్టాన్ని ఎదుర్కొంటోందని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. రెవెన్యూ అధికారుల లెక్కల ప్రకారం ఈ నష్టం రూ. 1,605 కోట్లని, ఈ నష్టాన్ని రెండు నెలలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం విధిగా భర్తీ చేస్తూ ఆ మేరకు నిధులు విడుదల చేయాల్సి ఉందని పేర్కొన్నారు. కానీ అక్టోబర్‌లో చెల్లించాల్సిన ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించిన బకాయిలు చెల్లించలేదని, డిసెంబర్10 నాటికి చెల్లించాల్సిన అక్టోబర్, నవంబర్ మాసాలకు చెందిన బకాయిలను కూడా చెల్లించలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. జీఎస్టీ కౌన్సిల్ ఈనెల 18న సమావేశం కానున్న తరుణంలో ఏపీకి చెల్లించాల్సిన రూ. 1,605 కోట్ల బకాయిలు తక్షణమే విడుదల చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. జీఎస్టీ నష్టాలను కేంద్రం భర్తీ చేసే గడువు 2022 వరకు పొడిగించాల్సిందిగా ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

### బేడ, బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలి: ఎంపీ వంగా గీత

బేడ, బుడగ జంగాలను తిరిగి ఎస్సీ జాబితాలో చేర్చాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ లోక్‌సభలో కేంద్రాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో బేడ, బుడగ జంగాలు ఎస్సీ సామాజిక వర్గంలో ఉండే వారని, 2014 రాష్ట్ర విభజన అనంతరం వారిని ఎస్సీ జాబితా నుంచి విడదీశారని ఆమె వివరించారు. నిరుపేదలైన వీరికి ప్రస్తుతం ఎస్సీ ధ్రువీకరణ అందడంలేదన్నారు. ఈ అంశంపై నియమించిన జేసీ శర్మ కమిటీ కూడా వీరిని ఎస్సీ జాబితాలో చేర్చాలని సిఫారసు చేసినందున వెంటనే దాన్ని అమలు చేయాలని కోరారు.

## వేగంగా వైఎస్సార్ కాపునేస్తం లబ్ధిదారుల గుర్తింపు

**సాక్షి, అమరావతి:** వైఎస్సార్ కాపునేస్తం లబ్ధిదారుల గుర్తింపు వేగంగా జరుగుతోంది. మంగళవారం నాటికి 2.10 లక్షల లబ్ధిదారులను వలంటీర్లు గుర్తించారు. కాపు, బలిజ, ఒంటరి, తెలగ కులాల మహిళలకు ఆర్థికసాయం అందించేందుకు ప్రభుత్వం కాపునేస్తం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే లబ్ధిదారుల గుర్తింపునకు ప్రభుత్వం ఎటువంటి గడువును నిర్ణయించలేదని కాపు కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ హరింద్రియ ప్రసాద్ తెలిపారు.

## మద్యపానీయాల నిరోధంపై 15న చర్చాగోష్టి

**నెహ్రూనగర్(గుంటూరు):** ఈ నెల 15న మద్యపానీయాల నిరోధం, భవిష్యత్ ప్రణాళికపై చర్చాగోష్టిని నిర్వహించనున్నట్లు మద్య విమోచన ప్రచార కమిటీ తెలిపింది. దీన్ని గుంటూరు సమీపంలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏఎన్‌యూ)లో నిర్వహించనున్నట్లు కమిటీ రాష్ట్ర చైర్మన్ వి.లక్ష్మణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చర్చాగోష్టిని మద్య విమోచన ప్రచార కమిటీ, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# రోడ్లు లేక రోగుల ప్రాణాలు పోతున్నాయి

**సాక్షి, న్యూఢిల్లీ:** గిరిజన సంక్షేమానికి అనేక కేంద్ర ప్రభుత్వ పథకాలు ఉన్నప్పటికీ గిరిజన ప్రాంతాల్లో తగినంత అభివృద్ధి లేదని వైఎస్సార్‌సీపీ ఎంపీ గొడ్డేటి మాధవి ఆందోళన వ్యక్తంచేశారు. చట్టసభల్లో రిజర్వేషన్లను మరో పదేళ్లపాటు పొడిగిస్తూ ప్రతిపాదించిన 126వ రాజ్యాంగ సవరణ బిల్లుపై మంగళవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆమె మాట్లాడారు. 'గ్రామీణ ప్రాంతాల్లో 45 శాతం ఎస్టీలు, పట్టణ ప్రాంతాల్లో 24 శాతం ఎస్టీలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారు. షెడ్యూల్డ్ తెగకు చెందిన వ్యక్తిగా చెబుతున్నా. నేటికీ గిరిజన ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన విద్య, సరైన జీవనోపాధి అందుబాటులో లేవు. తాగునీరు, ఆరోగ్య సేవలు సైతం సరిగా అందడంలేదు. గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కూడా సరిగా ఉండదు. మా అరకు నియోజకవర్గంలో రోడ్డు సౌకర్యం లేక రోగులు ఆస్పత్రికి చేరేలోగా ప్రాణాలు కోల్పోతున్నారు. అభివృద్ధి ఫలాలు అందుకోలేకపోవడానికి కూడా ఈ రహదారుల లేమి కారణమవుతోంది. అందువల్ల కేంద్రం గిరిజన ప్రాంతాల్లో ఎలాంటి ఆంక్షలు లేకుండా పీఎంజీఎస్‌వై పథకాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉంది..' అని పేర్కొన్నారు.

### సామాజిక అసమానతలు తొలగే వరకూ రిజర్వేషన్లు ఉండాలి

సామాజిక అసమానతలు తొలిగే వరకూ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ చింతా అనురాధ పేర్కొన్నారు. 'తరాలుగా సామాజికంగా ఎదుర్కొన్న అసమానతను రూపుమాపేందుకే ఈ రిజర్వేషన్లు. ఈ రిజర్వేషన్ల కారణంగానే వివిధ స్థాయిల్లో ఈ సామాజిక వర్గాలకు చెందినవారు పనిచేయగలుగుతున్నారు. అయినప్పటికీ ఇంకా ఈ వెనుకబాటుతనం పోలేదు. మరోవైపు కొన్నిచోట్ల తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రిజర్వేషన్లను దుర్వినియోగం చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులనూ అనధికారికంగా మళ్లిస్తున్నారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ కూడా దేశ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉంది. వీటిని భర్తీచేసేలా తగిన చర్యలు తీసుకోవాలి. మా ముఖ్యమంత్రి నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించారు. అన్ని పార్టీలు కూడా ఇలాంటి మార్పు తేవాలి' అని పేర్కొన్నారు.

### తిరుమల యాత్రికులపై జీఎస్టీ భారం వద్దు

తిరుమలకు వచ్చే భక్తులపై జీఎస్టీ భారం పడకుండా చూడాలని తిరుపతి ఎంపీ బల్లి దుర్గాప్రసాదరావు కేంద్రాన్ని కోరారు. ఈ అంశంపై ఆయన మంగళవారం లోక్‌సభ జీరోఅవర్‌లో మాట్లాడారు. ' దేశ విదేశాలకు చెందిన 1.5 లక్షల మంది భక్తులు రోజూ శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారు. రోజుకు దాదాపు లక్ష మంది ఇక్కడి అన్నప్రసాదం కాంప్లెక్స్‌లో భోజనం చేస్తారు. ఇక్కడ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకే భోజన సదుపాయం ఉంది. ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం కోసం భక్తులు ప్రైవేటు భోజన శాలలపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ ప్రైవేటు రెస్టారెంట్లు జీఎస్టీ కారణంగా ఇబ్బంది పడుతున్నాయి. అలాగే టీటీడీ నిర్వహించే చౌల్ట్రీలు, గదులకు కూడా జీఎస్టీ వర్తిస్తోంది. వీటిని వినియోగించే పేద, మధ్యతరగతి వారికి ఇది భారంగా పరిణమిస్తోంది. అందువల్ల యాత్రికులకు ఈ జీఎస్టీ భారం లేకుండా చూడాల్సిన అవసరం ఉంది. ఆర్థిక మంత్రి దీన్ని జీఎస్టీ కౌన్సిల్‌కు నివేదించాలని అభ్యర్థిస్తున్నాను' అని పేర్కొన్నారు.




## స్కిల్ బిల్డ్ ఫ్లాట్‌ఫాం ద్వారా ఉద్యోగాలు

**సాక్షి, న్యూఢిల్లీ:** దేశంలో యువత, విద్యార్థులకు సాంకేతికపరమైన శిక్షణ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఐబీఎం సంస్థతో కలిసి స్కిల్ బిల్డ్ ఫ్లాట్ ఫాంను ప్రారంభించినట్టు కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ శాఖ సహాయ మంత్రి అర్‌కే సింగ్ తెలిపారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. యూకే, జర్మనీ, ఫ్రాన్స్ తర్వాత ఈ కార్యక్రమం చేపట్టిన నాలుగో దేశం భారత్ అని మంత్రి తెలిపారు. రెండేళ్ల కాల వ్యవధి గల అడ్వాన్స్ డిప్లమో ఇన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, నెట్ వర్కింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ కోర్సులను ఐటీఐ, ఎన్‌ఎస్‌టీఐ విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. మంచి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఐబీఎం ఉద్యోగాలు కల్పిస్తుందన్నారు.

## 75 డిగ్రీ కళాశాలలకు నోటీసులు

- జారీ చేసిన ఉన్నత విద్యామండలి
- నిబంధనలు పాటించకపోవడమే కారణం
- నెలరోజుల్లోపు వివరణ ఇవ్వాలని ఆదేశం

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో నిబంధనలు పాటించని 75 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి మంగళవారం షోకాజ్ నోటీసులిచ్చింది. కళాశాలలకు అనుమతులెందుకు రద్దు చేయరాదో నెలరోజుల్లోపు వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. ప్రొవిజనల్ అనుమతులు తీసుకుని నిర్ణీత అయిదేళ్లలో నిబంధనల ప్రకారం అన్నిరకాల ఏర్పాట్లు పూర్తి చేస్తామని గతంలో ఆయా యాజమాన్యాలు కాలేజీలకు అనుమతులు తీసుకున్నాయి. తదుపరి మరో ఐదేళ్లకు అనుమతులు పొడిగించినా నిబంధనల ప్రకారం కళాశాలలను నిర్వహించడం లేదు. ఆ గడువు ముగిసేలోపు నిబంధనల ప్రకారం పూర్తిస్థాయి ఏర్పాట్లతో అనుమతి పొందాల్సి ఉన్నా గత మూడేళ్లుగా ఈ సంస్థలు అలాగే నడుస్తుండటంతో తాజాగా వీటికి మరోసారి ఉన్నత విద్యామండలి నోటీసులిచ్చింది.

# ఆర్టీసీ చార్జీలు స్వల్పంగా పెంపు

- నష్టాల్లో ఉన్న సంస్థను ఆదుకునేందుకే: యాజమాన్యం
- పెరిగిన చార్జీలు నేటి నుంచి అమల్లోకి..
- పల్లెవెలుగు, ఏసీ సర్వీసుల్లో కిలోమీటరుకు 10 పైసల పెంపు
- ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీల్లో కి.మీ.కు 20 పైసలు పెంపు

**సాక్షి, అమరావతి:** తీవ్ర నష్టాల్లో ఉన్న ఆర్టీసీని ఆదుకునేందుకు స్వల్పంగా చార్జీలను పెంచుతున్నట్లు యాజమాన్యం వెల్లడించింది. పెరిగిన చార్జీలు బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయని తెలిపింది. గత నాలుగేళ్లలో డీజిల్ లీటరు ధర రూ.49 నుంచి రూ.70కి చేరింది. దీని వల్ల సంస్థపై సుమారు ఏడాదికి రూ.630 కోట్ల అదనపు భారం పడింది. ఇతర విడి భాగాల రేట్లు, సిబ్బంది జీతభత్యాలు పెరగడం వల్ల మరో రూ.650 కోట్ల అదనపు భారం పడింది. అయితే ఈ భారం తట్టుకుని సంస్థ అంతర్గత సామర్థ్యం పెంచుకుని ఆక్యుపెన్సీ రేషియో 73 శాతం నుంచి 79 శాతానికి పెంచుకుంది. రోజు రోజుకు ఖర్చులు పెరగడం వల్ల, నష్టాలు పేరుకుపోవడం వల్ల స్వల్పంగా చార్జీలను పెంచక తప్పనిసరి పరిస్థితి ఏర్పడిందని ఆర్టీసీ యాజమాన్యం వివరించింది.

### ఎలాంటి భారం లేదు

సిటీ ఆర్డనరీ బస్సుల్లో మొదటి 11 స్టేజీలు అనగా, 22 కి.మీ. వరకు ఛార్జీలలో ఎలాంటి పెంపుదల లేదు. దీని ద్వారా దాదాపు 86 శాతం సిటీ బస్సు ప్రయాణికులపై ఎటువంటి భారం పడదు. పల్లెవెలుగు బస్సుల్లో మొదటి రెండు స్టేజీలకు అంటే పది కి.మీ. దూరం వరకు ఎలాంటి పెంపుదల లేదు. తదుపరి 75 కి.మీ. వరకు ప్రయాణించే ప్రయాణికులకు కేవలం రూ.5 పెంచారు. అలాగే దూర ప్రాంత ఏసీ సర్వీసుల్లో 5 నుంచి 7.5 శాతం మాత్రమే చార్జీలు సవరించారు.

### సవరించిన ఆర్టీసీ చార్జీలు ఇవే...

| సర్వీసు | పెంపు (కి.మీ.కు) (పైసలలో) |
|---|---|
| పల్లెవెలుగు | 10 |
| ఎక్స్‌ప్రెస్ | 20 |
| అల్ట్రా డీలక్స్ | 20 |
| సూపర్ లగ్జరీ | 20 |
| ఇంద్ర ఏసీ | 10 |
| గరుడ ఏసీ | 10 |
| అమరావతి ఏసీ | 10 |
| వెన్నెల స్లీపర్ ఏసీ | పెంపుదల లేదు |

# నేడు నింగిలోకి పీఎస్ఎల్‌వీ సీ-48

**చరిత్రాత్మక ప్రయోగం: ఇస్రో ఛైర్మన్ కె.శివన్**

**సూళ్లూరుపేట/తిరుమల:** పీఎస్ఎల్‌వీ సీ–48 ఉపగ్రహ వాహక నౌక బుధవారం సాయంత్రం 3.25 గంటలకు నింగిలోకి దూసుకుపోనుంది. నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని(షార్) మొదటి ప్రయోగ వేదిక నుంచి రోదసీలోకి పంపేందుకు ఇస్రో ఏర్పాట్లు పూర్తిచేసింది. మంగళవారం సాయంత్రం 4.40 గంటలకు ఇస్రో ఛైర్మన్ కె.శివన్ సమక్షంలో కౌంట్ డౌన్ ప్రక్రియ ప్రారంభించారు. పీఎస్ఎల్‌వీ సీ–48 ద్వారా 648 కిలోల బరువు కలిగిన రీశాట్–2 బీఆర్1 ఉపగ్రహంతోపాటు అమెరికాకు చెందిన 4 లీమూర్ అనే ఉపగ్రహాలు, టైవోక్–0129, ఆరు ఐహోప్‌శాట్ ఉపగ్రహాలు, జపాన్‌కు చెందిన క్యూపీఎస్–సార్, ఇటలీకి చెందిన తైవాక్–0092, ఇజ్రాయెల్‌కు చెందిన డచీఫ్యాట్–3 అనే ఉపగ్రహాలను 576 కి.మీ. ఎత్తులోని సన్ సింక్రనస్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టనున్నారు. కాగా, ఇస్రో ఛైర్మన్ కె.శివన్ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. పీఎస్ఎల్‌వీ సీ–48 రాకెట్ నమూనాను శ్రీవారి పాదాల చెంత ఉంచి పూజలు నిర్వహించారు. ఇది ఇస్రోకు చరిత్రాత్మక ప్రయోగమన్నారు.



LOK | SAATCHI & SAATCHI

సాక్షి

బుధవారం, డిసెంబర్, 11

# రష్యాకు శృంగభంగం!

అంతర్జాతీయ ఈవెంట్లలో అవకాశం దొరికిందే తడవుగా క్రీడాభిమానుల్ని అబ్బురపరిచి వారి హృదయాల్లో శాశ్వత స్థానం పొందడానికి.. చరిత్ర పుటల్లోకెక్కడానికి క్రీడాకారులంతా శక్తివంచన లేకుండా కృషి చేస్తారు. అందుకోసం తమ క్రీడా నైపుణ్యానికి నిరంతరం పదును పెట్టుకుంటూ, ఎంచుకున్న ఆటలో ప్రత్యర్థిని మట్టికరిపించడానికి అవసరమైన మెలకువలన్నీ నేర్చుకుంటారు. కానీ రష్యా ఈ మార్గాన్ని విడిచిపెట్టి తన ప్రతిభాపాటవాలన్నిటినీ దొంగచాటుగా నిషిద్ధ ఉత్ప్రేరకాలు వాడటంలో చూపించి, వాటి సాయంతో పతకాలు కొల్లగొడుతోందని ఏడెనిమిదేళ్లుగా ఆరోపణలుంటున్నాయి. వాటిని ఎప్పటికప్పుడు ఆ దేశం కొట్టిపడేస్తోంది. తమ క్రీడాకారుల్ని చూసి అసూయతో ఇలా తప్పుడు ఆరోపణలకు దిగుతున్నారని విరుచుకుపడుతోంది. కానీ గత నెలాఖరున ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ 'వాడా' నియమించిన కమిటీ అవన్నీ పచ్చి నిజాలని ధ్రువీకరించి, నాలుగేళ్ల పాటు రష్యాకు ఏ అంతర్జాతీయ పోటీల్లోనూ ప్రవేశం లేకుండా నిషేధించాలని సిఫార్సు చేసింది. తాజాగా ఆ సిఫార్సును 'వాడా ఆమోదించిన పర్యవసానంగా వచ్చే ఏడాది టోక్యోలో జరగనున్న ఒలింపిక్స్‌తోపాటు అదే సంవత్సరం జరిగే పారాలింపిక్స్, 2022లో జరగబోయే యూత్ ఒలిపింక్స్, వింటర్ ఒలింపిక్స్ క్రీడోత్సవాల్లో రష్యా జట్లు పాల్గొనడానికి వీలుండదు. అంతేకాదు... వచ్చే నాలుగేళ్లలో అది ఏ అంతర్జాతీయ క్రీడా పోటీలకూ ఆతిథ్యం కూడా ఇవ్వడం సాధ్యపడదు.

విశ్వవేదికల్లో నిర్వహించే క్రీడలు సమీపిస్తున్నాయంటే అందరిలోనూ ఉత్సాహం ఉంటుంది. స్వయంగా వీక్షిద్దామని వెళ్లినవారికి సరే... ప్రపంచంలో మూలమూలనా క్రీడాభిమానులకు అవి సాగినన్నాళ్లూ పండగే. అయితే వాటిల్లో ఆడుతున్నవారంతా ఉత్ప్రేరకాలు మింగి చెలరేగుతున్నారని తెలిస్తే వారంతా ఎంతో నొచ్చుకుంటారు. సోవియెట్ యూనియన్‌గా ఉన్నప్పుడు ఏ క్రీడలోనైనా పతకాలు రాబట్టుకోవడానికి అది విశేషమైన కృషి చేసేది. తాము నమ్మిన సిద్ధాంతాలకు అనుగుణంగా మొదట్లో అది అంతర్జాతీయ క్రీడోత్సవాలకు దూరంగా ఉన్నా 1952లో మొదటిసారి ప్రవేశించింది మొదలుకొని ఆ దేశ క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచేవారు. అన్ని ఈవెంట్లలో పోటీబడి పతకాలు సొంతం చేసుకునేవారు. సోవియెట్ విచ్ఛిన్నమయ్యాక 1992 నుంచి నాలుగేళ్లు అది అంతర్జాతీయ పోటీలకు దూరంగా ఉండిపోయింది. తిరిగి 1996లో తొలిసారి అట్లాంటా ఒలింపిక్స్‌లో ఆడింది. గత వైభవాన్ని అందుకోవడానికి రష్యా చేస్తున్న కృషిని ప్రపంచమంతా ప్రశంసించింది. అన్ని దేశాలూ దాని స్ఫూర్తితో తమ క్రీడాకారుల ప్రతిభాపాటవాలకు పదును పెట్టడానికి కృషి చేశాయి. కానీ రష్యా ప్రతిభకు మూలాలు నిషిద్ధ ఉత్ప్రేరకాల్లో ఉన్నాయని వెల్లడయ్యాక ప్రపంచమే నివ్వెరపోయింది. తొలిసారి 2014లో జర్మనీకి చెందిన చానెల్ ఏఆర్‌డీ ప్రసారం చేసిన డాక్యుమెంటరీ అందరినీ దిగ్భ్రాంతిపరిచింది. రష్యన్ అథ్లెట్లు ఒక పద్ధతి ప్రకారం డోపింగ్‌కు పాల్పడుతూ ప్రపంచ క్రీడలకు మచ్చ తెస్తున్నారని అది తేల్చి చెప్పింది. పర్యవసానంగా ఆ దేశానికి చెందిన క్రీడా బాధ్యులు పలువురు పదవులనుంచి తప్పుకున్నారు. ఈ చానెల్ వెల్లడించిన అంశాల్లో నిజానిజాలు తేల్చడానికి 'వాడా' అప్పట్లోనే ఒక నిజనిర్ధారణ సంఘాన్ని నియమించింది. ఆ మరుసటి ఏడాది ఏఆర్‌డీ రెండో డాక్యుమెంటరీ విడుదల చేసింది. రష్యా, కెన్యా అథ్లెట్లు అసాధారణమైన రీతిలో డోపింగ్‌కు పాల్పడ్డారని అంతర్జాతీయ అథ్లెటిక్ సంఘాల సమాఖ్య(ఐఏఏఎఫ్) డేటా ఆధారంగా ఆ డాక్యుమెంటరీ తేల్చి చెప్పింది. క్రీడా ప్రపంచంలో ఉన్నతంగా నిలవడం కోసం డోపింగ్‌ను రష్యా రాజ్య వ్యవస్థే ఒక క్రమ పద్ధతి ప్రకారం ప్రోత్సహిస్తున్నదని 'వాడా' నివేదిక కూడా ఆరోపించింది.

ఇప్పుడు రష్యాపై విధించిన నిషేధంమాటెలా ఉన్నా ఇన్నాళ్లుగా 'వాడా' ఏం చేసిందన్న ప్రశ్నలు తలెత్తకమానవు. రష్యా డోపింగ్ నిరోధక సంస్థ 'రుసాదా' తమ నిబంధనలకు అనుగుణంగా పని చేయడం లేదని 2015లోనే 'వాడా' ప్రకటించింది. కానీ ఆ తర్వాత కూడా రష్యా క్రీడాకారులు విశ్వ క్రీడావేదికల్లో పాలుపంచుకున్నారు. ఇప్పుడు కూడా 'మచ్చలేని' రష్యా క్రీడాకారులు స్వతంత్ర హోదాలో ఒలింపిక్స్‌లో పాల్గొనవచ్చునని 'వాడా' చెబుతోంది. తమ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవడం లేదని 'రుసాదా'పై అభియోగం మోపినప్పుడు అప్పట్లోనే నిషేధం దిశగా ఆలోచించివుంటే వేరుగా ఉండేది. 'వాడా' నివేదిక చూశాక రష్యా ప్రభుత్వం 'రుసాదా' అధిపతిని వెళ్లగొట్టింది. కానీ తమ క్రీడా మంత్రిత్వ శాఖకు ఈ కుంభకోణంతో ప్రమేయం లేదని తెలిపింది. ఈ విషయంలో నిష్పాక్షికంగా విచారణ జరిపితే తాము అన్నివిధాలా సహకరిస్తామని దేశాధ్యక్షుడు పుతిన్ అప్పట్లో తెలిపారు. కానీ మాస్కోలోని ల్యాబొరేటరీల్లో డోపింగ్ పరీక్షల నివేదికలన్నీ తారుమారయ్యాయని 'వాడా' 2016లో తేల్చింది. అప్పట్లో జరిగిన ఒలింపిక్స్‌లో రష్యా అథ్లెటిక్స్ విభాగంలో పోటీ పడకుండా నిషేధించింది. పూర్తిస్థాయి నిషేధానికి మరో మూడేళ్లు పట్టింది. ఈ మూడేళ్లలోనూ జరిగిన వివిధ క్రీడోత్సవాల్లో రష్యా పాల్గొనడం వల్ల వేరే దేశాల క్రీడాకారులకు అన్యాయం జరిగివుండదా అన్న సందేహం ఎవరికైనా కలుగుతుంది. నిరుడు సెప్టెంబర్‌లో 'రుసాదా'ను తిరిగి చేర్చుకున్నప్పుడు మాస్కో ల్యాబొరేటరీల్లోని డేటా తమకు ఇవ్వాలని 'వాడా' షరతు పెట్టింది. కానీ ఇష్టానుసారం మార్చి తమకు అందజేశారని అది ఆలస్యంగా తెలుసుకుంది. రష్యా క్రీడా ప్రపంచంలోని చీకటి కోణాల గురించి ఇప్పటికి పుంఖానుపుంఖాలుగా కథనాలు వెలువడ్డాయి. కొత్త కుంభకోణం వెల్లడైనప్పుడల్లా పాతది వెలవెలబోవడం రివాజుగా మారింది. పతకాల మోజులో పడి, అడ్డదారిలో వాటిని కొల్లగొట్టడానికి ప్రయత్నించి రష్యా ఇప్పుడు ప్రపంచం ముందు దోషిగా నిలబడింది. తన క్రీడాకారుల బంగారు భవిష్యత్తును తానే నాశనం చేసింది. 'వాడా' విధించిన నిషేధంపై అప్పీల్‌కు వెళ్లి ఇంకా తాను సుద్దపూసనని అది చెప్పుకోవడానికి ప్రయత్నిస్తుందా లేక క్షమాపణ చెప్పి నాలుగేళ్లపాటు అన్నిటికీ దూరంగా ఉండి ప్రాయశ్చిత్తం చేసుకుంటుందా అన్నది వేచి చూడాలి.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి శు.చతుర్దశి ఉ.10.38 వరకు, తదుపరి పౌర్ణమి, నక్షత్రం కృత్తిక ఉ.6.13 వరకు తదుపరి రోహిణి, వర్జ్యం రా.10.50 నుంచి 12.29 వరకు దుర్ముహూర్తం ప.11.30 నుంచి 12.13 వరకు అమృతఘడియలు... రా.3.45 నుంచి 5.25 వరకు.

**సూర్యోదయం :** 6.23
**సూర్యాస్తమయం:** 5.22
**రాహుకాలం :** ప. 12.00 నుంచి 1.30 వరకు
**యమగండం :** ఉ.7.30 నుంచి 9.00 వరకు

# ఎన్‌కౌంటర్లే ఏకైక పరిష్కారమా?



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

"చట్టాలను కఠినతరం చేసినా మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయి. ఇలాంటి నేరాలకు సంబంధించిన కేసుల్లో సత్వర తీర్పులు రాకపోవటం ఒక కారణం. సమాజంలో మార్పు కోసం కూలంకషమైన చర్చ జరగాలి"
– సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్

"అత్యాచార కేసుల్లో నిందితులను వెంటనే కొట్టి చంపాలని, ఉరి తీయాలని కోరడం సరైన నిర్ణయం కాదు. హత్య కేసుల్లో మరణశిక్షలు ఉన్నా హత్యలు జరుగుతూనే ఉన్నాయి, అలాగే 'రేప్' కేసుల్లో మరణశిక్ష విధించినా ఆ కేసులూ ఆగడం లేదు. మొత్తం సమాజ వ్యవస్థలో మార్పు రావాలి, జెండర్ సెన్సిబిలిటీ, నైతికతను పాటించడంలో నిబద్ధత ఉండాలి"
– ఐపీఎస్ (రిటైర్డ్) అధికారి సి. ఆంజనేయరెడ్డి

స్త్రీలపై అత్యాచారాలు, హత్యలు, అవమానకర పురుష ప్రవర్తనలూ గత 72 ఏళ్ల దేశ స్వాతంత్ర్య చరిత్రలో కొత్తేమీ కాదు, హైదరాబాద్ చరిత్రలో డాక్టర్ దిశ దారుణ హత్య, ఆ దుర్ఘటన ఆధారంగా న్యాయ స్థానాలతో నిమిత్తం లేకుండా జ్యుడీషియరీ పాత్రను పోలీసులే తమ చేతుల్లోకి గుంజుకుని నిందితులను ఎన్‌కౌంటర్ చేయడమూ, ఇదే ఆఖరి ఉదంతంగా భావించడానికి వీల్లేదు. ఈ ఉదంతం ఇలా ఉండగానే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఓ పోలీస్ జవాన్ తన సహచరుల పైననే కాల్పులు జరపగా ఆరుగురు జవాన్లు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. 'విశ్రాంతి కరువవడం, సెలవులు తక్కువ కావడం, మానసిక ఒత్తిళ్లకు గురైన ఫలితమే సహచర జవాన్లను అలా కాల్చి చంపడానికి కారణం' (6.12.2019 నాటి పత్రికా వార్తలు). ప్రస్తుతం మన దేశంలోని రాజకీయ, సామాజిక, ఆర్థిక వ్యవస్థ కొనసాగుతున్న తీరు తెన్నులకు ఇవి అద్దంపడుతున్నాయి. ఏడు దశాబ్దాలకుపైగా మన దేశంలో పేరుకుపోయి, రాజకీయనేతల, పాలక శక్తుల అండదండలతో నానాటికీ విజృంభిస్తున్న ధనస్వామ్య వ్యవస్థ, దాని స్వప్రయోజనాల కోసం పెంచగా.. పెరిగిపోతున్న సామాజిక, ఆర్థిక అసమానతలు, కుల, మత, వర్గ, వర్ణ వివక్షతో జన జీవనం రోజు రోజుకీ కునారిల్లిపోతోంది. చివరికి ఈ దుస్థితి ఎంతవరకు ఏ దశకు చేరుకుంటోందంటే– వ్యవస్థా నిర్వాహకులే కులాలమధ్య, మతాల మధ్య పొరపొచ్చాలు కల్పించి, ప్రజలమధ్య తగాదాలు, కొట్లాటలు సృష్టించడం ద్వారా 'విదూషకులు'గా మారి ఆనందిస్తున్నారు. ఈ వికృత 'ఆనంద తాండవం'లో భాగమే సామాజిక దౌష్ట్యాలకు అసలు కారకులెవరో తెలియనీయకుండా చేయడం. 'పూటబత్తెమే పుల్లవెలుగు'గా భావించే నిర్భాగ్యులూ పేద, మధ్య తరగతి, బడుగు బలహీన వర్గాల ప్రజలు, నిరక్షరాస్యులు, నిరుద్యోగులు దుర్ఘటనల మూలాలను తెలుసుకోకుండా వారిని పాలనా శక్తులు మైకంలోకి నెట్టివేస్తున్నాయి. తీరా ఈ ధనస్వామ్య పాలనా వ్యవస్థలు ఏ స్థాయికి దిగజారుతున్నాయంటే, ఘటనలపై సమగ్ర విచారణ జరిపి, అనంతరం నిందితులకు కఠిన శిక్షలను విధించే అవకాశాన్ని కోర్టులకు కల్పించకుండానే, వాటి పాత్రను పోలీసులకు అప్పగించి, సమగ్ర విచారణకు వీలులేని 'ఎన్‌కౌంటర్ల'తో, న్యాయస్థానాల ఉనికినే ప్రశ్నార్థకంగా మార్చుతున్నాయి. అత్యాచారాలు, హత్యలవల్ల బాధితులుగా మారిన వారు, వారి కుటుంబాలు క్రిమినల్ కేసుల్లో సత్వర న్యాయం కోసం ఎదురు చూడటాన్ని ఎవరూ తప్పుపట్టకూడదు. పాశవిక ఘటనలలో సత్వర న్యాయం కోసం, తక్షణ తీర్పుల కోసం చట్టాల్ని సవరించి తీరాలని ప్రజాక్షేమాన్ని, సమాజ శాంతిని కోరేవారంతా– ముందు ఆర్థిక, సామాజిక అసమానతలను రద్దుచేసే ఒకే నీతి, ఒకే న్యాయం అమలుకు పట్టుబట్టాలి. ఇంతకాలం దగా పడుతూ వచ్చిన అట్టడుగు వర్గాల, బడుగు, నిరుపేద బహుజనులకు, సంపన్న వర్గాలకు మధ్య వివక్షను, వ్యత్యాసాన్ని రద్దు చేయగల పరిణామానికి నాంది పలకగల వ్యవస్థను మాత్రమే ప్రజా బాహుళ్యం కోరుకుంటోంది.

మానవ హక్కుల కమిషన్‌గానీ, కేంద్ర ప్రెస్ కౌన్సిల్‌గానీ కోరలు పీకేసిన విచారణ సంస్థలుగానే మిగిలిపోతూ వచ్చాయి, వాటికి శిక్షలు ఖరాలు చేసి అమలుజరిపే శాసనాధికారం లేదు. ఇదే పరిస్థితి క్రిమినల్ చట్టాలలోని లోపాలకు వర్తిస్తుంది. ఈ దుస్థితికి కారణం– పాలనా వ్యవస్థలోని రాజకీయనేతలే నేరగాళ్లతో, కోటీశ్వరుల ప్రయోజనాలతో మిలాఖత్ కావడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నవారు కొందరూ.. పార్లమెంట్, అసెంబ్లీ సభ్యులలో కొందరూ మహిళలపై అత్యాచారాలలో, హత్యలలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాత్ర వహించడమూ! ఉత్తరప్రదేశ్‌లో పేరుమోసిన పాలకపక్ష శాసనసభ్యుడే ఉన్నావ్‌లో పేద మహిళపైన అత్యాచారానికి పాల్పడి తుదకు ఆమె కుటుంబ సభ్యుల మరణానికీ కారకుడయ్యాడు. ఢిల్లీలో సామాన్య పేద విద్యావంతురాలైన 'నిర్భయ' దారుణ హత్యోదంతంలో గత ఏడేళ్లుగా శిక్షలు ఖరారై కూడా అమలు జరక్కపోవడం, దేశంలో ఇంతవరకూ 35,000 మంది అత్యాచారాలకు, హత్యలకు గురి కావడం, వారి విచారణల, శిక్షల గతి ఏమైందో ఇంతవరకూ దేశ ప్రజలకు తెలియకపోవటం న్యాయ వ్యవస్థలో స్తబ్దతను వేనోళ్ల ప్రశ్నించడానికి ఆస్కారమైంది. అందుకే– హైదరాబాద్ దుర్ఘటన (దిశ) సందర్భంగా, ఆ ఘటన వెల్లడి కాకముందు బిడ్డ గతిని తెలుసుకునేందుకు 'దిశ' తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి రెండు పోలీస్ ఠాణాలకు కాళ్లకు బలపాలు కట్టుకునిపోగా, మూడు కిలోమీటర్ల పర్యంతం రెండు ఠాణాల పోలీసు అధికారులు ఫిర్యాదు నమోదు చేయడానికి మాది బాధ్యత కాదంటే మాది కాదని వారిని తిప్పి పంపడం జరిగింది. ఒక పోలీస్ స్టేషన్‌లో అయితే, 'మీ పిల్ల ఎవడితోనైనా లేచిపోయిందేమో' అని వెటకారం చేసి 'దిశ' తల్లిదండ్రులకు మనోవేదన కలిగించారంటే మన పోలీసుల శిక్షణా పద్ధతులు ఎంత లోపభూయిష్టంగా ఉన్నాయో తెలుస్తుంది. అంత నిర్లక్ష్యంగా వ్యవహరించిన కింది అధికారులను తరువాత ఉన్నతాధికారి 'సస్పెండ్' చేసినా, 'దిశ' హత్యా నిందితుల్ని తక్షణం గాలించి అరెస్టు చేయడానికి గల అవకాశం ఉండేది. కానీ అవకాశం కోల్పోయిన ఉన్నతాధికారులు తేలికైన 'ఎన్‌కౌంటర్' బాట పట్టవలసి వచ్చింది.

### రెండో మాట

ఇలాంటి ఘటనలో సత్వర న్యాయాన్ని ప్రజలు ఆశించడం సహజం. అయితే అది జరగనప్పుడే, పోలీసు యంత్రాంగం తన ఉనికి కోసం ఇతర మార్గాలు అనుసరించాల్సి వస్తుంది. అయితే అంతమాత్రాన, ఇదే వ్యవస్థలో మరో భాగమైన న్యాయ వ్యవస్థ పాత్ర మాత్రం ముగిసిపోయినట్టు భావించి పోలీసు యంత్రాంగం యథేచ్ఛగా 'ఎన్‌కౌంటర్ల'కు పాల్పడరాదు. అలా జరిగితే, ప్రజా బాహుళ్యంలో ఏ వర్గానికి ఆ వర్గం తామే 'చట్టం' అని భావించుకుని శాంతి భద్రతల సమస్యపై కోర్టులతోనూ, ఠాణాలతోనూ సంబంధం లేకుండా యథేచ్ఛగా వ్యవహరించే పెద్ద ప్రమాదం ఉంటుంది. అందుకే సుప్రీంకోర్టు సహితం 'పోలీసులే చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని అధికారం దుర్వినియోగం చేయడం ప్రభుత్వ ఉగ్రవాద చర్య (స్టేట్ టెర్రరిజం) అవుతుందని చెబుతూ 'పోలీసులు జరిపే ఎన్‌కౌంటర్లపై విచారణకు వివరమైన మార్గదర్శకాలను' ప్రకటించాల్సి వచ్చింది. ఆమధ్య ఛత్తీస్‌గఢ్‌లోని సర్కె గూడా గ్రామంలో 'నక్సలైట్లు' అనే పేరిట సంబంధంలేని 15మంది సామాన్య గ్రామీణుల్ని స్థానిక, కేంద్ర పోలీసులు హతమార్చారని ఆ ఘటనపై పూర్తి విచారణ జరిపిన మధ్యప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి వి.కె. అగర్వాల్ కమిషన్ ప్రకటిస్తూ, ఎదురుకాల్పుల్లో పోలీసులకు జరిగినట్లుగా చూపిన గాయాలను మాత్రం స్నేహపూర్వక గాయాలని (ఫ్రెండ్లీ ఫైర్) పేర్కొంది.

ఇక 'దిశ' దుర్ఘటన అలా ఉండగానే, అదే స్థాయిలో ఇంతకు ముందు, ఇటీవలికాలంలో బడుగు, బలహీన వర్గాల కుటుంబాలలో పేద ఆడపిల్లలపై సంపన్న కుటుంబీకులు జరిపిన అత్యాచారాలు, హత్యలు ఎలాంటి వాకబు, విచారణ లేకుండా, నమోదు కాకుండా, అరెస్టులు లేకుండా ముగిసిపోవడం దారుణమైన వివక్ష కాదా? అన్న ప్రశ్న తలెత్తింది. 'మా బిడ్డలూ ఆడబిడ్డలేకదా?' అన్న సూటి ప్రశ్నను దివంగత టేకు లక్ష్మి (ఆసిఫాబాద్), మానస (వరంగల్), సుద్దాల శైలజ (మంచిర్యాల), మనీషా (హాజీపూర్) తల్లిదండ్రులు, భర్తలూ సంధిస్తున్నారు. పాలకుల నుంచి, అంతరాల దొంతర్ల సమాజం నుంచి వీరు సమాధానాలు కోరుకుంటున్నారు. చివరికి అంతటి గుండెకోత మధ్య కూడా 'దిశ' తండ్రి, వీర సైనికుడైన శ్రీధర్‌రెడ్డి సహితం నిందితుల్ని 'చట్ట ప్రకారమే శిక్షించాలని' ఆ దిశగా చట్టాలను బలోపేతం చేయాలనీ కోరారు. అందుకే, ధనస్వామ్య వ్యవస్థలో ఉన్న ఇన్ని ప్రజా వ్యతిరేక అవలక్షణాల వల్లనే ప్రపంచ ప్రసిద్ధ సామాజిక శాస్త్రవేత్తలు ఒక చిరంతన సత్యాన్ని మన తలకెక్కించడానికి ఏనాడో ప్రయత్నించారు: 'సంపన్న వర్గ నాగరికతలో నేర చరిత్ర' ఎలా ఉంటుంది? ఆ వ్యవస్థలో ఓ తత్వవేత్త, భావాలను అందిస్తాడు, ఓ కవి కవితలు అల్లుకుంటూ పోతాడు, ఓ మతాచారి ప్రవచనాలు వల్లిస్తాడు, ఓ ప్రొఫెసర్ గ్రంథ రాజాల సారాంశాన్ని అందజేస్తాడు, ఓ నేరగాడు నేరాలు చేస్తూ పోతాడు. ఈ వ్యవస్థలో నేరానికి పాల్పడటం కూడా వస్తూత్పత్తి క్రమంలో సమాజంలో ఒక భాగంగానే సాగిపోతూ ఉంటుంది. ఇలా అటు సరుకుల ఉత్పత్తి క్రమానికి, సమాజానికి మధ్య ఏర్పడే అవినాభావ సంబంధాన్ని దగ్గరగా పరిశీలిస్తే– మనలో పేరుకున్న అనేక భ్రమలు, దురభిప్రాయాలు పటాపంచలైపోతాయి. ఎందుకంటే నేరస్తుడనేవాడు ఒక్క నేరాలు చేయడంతోనే ఆగిపోడు, ఆ నేరాలతో పాటు ఆ నేర చట్టాన్ని (క్రిమినల్‌లా) రూపొందించడానికి తోడ్పడతాడు. కథ అంతటితో ఆగదు, నేర చట్టం ఆధారంగా మన ప్రొఫెసర్ ఆపైన ఉపన్యాసాలు దంచుతాడు. ఆపైన వాటన్నింటినీ క్రోడీకరించి అదే ఆచార్యుడు ఓ ఉద్గ్రంథం రాసేసి ఆ సంకలనాన్ని మార్కెట్‌లోకి 'అమ్మకపు సరుకు'గా జనంలోకి తోసేస్తాడు.

అలా ఈ నేర వ్యవస్థ మొత్తం పోలీసు వ్యవస్థను సృష్టిస్తుంది, నేర న్యాయ వ్యవస్థ, కానిస్టేబుల్స్, జడ్జీలు, ఉరితీసే తలారులు, తీర్పరులూ ఏర్పడతారు. సామాజిక శ్రమ విభజన, మానవుడిలో విభిన్న కోణాలలో శక్తి యుక్తులు పెరగడానికి దోహద పడుతుంది. తద్వారా కొత్త అవసరాల్ని, వాటిని తీర్చుకునేందుకు కొత్త మార్గాల్ని వెతుకుతుంది. ఈ అన్వేషణలో భాగంగా నేర చట్టాన్ని, శిక్షాస్మృతి, పీనల్‌కోడ్‌ని, వాటి తోపాటు లెజిస్లేటర్లనూ ఉత్పత్తి చేస్తుంది. ఈ విధంగా నేరగాడు సమాజపు రొడ్డకొట్టుడు స్తబ్దతను చెదరగొట్టి, నిత్యం అభద్రతలో గడిపే 'భద్ర పురుషుల' జీవితాలకు భరోసాగా ఉంటాడు''! ఈ వ్యవస్థలోనే కొనసాగుతున్నవి మన జీవితాలు! నేరగాళ్లను ఉత్పత్తి చేసే దోపిడీ వ్యవస్థ స్థానంలో నవ్య సమాజ సృష్టిని స్ఫురింపజేసే పుడమితల్లికి పురుటి నొప్పులు ఎప్పటివో?!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### బాధ్యత



"ముస్లిం రాజ్యమైన నిజాంపై, అతడి రజాకార్లపై పోరాటానికి 1948లోనే హిందూ మహిళలు తుపాకులు పట్టారు. హత్యలు, అత్యాచారాలు, మతమార్పిళ్ల కారణంగా 1947లో పాకిస్తాన్‌లో 12.9 శాతం ఉన్న హిందువుల సంఖ్య 1.6 శాతానికి తగ్గిపోగా, బంగ్లాదేశ్‌లో 22 శాతం నుంచి 8.5 శాతానికి తగ్గిపోయింది. ఇక ఇండియాలో అయితే 85 శాతం నుంచి 79.6 శాతానికి హిందువులు తగ్గిపోయారు. హిందువులను కాపాడాల్సిన బాధ్యత హిందువులపైనే ఉంది"

– వినితా హిందుస్తానీ, టీచర్

### సిగ్గు



"సాంస్కృతికంగా నేను హిందువుగా పెరిగాను. కానీ, భారత పౌరసత్వానికి మతమే చట్టపరమైన ప్రమాణం అంటే నేను సిగ్గుతో తలదించుకుంటాను. సమానత్వ విధానాలతో మా జీవితాలను పంచుకున్న స్నేహితులకు ఎలా ముఖం చూపించాలో నాలాంటి ఎందరికో అర్థంకావడంలేదు"

– నేహా దీక్షిత్, జర్నలిస్ట్

### అభిప్రాయం



"ఆగస్టు నుంచి కూడా కశ్మీర్‌పై మన అభిప్రాయంలో ఎటువంటి మార్పు లేదు. దౌత్యవిధానం ద్వారా భారత్, పాక్ చర్చలు జరపాలని మనం పట్టుబడుతున్నాం. కశ్మీర్‌లో సమాచార వ్యవస్థను పునరుద్ధరించాలి. మన అభిప్రాయం స్థిరంగా ఉందని భారత్‌లో యూరప్ రాయబారి ఉగో అస్టుటో చెప్పారు"

– నయనిమా బసు, జర్నలిస్ట్

### అక్కడ



"స్వేచ్ఛాయుత, లౌకిక, సంస్కరణవాద ముస్లింలు బంగ్లాదేశ్, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్‌లో ముస్లిం ఛాందసవాదుల నుంచి వేధింపులు ఎదుర్కొంటున్నారు. ముస్లిం దేశాల్లో వారికి రక్షణ లేదు. వారికి అమెరికా, యూరప్ వీసాలు లభించవు. వాళ్లకేమవుతుంది? వాళ్లు నోరుమూసుకుని ఉండాలి లేదంటే చంపేస్తారు. ప్రవాసంలో ఉన్న రచయితనైనా సొంత ఇంట్లో ఉన్నట్లే ఉంది"

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

### మినహాయింపు



"ఏడు వందల సంవత్సరాలుగా ముస్లిం ఆక్రమణదారులు, వారి అనుయాయుల అకృత్యాలకు హిందువులమైన మనం ఎన్నో ఇబ్బందులు పడిన సంగతి అలా ఉంచితే, మనకు చెందిన 1/3వ వంతు భారత మాతను పాక్‌కు కేటాయించినందున అక్రమంగా ఇక్కడ ఉంటున్న ప్రతి ముస్లిమ్‌నూ తిరస్కరించే హక్కు కూడా మనకు ఉంది. మనస్సాక్షిగా తిరుగుబాటును ప్రకటించిన తారిక్ ఫతా, తస్లీమాలాంటివారికి మాత్రం మినహాయింపు ఉంటుంది"

– సుబ్రమణ్య స్వామి, బీజేపీ నేత

### ప్రమాణం



"సీఏబీ, ఎన్‌ఆర్‌సీ అమల్లోకి వచ్చినప్పటికీ నేను ఎటువంటి ఆధారాలు సమర్పించనని భారత రాజ్యాంగంపై ప్రమాణం చేస్తున్నాను. నా పౌరసత్వాన్ని నిరూపించుకోవాలన్న ఆలోచనే చాలా అమర్యాదకరంగా ఉంది. నాకే కాదు.. ప్రతి ఒక్కరి పరిస్థితీ అంతే"

– ఉమర్ ఖలీద్, సామాజిక కార్యకర్త

## ఇన్‌బాక్స్

### ప్రభుత్వాల 'దిశ' మారాలి

దిశపై జరిగిన మానవ మృగాల మారణహోమం ముగింపునకు ప్రపంచవ్యాప్తంగా అనూహ్యమైన ప్రతిస్పందన లభించింది. ఇది ఈ ఒక్క రోజుతోనే ఆగిపోయే సమస్య కాదు. మూలాలతో పెకలిస్తే తప్ప ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు. పుట్టిపెరిగిన ప్రదేశాలు, కుటుంబ వాతావరణం, ఆర్థిక అసమానతలు, ఇంకా అనేక సామాజిక కారణాలు యువతను పెడదారులు తొక్కిస్తున్నాయి. మహిళలపై లైంగిక దాడులు జరిగిన ప్రతి కేసులోనూ మద్యం, మత్తు పదార్థాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న దశల వారీ మద్యనిషేధంతో ఇటీవల కొన్ని జిల్లాల్లో క్రైమ్ రేట్ గతంతో పోలిస్తే కాస్త తగ్గుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఇది శుభపరిణామం. సంపూర్ణ మద్య నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయగలిగితే రాష్ట్రానికి సామాజికంగా, ఆర్థికంగా మౌలిక ప్రయోజనాలు చేకూరుతాయి. ఇలాంటి సందర్భాల్లో బాధితులకు న్యాయం త్వరగా అందేలా చట్టాలను సవరించాలి. ఇదే సమయంలో మహిళలపై వేధింపులకు పాల్పడేవారికి శిక్షలు త్వరితగతిన, కఠినంగా అమలయ్యే విధంగా చూడాలి. అనేక దేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులకు కఠిన శిక్షలు అమలవుతున్నాయి. మన దేశంలో మాత్రం నేరస్తుల్లో పరివర్తన కోసం యోచిస్తూ మన శిక్షాస్మృతికి అనుగుణంగా కోర్టులు తీర్పు చెబుతున్నాయి. అయితే ఇది తప్పు జరిగిపోయిన తర్వాత జరుగుతున్న తంతు. దీని వల్ల నేరప్రవృత్తి ఉన్నవారిలో ఆశించిన స్థాయిలో మార్పు రావడం లేదు. అసలు తప్పు చేయడానికి భయపడేటట్లు శిక్షా స్మృతిలో మార్పులు తీసుకురావాలి. మనం చేసే ప్రతి తప్పుకు ఎలాంటి శిక్ష పడుతుందన్నది ప్రతి విద్యార్థికి తెలియాలి. మరిన్ని కుటుంబాల్లో ఇటువంటి దురదృష్టకర సంఘటనలు జరక్కుండా ఉండాలంటే పాలనా యంత్రాంగం అవసరమైన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి పని చేయకతప్పదు.

నంబూరు రంగారావు, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, శ్రీకాకుళం
మొబైల్ : 94407 06700

# కార్పొరేట్ల లాభాలకే విత్తన చట్టం!

సందర్భం



సారంపల్లి మల్లారెడ్డి

కేంద్ర ప్రభుత్వం విత్తన చట్టం 2019 ముసాయిదాను విడుదల చేస్తూ నవంబర్ 15 నాటికి సూచనలు, సలహాలు, సవరణలు పంపాలని వెబ్‌సైట్‌లో పెట్టారు. చిత్తశుద్ధి లేని ప్రభుత్వం విత్తన బిల్లు తేవడానికి 2004 నుండి మల్లగుల్లాలు పడుతూనే వుంది. విత్తన కార్పొరేట్లకు లొంగి ప్రభుత్వాలు విత్తన చట్టం చేయడానికి ముందుకు రావడం లేదు. భారతదేశంలో హరిత విప్లవం కాలంలో విత్తనాలు దిగుమతి చేసుకోవడానికి వీలుగా 1966 విత్తన చట్టం తెచ్చారు. ఆ తర్వాత 1986లో సవరణ చేశారు.

ఇదే సందర్భంలో దేశీయ పరిశోధనల వల్ల విత్తనోత్పత్తి బాగా పెరిగింది. మన అవసరాలకు మించి విత్తనాలు ఉత్పత్తి చేసి విదేశాలకు ఎగుమతులు చేస్తున్నాము. బహుళజాతి సంస్థలు తమ టెక్నాలజీతో వచ్చి ఇక్కడ విత్తనం ఉత్పత్తి చేయడమే కాక రైతులు వాణిజ్యపరంగా సాగుచేయడానికి అమ్ముతున్నారు. ప్రస్తుతం మోన్‌శాంటో, డూపాయింట్, సింజెంటా, కార్గిల్ లాంటి కంపెనీలు భారతదేశంలో 20 శాతం విత్తనాలు అమ్ముతున్నాయి. లాభాలు ఆశిస్తున్న బహుళజాతి కంపెనీలు రైతులకు నాణ్యతలేని విత్తనాలను, కల్తీ విత్తనాలను సరఫరా చేసి వేల కోట్లు లాభాలార్జిస్తున్నారు. ఏటా ఉభయ తెలుగు రాష్ట్రాలలో 5.6 లక్షల ఎకరాలలో పంటలు దెబ్బతింటున్నాయి. దీనిపై రైతు సంఘాలు పెద్దఎత్తున ఆందోళన చేసి, మారిన పరిస్థితులకు అనుగుణంగా విత్తన చట్టం తేవాలని కోరాయి. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం విత్తన ముసాయిదా చట్టం తెచ్చింది. దానికి రైతులు, రైతు సంఘాలు, లా కమిషన్ చేసిన సూచనలను జతపరిచి బిల్లుగా రూపొందించి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. అయితే, బిల్లు ఆమోదం పొందకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. 2010లో కూడా అదే పరిస్థితి. రాజ్యాంగంరీత్యా విత్తన చట్టం రాష్ట్ర ప్రభుత్వాలు తేవాలి. కానీ కేంద్రం రాష్ట్రాలపై ఒత్తిడి తెచ్చి తానే చేస్తానని అన్ని రాష్ట్రాలను ఆదేశిస్తూ లేఖలు రాసింది. తిరిగి 2019 విత్తన ముసాయిదాలో కార్పొరేట్‌లకు స్వేచ్ఛ కల్పిస్తూ, రైతులు నష్టపోయిన ఎడల వినియోగదారుల కోర్టుకు వెళ్లమని బిల్లులో పెట్టింది. గత పదేళ్లలో వరంగల్, గుంటూరు వినియోగదారుల కోర్టుల్లో వేలాది కేసులు వేయడం జరిగింది. 80 శాతం కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. తీర్పు వచ్చిన 20 శాతం కేసులపై కంపెనీలు హైకోర్టులో అప్పీల్ చేశాయి. మొత్తంపై కంపెనీలు పరిహారం నుంచి తప్పించుకున్నాయి. కోరలు తీసిన ఈ బిల్లు రైతులకు ఏమాత్రం ఉపయోగపడదు. బిల్లులో ఈ సవరణలు చేర్చాలని కేంద్ర ప్రభుత్వానికి పంపడం జరిగింది.

1. సెక్షన్ 6 విత్తన నాణ్యతలో.. జర్మినేషన్ స్వచ్ఛతపై స్పష్టమైన వివరణ ఉండాలి. జర్మినేషన్ 80శాతం ఉండాలి. అంతకు తక్కువ ఉంటే లైసెన్స్ రద్దు చేయాలి. స్వచ్ఛత 100శాతం ఉండాలి.

2. సెక్షన్ 11 రాష్ట్ర విత్తన కమిటీలలో స్త్రీలతో సహా ముగ్గురు రైతు ప్రతినిధులను నియమించాలి.

3. సెక్షన్ 21 రైతుకు నష్టపరిహారంలో.. కంపెనీ లేదా దుకాణదారుడు రైతుకు మొత్తం పంట నష్టం చెల్లించాలి. కంపెనీ లైసెన్స్ రద్దు చేయాలి. పి.డి. చట్టాన్ని అమలు చేయాలి.

4. సెక్షన్ 23 విత్తన అమ్మకం డీలర్ల రిజిస్ట్రేషన్ చేయుటలో.. మైనర్లను డీలర్లుగా నియమించరాదు. వ్యవసాయ శాఖ ప్రాథమిక డిగ్రీ ఉన్నవారికే డీలర్ లైసెన్స్ ఇవ్వాలి. కాలం చెల్లిన విత్తనాలు అమ్మితే ఏడాది జైలు శిక్ష, రూ.5 లక్షలు జరిమానా విధించాలి.

5. సెక్షన్ 24 పండ్ల మొక్కల నర్సరీ రిజిస్ట్రేషన్ చేయుటలో.. ప్రతి పండ్ల మొక్కల నర్సరి హెక్టార్‌కు లోపు ఉన్నప్పటికీ లైసెన్స్ పొందాలి. నాణ్యతలేని మొక్కలు ఉత్పత్తి చేస్తే రెండేళ్ల జైలు శిక్ష మరియు రూ.5లక్షలు జరిమాన విధించాలి.

6. సెక్షన్ 40 దిగుమతి విత్తనాలలో.. దిగుమతి విత్తనాలను 21 రోజులు క్వారం టైన్ పెట్టి, పరిశోధనలు చేసి మన వాతావరణానికి తగినవని ధృవీకరించబడిన తరువాతనే దిగుమతులను మార్కెట్‌కు విడుదల చేయాలి.

7. సెక్షన్ 44 విత్తన కంపెనీల నేరాలలో.. నేరాలకు పాల్పడిన కంపెనీ లేదా కార్పొరేట్ సంస్థల లైసెన్స్‌లను రద్దు చేయాలి. కేంద్ర, రాష్ట్ర విత్తన కమిటీల తీర్పులే అంతిమ నిర్ణయంగా ఉండాలి. వీటిపై ఎలాంటి అప్పీల్‌లు ఉండరాదు. కమిటీ నిర్ణయించిన పరిహారాన్ని రైతులకు చెల్లించాలి.

వ్యాసకర్త అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు । 94900 98666

# విధి లిపి!

ప్రాణుల నొసటి మీద వాళ్ల భాగ్యాభాగ్యాల గురించి బ్రహ్మం గారు రాసే రాతకు ఆదిశంకరులు విధి లిపి అనే అందమైన పర్యాయపదం వాడారు. శివానందలహరి స్తోత్రం (16వ శ్లోకంలో). సందర్భం భక్తుడు శివుడితో మొరపెట్టుకోవడం. ఓ పశుపతీ! నేను నా కష్టాల గురించి ఎంత చెప్పుకున్నా నువ్వు వినటం లేదు. అథవా వింటే, బొత్తిగా లక్ష్యపెట్టకుండా, ఈ చెవిలో విని ఆ చెవిలో వదిలేస్తున్నావు. లేకపోతే నా చిన్ని కోరిక తీర్చటం నీకో లెక్కా, నీకు చేతకాని విషయమా?

నా కోరిక చాలా చిన్నది. విను. ఈ బ్రహ్మ నా నుదుట ఏదేదో రాసిపెట్టాడు. అందులో రెండు ముక్కలు మాత్రం నా జీవితాన్ని దుర్భరం చేస్తున్నాయి. కనుక నువ్వు దయదలిచి ఆ బ్రహ్మరాత 'విధి లిపి' లో ఆ రెండు ముక్కలు మాత్రం తుడిచిపెట్టు. దాంతో నా జీవితం సుఖమయమౌతుంది. నీ అంతవాడికి ఇదొక పనా? బ్రహ్మరాత ఏమిటి.. కోపం వస్తే, ఆ బ్రహ్మగారి తలకాయనే కొనగోటితో గిల్లి నరికేసిన వాడివి కదా!



జ్యోతిర్మయం

నువ్వు తుడిపివేయవలసిన రెండు ముక్కలూ ఏమిటంటే.. ఒకటి నీ ధ్యానం పట్ల ఆయన నాకు రాసిపెట్టిన విముఖత. దానితో రోజూ ఎన్నెన్నో పనులు చేస్తాను గానీ, శివపూజ అనేసరికి వెంటనే చెయ్యాలనిపించదు. కనుక ఈ శివధ్యాన వైముఖ్యతను ఒక్కదాన్ని చెరిపేశావంటే, నాకు నిరంతర శివపూజాసక్తి పెంపొందుతుంది. రెండు, వీడు ఎప్పుడూ దురాశాపీడితుడిగా ఉంటాడు అని అయన రాసిపెట్టాడు. ఆ ముక్క కూడా చెరిపేయి.

మొదట దురాశ విషయం చూడు! దురాశ అంటే ఆశపెట్టుకోకూడని విషయాల మీద ఆశలు పెంచుకొని కూర్చోవడం. నా దురాశ తొలగించావంటే, నన్ను మహారాజును చేసినట్లే. మహారాజుకు మాత్రం సమస్యలూ, కష్టాలూ, దుఃఖాలూ ఉండవా, అంటావా? నిరంతరం నీ ధ్యాన తత్పరుడినయ్యాననుకో. అది సర్వ దుఃఖ నివారకం, సర్వ సుఖ కారకం. ఇక నాకు దుఃఖాలెక్కడుంటాయి?

మహాదేవా! అందుకే నా నొసట ఉన్న 'విధి లిపి'లో ఆ రెండు ముక్కలూ చెరిపివేయి, చాలు! అదే పదివేలు!

– ఎం. మారుతి శాస్త్రి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
బుధవారం ॥ 11-12-2019

స్ఫూర్తి

# శాపానికి లేపనం

'శారీరక వైకల్యం శాపం అనుకుంటారు. నిజానికి.. వికలాంగులను చూసి నానా మాటలూ అనే మానసిక వైకల్యమే అన్నింటి కంటే పెద్ద శాపం' అంటారు అంతర్జాతీయ మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ మాళవిక అయ్యర్. అంతేకాదు, అలా మాట్లాడేవాళ్లకు తన ప్రసంగాలను లేపనంగా రాస్తున్నారు! తమిళనాడుకు చెందిన మాళవిక పదమూడేళ్ల వయస్సులోనే అర చేతులు కోల్పోయినప్పటికీ ధైర్యంతో ముందుకు సాగి గొప్ప వక్తగా ఎదిగారు. సామాజిక శాస్త్రంలో డాక్టరేట్ పొంది దివ్యాంగులకు ఆదర్శప్రాయంగా నిలిచారు. ఇటీవల 'వరల్డ్ డిజెబిలిటీ డే' సందర్భంగా శారీరక వైకల్యం ఉన్న వారి పట్ల సమాజం అనుసరించాల్సిన తీరు గురించి సోషల్ మీడియాలో హృదయానికి హత్తుకునేలా ప్రసంగించారు. ఆ ప్రసంగంలోని ముఖ్యాంశాలివి.

## వెక్కి వెక్కి ఏడ్చాను

''ఇది పదిహేడేళ్ల క్రితం నాటి మాట. నా రెండు చేతులు రక్తపు మడుగులో మునిగిపోయినపుడు నేను అంతగా ఏడ్వలేదు. డాక్టర్లు నా చేతుల్లో ఇనుప రాడ్లు వేసినపుడు కూడా ఎక్కువ బాధ పడలేదు. కానీ ఆస్పత్రి బెడ్ మీద ఉన్నపుడు నా పక్కనున్న ఆడవాళ్లు మాట్లాడిన మాటలు విని వెక్కివెక్కి ఏడ్చాను. 'జనరల్ వార్డులో కొత్త అమ్మాయి చేరిందట. తను నిజంగా శాపగ్రస్తురాలే. ఇక తన జీవితం ముగిసిపోయినట్లే' అంటూ నా గురించి ఏవేవో మాట్లాడుకుంటున్నారు. అప్పుడే మొదటిసారిగా నా కళ్ల నుంచి ధారాపాతంగా కన్నీళ్లు కారాయి. గ్రెనేడ్ పేలుడులో అర చేతులు కోల్పోయిన నాకు భవిష్యత్తే లేదన్నట్లుగా వారు మాట్లాడారు. ఆ మాటలను అంగీకరించడానికి నా హృదయం అప్పుడు సిద్ధంగానే ఉంది. అయితే నా కుటుంబం, స్నేహితులు ఇచ్చిన ప్రోత్సాహం నాలో కొత్త ఉత్సాహం నింపింది. వారి చొరవతోనే నేనింత వరకు రాగలిగాను. నిజానికి దివ్యాంగుల పట్ల సమాజం స్పందించే తీరు సరిగా లేదు. ప్రతి ఒక్కరికీ అటిట్యూడ్ ప్రాబ్లం ఉంటుంది'' అని మాళవిక అన్నారు.


మాళవిక అయ్యర్

## నిరాశ పరచకూడదు

''నిజానికి మానసిక వైకల్యమే అన్నింటి కంటే పెద్ద శాపం. ఎదుటివారిని ప్రోత్సహించకపోయినా ఫర్వాలేదు కానీ నిరాశ చెందేలా మాట్లాడకూడదు. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో దాదాపు 2 కోట్ల 68 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారు. ఆర్థికాభివృద్ధి, సామాజికాభివృద్ధి వంటి పెద్ద పెద్ద విషయాల గురించి మాట్లాడే ముందు ప్రతీ ఒక్కరు దివ్యాంగుల పట్ల తాము ప్రవర్తిస్తున్న తీరు గురించి ఆలోచించుకోవాలి. వారిని సమాజంలో మమేకం చేసి.. ఉద్యోగ భద్రత కల్పించి తమ కాళ్లపై తాము నిలబడేలా చేయాలి. శారీరక వైకల్యం ఉంటే ఇక జీవితం ముగిసినట్లే అనే మాటలు మానుకోవాలి. దివ్యాంగులనంతా ఒక్కచోట చేర్చడం కాదు.. వారికి ఏమేం అవసరమో గుర్తించి... వాటిని సమకూర్చాలి. అలా చేసినపుడే సమాజంతో వారు కలిసిపోగలుగుతారు. లేదంటే ఆత్మన్యూనతాభావంతో కుంగిపోతారు. అందుకే బాల్యం నుంచే ప్రతి ఒక్కరు వివక్ష లేకుండా పెరిగే వాతావరణం కల్పించాలి'' అని మాళవిక అన్నారు.

## 'చారిటీ' వస్తువులు కారు

''విద్యావిధానంలోనూ మార్పులు రావాలి. శారీరక వైకల్యం ఉన్న వారిని చారిటీ వస్తువులుగా చూపకుండా... దివ్యాంగులైనప్పటికీ సమాజంలో ఉన్నత స్థితికి చేరిన వారి గురించి పాఠ్యాంశంలో బోధించాలి. ఒకరిపై ఆధారపడకుండా.. సొంతంగా తమ పనులు తాము చేసుకునేలా తీర్చిదిద్దాలి. సాంకేతికతను అందిపుచ్చుకునేలా ప్రోత్సాహం అందించాలి. సానుకూల దృక్పథం నెలకొనేలా సినిమాలు నిర్మించాలి. చేతులు, కాళ్లు లేకుంటే పెళ్లి కాదు. ఇక జీవితమే ఉండదు అనే పిచ్చి నమ్మకాలను తొలగించాలి. ప్రస్తుతం భారతదేశంలో ఉన్న దివ్యాంగులకు సమాజం పట్ల, తమ సమస్యల పట్ల ఒక అవగాహన ఏర్పడింది. తమ హక్కులకే గళాన్ని గట్టిగా వినిపించగలుగుతున్నారు. అయితే వారికి ప్రజాప్రతినిధుల, రాజకీయ నాయకుల అవసరం ఎంతగానో ఉంది. దివ్యాంగులను సమాజం నిండు మనస్సుతో ఆలింగనం చేసుకోవాలనేదే నా కల. ఆ దిశగా వడివడిగా అడుగులు పడాలి'' అని మాళవిక ఆకాంక్షించారు.



– సుష్మారెడ్డి యాళ్ల, సాక్షి వెబ్ డెస్క్

### గ్రెనేడ్ పేలడంతో..!

మాళవిక అయ్యర్ తమిళనాడులోని కుంభకోణంలో క్రిష్ణన్– హేమా క్రిష్ణన్ దంపతులకు జన్మించారు. తండ్రి వాటర్ వర్క్స్‌లో ఇంజనీరుగా పనిచేసిన క్రమంలో ఆమె బాల్యం రాజస్తాన్‌లోని బికనీర్‌లో గడిచింది. అక్కడ ఉన్నపుడే ఓ రోజు తమ గ్యారేజీలో ఆడుకుంటున్న సమయంలో గ్రెనేడ్ చేతుల్లో పేలి రెండు అరచేతులు పోయాయి. ఆ తర్వాత ఆమెను చెన్నైలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. స్క్రైబ్ సహాయంతో పరీక్షలు రాస్తూ మాళవిక తన విద్యాభ్యాసం పూర్తిచేశారు. ఈ క్రమంలో రాష్ట్రంలో ప్రథమ ర్యాంకు(ప్రైవేటు పరీక్ష) సంపాదించి ఆనాటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం ప్రశంసలు పొందారు. అనంతరం ఉన్నత విద్య కోసం ఢిల్లీకి చేరుకున్న మాళవిక... ఎకనమిక్స్ హానర్స్ చదివారు. సోషల్ వర్క్‌లో డాక్టరేట్ సంపాదించారు. 2013 నుంచి మోటివేషనల్ స్పీకర్‌గా మారి ఎంతోమందిలో ఆత్మవిశ్వాసం నింపుతున్నారు. వివిధ దేశాల్లో ప్రసంగాలు చేసిన మాళవిక.. సమాజ తీరు, మహిళలు, దివ్యాంగులపై వివక్ష వంటి అంశాలపై ఐరాసలోనూ తన గళాన్ని వినిపించారు. ఆమె సేవలను గుర్తించిన ప్రభుత్వం 2018లో మహిళా దినోత్సవం సందర్భంగా అత్యున్నత మహిళా పురస్కారం నారీ శక్తి పురస్కార్‌తో సత్కరించింది.







# ప్రతిభా మూర్తులకు పది విశ్వపీఠాలు

మహిళాభ్యుదయం అంటే... అవనిలో సగం – ఆకాశంలో సగం, నేల నీదే – నింగీ నీదే... అని స్ఫూర్తి పొందడం ఒక్కటే కాదు. సామాజిక చైతన్యంలో మహిళ సేవను గుర్తు చేసుకోవడం. సమకాలీన సమాజ నిర్మాణంలో మహిళ పాత్రను గుర్తెరగడం. మహిళ మేధను, నిష్ణాతను, నైపుణ్యాన్ని భవిష్యత్తు తరాలకు తెలియచేయడం. కేంద్ర మహిళాశిశు సంక్షేమ శాఖ తాజాగా తీసుకున్న నిర్ణయం ఉద్దేశం కూడా ఇదే. ప్రాచీన, ఆధునిక సమాజంలో సామాజిక వివక్షకు ఎదురొడ్డి మరీ సమాజాన్ని చైతన్యవంతం చేసి, తమ పాదముద్రలతో తర్వాతి తరాలకు మార్గదర్శనం చేసిన మహిళల గుర్తుగా యూనివర్సిటీలలో పది పీఠాలను (అకడమిక్ చెయిర్) ఏర్పాటు చేయనుంది. ఆ పీఠాలను 'అలంకరించనున్న' మహిళామూర్తుల వివరాలివి.

## లల్లేశ్వరి

క్రీ.శ 14వ శతాబ్దంలో కశ్మీర్‌లో మహిళాభ్యుదయం కోసం అక్షర పోరాటం చేసిన మహిళ. కశ్మీర్ సాహిత్యంలో ఆమెది ప్రత్యేకస్థానం. స్త్రీకి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు చదువుతోనే సాధ్యమవుతాయన్నారు. స్త్రీకి చదువుకునే సౌకర్యం కల్పించే ఉదారవాద సమాజ స్థాపన ఆమె ఆకాంక్ష. న్యూఢిల్లీలో 2000లో ఆమె రచనల మీద జాతీయ స్థాయి సెమినార్ జరిగింది. 'రిమెంబరింగ్ లాల్ దేద్ ఇన్ మోడరన్ టైమ్స్' పుస్తకం కూడా ఆవిష్కృతమైంది.

## లీలావతి

గణితశాస్త్రవేత్త. క్రీ.శ. 16వ శతాబ్దం నాటి ప్రముఖ గణితశాస్త్రవేత్త రెండవ భాస్కరుని కుమార్తె. గణితంలో ఎంత పెద్ద సమస్యనైనా ఇట్టే నోటి లెక్కగా చెప్పేదని నాటి గ్రంథాల్లో ఉంది. భాస్కరుడు తాను రాసిన గణితశాస్త్ర గ్రంథానికి కూడా 'లీలావతి' అనే పేరు పెట్టాడు.

## అహల్యాబాయ్ హోల్కర్

స్వస్థలం మహారాష్ట్ర, అహ్మద్‌నగర్‌కు సమీపంలోని చొండి గ్రామం. ఆడవాళ్లు ఇల్లు దాటి బయట అడుగుపెట్టడానికి సమాజం అంగీకరించని 18వ శతాబ్దంలో ఆమె ఇంట్లోనే చదవడం, రాయడం నేర్చుకున్నారు. అహల్యాబాయ్ భర్త మాల్వా రాజు ఖండేరావ్ హోల్కర్ కుంభేర్ యుద్ధంలో మరణించాడు. భర్త మరణించిన సమయంలో ఆమె సతిని పాటించాలా వద్దా అనే మీమాంస తలెత్తింది. రాజ్య నిర్వహణ బాధ్యత చేపట్టగలిగిన మహిళ తనను తాను సబలగా నిరూపించుకోవాలి తప్ప అబలగా అగ్నికి ఆహుతి కాకూడదనే నిర్ణయానికి వచ్చారు. అప్పటినుంచి ఆమె మామ మల్హార్‌రావ్ ఆమెను రాజ్యపాలనలో నిష్ణాతురాలిని చేశారు. మల్హార్ రావ్ హోల్కర్ మరణించినప్పటి నుంచి అహల్యాబాయ్ పూర్తిస్థాయిలో రాజ్య నిర్వహణ బాధ్యతలను చేపట్టారు. రాజధానిని మాల్వా నుంచి మహేశ్వర్‌కు మార్చడం వంటి నిర్ణయాలతో పరిపాలనలో అనేక స్థిరమైన నిర్ణయాలు తీసుకున్నారామె.

### ఎం.ఎస్ సుబ్బులక్ష్మి

ఎం.ఎస్. పేరుతోపాటు గుర్తుకు వచ్చే పాట 'రఘుపతి రాఘవ రాజారామ్'. గాంధీజీకి ఇష్టమైన పాట. తమిళనాడు, మధురైలో పుట్టిన సుబ్బులక్ష్మి కర్నాటక సంగీతంతో నిష్ణాతురాలు. భారతరత్న పురస్కారం, రామన్ మెగసెసె అవార్డు అందుకున్న తొలి సంగీతకారిణి ఆమె. యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీలో సంగీతాలాపన చేసిన తొలి భారతీయురాలు కూడా. పద్మభూషణ్, పద్మ విభూషణ్, సంగీత కళానిధి, సంగీత నాటక అకాడమీ అవార్డులు కూడా అందుకున్నారు ఎం.ఎస్ సుబ్బులక్ష్మి. ఆమె పేరులోని ఎం.ఎస్ అంటే మధురై షణ్ముఖవాడివు.

### కమలా సోహోనీ

మధ్యప్రదేశ్, ఇందోర్‌కు చెందిన కమలా సోహోనీ సైన్స్ రంగంలో పీహెచ్‌డీ అందుకున్న తొలి భారతీయ మహిళ. బెంగుళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ఆమె పరిశోధనలు చేశారు. అంతేకాదు, ఆమె ఆ సంస్థలో మహిళల ప్రవేశానికి మార్గం సుగమం చేసిన మహిళ కూడా. వరి, పప్పు ధాన్యాలలో ఉండే పోషకాలు, విటమిన్‌ల గురించి పరిశోధించారు. తాటి చెట్టు నుంచి స్రవించే ద్రవం 'నీరా'లో ఉండే పోషకాలు– వాటి ప్రయోజనాల మీద చేసిన పరిశోధనకు ఆమె రాష్ట్రపతి అవార్డు అందుకున్నారు.

## అమృతాదేవి బెనివాల్ (బిష్ణోయి)

చెట్లను కాపాడేందుకు ప్రాణాలు వదిలిన త్యాగశీల పర్యావరణవేత్త అమృతాదేవి. రాజస్థాన్, జోధ్‌పూర్‌లోని ఖేజార్లి గ్రామంలో పుట్టిన అమృతాదేవి ఖేజ్రీ చెట్ల పరిరక్షణ కోసం పోరాడిన మహిళ. క్రీ.శ 1730లో భవననిర్మాణానికి అవసరమైన కలప కోసం రాజోద్యోగులు ఖేజార్లి గ్రామం సమీపంలోని అడవులకు వచ్చారు. చెట్లను ప్రేమించే బిష్ణోయి తెగ వాళ్లు కలప కోసం ఎండిన కొమ్మలను మాత్రమే ఉపయోగిస్తారు తప్ప చెట్లను నరకరు. సాటి బిష్ణోయి తెగకు చెందిన మహిళలను కూడగట్టి.. చెట్లను నరకడానికి వచ్చిన రాజు మనుషులను అడ్డుకుంది అమృతాదేవి. ఆ ఘర్షణలో ముగ్గురు కూతుళ్లతోపాటు అమృతాదేవి, మరో మూడు వందలకు పైగా బిష్ణోయి మహిళలు ప్రాణాలు కోల్పోయారు.

## ఆనందీబాయ్ జోషి

మనదేశంలో తొలి లేడీడాక్టర్. పద్నాలుగేళ్లకే బిడ్డకు తల్లయ్యారు ఆనందీబాయ్. కానీ ఆ బిడ్డ సరైన వైద్యం అందని కారణంగా పది రోజులకే మరణించడంతో ఆమె దృష్టి వైద్యరంగం మీదకు మళ్లింది. సంస్కృతం, ఇంగ్లిష్ నేర్చుకుని అమెరికా, పెన్సిల్వేనియాలోని ఉమెన్స్ మెడికల్ కాలేజ్‌లో వైద్య శాస్త్రాన్ని చదివారామె. ఇండియాకి తిరిగి వచ్చి కొల్హాపూర్‌లోని ఆల్బర్ట్ ఎడ్వర్డ్ హాస్పిటల్‌లో వైద్య సేవలందించారు.







పై ఐదుగురు (ఎడమ నుంచి కుడికి)
ఎం.ఎస్.సుబ్బులక్ష్మి, కమలా సొహోనీ, దేవీ అహల్యాబాయ్ హోల్కర్, రాణీ గైడిన్లీ, హన్సా మెహ్‌తా

కింది ఐదుగురు (పై నుంచి సవ్యదిశలో)
లీలావతి, లల్లేశ్వరి, అమృతాదేవి బెనీవాల్, మహదేవీ వర్మ, ఆనందీబాయ్ గోపాల్రావ్

## హన్సా మెహతా

సూరత్‌లో పుట్టిన హన్సామెహతా గుజరాతీ భాషలో తొలి నవల రాసిన రచయిత. ఆమె విద్యావంతురాలు, సంఘసంస్కర్త, సామాజిక కార్యకర్త, స్వతంత్ర భావాలు కలిగిన మహిళ. ఆమె తత్వ శాస్త్రంలో గ్రాడ్యుయేషన్ చేసి ఇంగ్లండ్‌లో జర్నలిజం, సోషియాలజీ చదివారు.

## మహాదేవి వర్మ

ఆమె ఉన్నత విద్యావంతురాలు, ప్రముఖ హిందీ కవయిత్రి. ఛాయావాద సాహిత్య ఉద్యమంలో ఆమె తన భావాలను స్పష్టంగా వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య సమరంలో కీలకంగా సేవలందించారు. అలహాబాద్‌లోని 'ప్రయాగ మహిళా విద్యాపీఠ్'కు వైస్ చాన్స్‌లర్‌గా బాధ్యతలు నిర్వర్తించారామె.

## రాణి గైదిన్‌లియు

మణిపూర్‌కు చెందిన రాణి గైదిన్‌లియుకి 78 ఏళ్లు. ఆమె ఆధ్యాత్మిక, రాజకీయ నాయిక. బ్రిటిష్ పాలను వ్యతిరేకంగా గళమెత్తిన ధీర. పదమూడేళ్ల వయసులోనే హరక్కా ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత మణిపూర్ నుంచి బ్రిటిష్ వారిని తరిమి వేయడానికి ఉద్యమించారు. పదహారేళ్ల వయసులో బ్రిటిష్ పాలకుల చేతిలో అరెస్ట్ అయ్యి జైలు జీవితాన్ని గడిపారామె. జవహర్‌లాల్ నెహ్రూ ఆమెకు రాణి అని ప్రశంసించారు. ఆ తర్వాత ఆమె పేరులో రాణి అనే మకుటం చేరింది. జాతీయోద్యమ నాయకురాలిగా ఆమె సేవలకు భారత ప్రభుత్వం ఆమెను పద్మభూషణ్ అవార్డుతో సత్కరించింది.

– మంజీర

ఆటలమ్మాయి

# అటక దించుతోంది

**అమ్మ, అమ్మమ్మ, పిల్లలు కలిసి ఆడుకోగలిగిన ఆటలు ఏముంటాయి? నాన్న, తాతయ్యలతో కలిసి పిల్లలు ఆడుకోవాలంటే? పెద్దవాళ్లు చురుగ్గా కదలలేరు. పిల్లలేమో రెండు పాదాలను ఒక్క క్షణం కూడా నేల మీద ఆన్చరు. అయినప్పటికీ పెద్దవాళ్లను, పిల్లవాళ్లను కలిపి కూర్చోబెట్టి ఒక ఆట ఆడించేందుకు పాత ఆటలన్నిటినీ తవ్వి తీస్తున్నారు బెంగళూరు యువతి శ్రీరంజని!**

పిల్లల్లో బోర్డ్ గేమ్స్‌పై ఆసక్తి కలిగించి, ఆడించడానికి, వాటి ద్వారా పెద్దవాళ్లకూ ప్రయోజనం కలిగించడానికి ఎక్కడెక్కడి బోర్డ్ గేమ్‌లను కూడా వెతికి పట్టుకుని వస్తున్నారు శ్రీరంజని. శతాబ్దాల కిందట మనవాళ్లు ఆడుకున్న ఆటలతోపాటు ఖండాంతరాల నుంచి కూడా బోర్డ్ గేమ్‌లను శోధించి, పరిశోధించి తెస్తున్నారామె.

## మతి మరుపునకు చెక్

''అష్టాచెమ్మా, పరమపద సోపానపటం, బారాహ్ గట్టా, పులి–మేక, వామనగుంటలు.. పిల్లల్లో మేధాశక్తిని పెంచడం ఒక ప్రయోజనం అయితే పెద్దవాళ్లలో మతిమరుపును కూడా తగ్గిస్తున్నాయి ఈ ఆటలు! ఈ విషయాన్ని సైకాలజిస్టులు చెప్పడమే కాదు, అల్జీమర్స్‌తో బాధపడుతున్న తొంభై ఏళ్ల మహిళ.. తాను ఈ ఆటలు మొదలు పెట్టిన తరవాత మర్చిపోయిన బాల్య స్మృతులన్నీ గుర్తుకు వస్తున్నాయని సంతోషంగా నాతో చెప్పారు. తన చిన్ననాటి స్నేహితుల పేర్లు గుర్తు చేసుకోవడానికి చాలా కష్టపడేదాన్నని, ఇప్పుడు చాలా సంఘటనలు ఇప్పుడే జరిగినట్లు కళ్లముందు మెదలుతున్నాయని తన బాల్యంలోకి వెళ్లిపోయారావిడ. అరవైలలోకి వచ్చిన వాళ్లు వారంలో కనీసం ఒక గంటయినా సరే ఈ ఆటలు ఆడితే మెదడు చురుగ్గా ఉంటుంది. మతిమరుపు బారి నుంచి దూరంగా ఉండవచ్చు కూడా. స్మార్ట్ ఫోన్ యుగంలో మైండ్ అనుక్షణం ఏదో ఒక టాస్క్‌లో నిమగ్నమై ఉంటోంది. ఫోన్ చేతిలోకి తీసుకుని కాల్ లాగ్‌లోకి వెళ్లిన తర్వాత ఎవరికి ఫోన్ చేయాలనుకున్నామో మర్చిపోయే పరిస్థితి నలభై ఏళ్లకే దాపురించింది. ఈ దుస్థితిని విజయవంతంగా దాటేయడానికి కూడా పిల్లలతో కానీ పెద్ద వాళ్లతో కానీ ఓ గంటసేపు నచ్చిన బోర్డ్ గేమ్ ఆడుకోవడమే దివ్యమైన ఔషధం'' అంటున్నారు శ్రీరంజని. కూర్చొని ఒకచోట ఆడుకునే ఆటలపై ఆమె బెంగళూరులో వర్క్‌షాపులు కూడా నిర్వహిస్తున్నారు.


శ్రీరంజని

## ఇప్పుడివే ప్రధాన ఆకర్షణలు

బర్త్‌డే పార్టీలతోపాటు ఇతర ఫ్యామిలీ గెట్ టు గెదర్‌లలో ఇప్పుడు బోర్డ్ గేమ్‌లే ప్రధాన ఆకర్షణ అవుతున్నాయి కూడా. దాదాపుగా అందరి ఇళ్లలోనూ ఈ ఆటల్లో కొన్నయినా ఉండి ఉంటాయి. అటకెక్కిన ఆటవస్తువులను అటక దించి అక్కున చేర్చుకోవచ్చు. బోర్డ్ గేమ్‌లను పునఃపరిచయం చేయడం కోసం ఏకంగా పరిశోధనే చేస్తున్నారు శ్రీ రంజని. మన పులి–మేకలా..దక్షిణాఫ్రికాలో ఆవు–చిరుత ఆటను, క్రీస్తు పూర్వం అశోక చక్రవర్తి కాలం నాటి నవకంకారి ఆటను కూడా వెలికి తీశారామె.

– మను

చెట్టు నీడ

# శిష్యుని సందేహం

"ప్రభువా..
నా సహోదరుడు నా పట్ల తప్పు చేస్తే నేనెన్నిసార్లు అతన్ని క్షమించాలి? ఏడు మారులా?"

వివిధ ప్రాంతాల ప్రజలను తన కరుణాపూరితమైన మాటలతో ఆదరిస్తూ, వారిలో చైతన్యాన్ని రగిలిస్తూ, కపెర్నహోము పట్టణంలోకి ప్రవేశించారు యేసు ప్రభువు.. తన శిష్యులతో కలిసి. అంతవరకు సహోదర ప్రేమ, సహనాలను గురించి ప్రభువు నోట నుండి విన్న శిష్యుడు పేతురు, మరికొన్ని సందేహాలను నివృత్తి చేసుకోవాలనుకున్నాడు.

''ప్రభువా.. నా సహోదరుడు నా పట్ల తప్పు చేస్తే నేనెన్నిసార్లు అతన్ని క్షమించాలి? ఏడు మారులా?'' అని అడిగాడు.

''కాదు.. డెబ్బది ఏడు మారులు! నీ తమ్ముడో, అన్నో నీ పట్ల తప్పు చేస్తే అతణ్ణి ఒంటరిగా కల్సుకో.. తన తప్పేదో తెలుపు... అవసరమైతే గద్దించు. ఒకవేళ నీ మాట వినలేదనుకో.. న్యాయ స్థాపనకు మన మధ్య ఇద్దరు సాక్షులుండాలి అన్న నియమాన్ని బట్టి, వారిని వెంటబెట్టుకు వెళ్లి, సావధానంగా మాట్లాడు'' అని చెప్పి, ''పేతురూ.. మీలో ఎవరికైనా ఈ సమస్య రావచ్చు, ఈ రెండవ ప్రయత్నంగా మాత్రమే మీ సంఘంలోని పెద్దలకు తెలపండి. చివరిగా వారి మాటల్ని కూడా అతడు తిరస్కరించితే... అతడిని క్షమించు.. ఓర్పు వహించు. కొంతకాలం గడిచిన తర్వాత అతనిలో పశ్చాత్తాపం కలిగి, తన తప్పును ఒప్పుకొని, నీతో సమాధాన పడతాడు. అప్పుడు.. మీ మధ్య ఎంత ఆనందం ఉప్పొంగుతుంది!'' అని చెప్పారు ప్రభువు.

''ఓర్పు, క్షమ.. ఈ రెండూ మన కుటుంబాల్లో సమాజాల్లో శాంతికి పునాదులు! ప్రేమ, సంతృప్తి సమృద్ధిగా ఉంటాయి. ద్వేషాలు కనుమరుగైపోతాయి. పిల్లలారా! చిన్న పిల్లల హృదయాలను కలిగి ఉండండి...'' అంటూ ముందుకు సాగుతున్న ప్రభువును శిష్యులంతా తృప్తి నిండిన గుండెలతో అనుసరించారు.

– ఝాన్సీ కె.వి. కుమారి


ఎన్టీఆర్ / రానా

# 2019 ఇయర్లీ రౌండప్ 2

# మిస్సయ్యారు

2019 సిల్వర్ స్క్రీన్ కొంతమంది స్టార్స్‌ని మిస్ చేసింది. అభిమానులను నిరాశపరిచింది. ఒకప్పుడంటే ఏడాదికి ఏడెనిమిది సినిమాలు చేసేవాళ్లు. ఇప్పుడు స్టార్ హీరోలు ఏడాదికి ఒకటి లేక రెండు. అంతే.. ఆ ఒక్క దర్శనం కోసం అభిమానులు ఎదురు చూపులు చూస్తుంటారు. కానీ ఈ ఏడాది కొందరు హీరోలు అసలు ఒక సినిమాలో కూడా కనిపించలేదు. మిస్ అయిన లిస్ట్‌లో హీరోయిన్లు కూడా ఉన్నారు. అయితే అభిమానులకు చిన్న ఊరట ఇస్తూ.. కొందరు 'గెస్ట్' రోల్స్‌లో కనిపించారు. కానీ రెండున్నర గంటలసేపు చూసినంత తృప్తి ఇలా వచ్చి అలా వెళ్లే అతిథి పాత్రలు చూసినప్పుడు దక్కదు కదా. మరి.. ఈ ఏడాది మిస్ అయిన 'మిస్సింగ్ స్టార్స్' ఎవరు? వచ్చే ఏడాదిని కూడా మిస్సవుతారా?.. తెలుసుకుందాం.

**రెండోసారి మిస్**

తెలుగు సినిమా ప్రతిష్టను దేశవ్యాప్తంగా పెంచిన చిత్రం 'బాహుబలి'. ఈ సినిమా రెండు భాగాలను తెరకెక్కించడానికి దర్శకుడు రాజమౌళికి ఐదేళ్ల సమయం పట్టింది. ఆ ఐదేళ్లలో రెండు సార్లు మాత్రమే ప్రభాస్ తెరపై కనిపించారు. అయితే 'బాహుబలి' వంటి ప్రతిష్ఠాత్మక చిత్రంలో తమ హీరోను చూసిన తర్వాత 'ఇలాంటి సినిమాకి ఇంత టైమ్ అవసరమే' అనుకున్నారు ఫ్యాన్స్. రాజమౌళి ప్రస్తుతం తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆర్‌ఆర్‌ఆర్'. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా డీవీవీ దానయ్య నిర్మిస్తున్న చిత్రం ఇది. 1920 బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ పీరియాడికల్ చిత్రానికి కాస్త సమయం పడుతుంది. అలా ఈ ఏడాది తెరపై ఎన్టీఆర్‌ను చూసుకునే చాన్స్ ఆయన ఫ్యాన్స్‌కు లేకుండా పోయింది. 2009లో ఎన్టీఆర్ ఒక్క సినిమాలోనూ కనిపించలేదు. మళ్లీ మిస్సయిన ఇయర్ ఇదే. గత ఏడాది దసరాకి 'అరవింద సమేత వీరరాఘవ'లో కనిపించిన తర్వాత సెప్టెంబర్ నుంచి 'ఆర్‌ఆర్‌ఆర్' షూటింగ్‌లో పాల్గొంటున్నారు ఎన్టీఆర్. ఈ చిత్రం వచ్చే జూలై 30న రిలీజ్ కానుంది.

**గ్యాప్ ఇవ్వలా.. వచ్చింది**

'ఏంట్రోయ్ గ్యాప్ ఇచ్చావ్..' అని మురళీ శర్మ అంటే, 'ఇవ్వలా.. వచ్చింది' అని అల్లు అర్జున్ బదులు చెబుతారు. ఇది అల్లు అర్జున్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'అల.. వైకుంఠపురములో' టీజర్‌లోని సీన్. ఈ డైలాగ్ మాదిరిగానే ఈ ఏడాది వెండితెరకు అల్లు అర్జున్ గ్యాప్ ఇవ్వాల్సి వచ్చింది. 2018లో 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'లో నటించిన అల్లు అర్జున్ కథల ఎంపికకు ఎక్కువ టైమ్ తీసుకున్నారు. అయితే వరుసగా మూడు సినిమాలను ప్రకటించి రన్నింగ్ ట్రాక్‌లోనే ఉన్నానని చెప్పకనే చెప్పారు. 'అల..వైకుంఠపురములో' జనవరి 12న రిలీజ్ కానుంది. నెక్ట్స్ సుకుమార్ దర్శకత్వంలో హీరోగా, ఆ తర్వాత వేణు శ్రీరామ్ దర్శకత్వంలో 'ఐకాన్' సినిమాలు చేయబోతున్నారు.

**అనుకోని గాయం.. చేసింది దూరం**

అన్నీ అనుకున్నట్లు జరిగితే 'భీష్మ'గా నితిన్ ఈ ఏడాది వెండితెరపై సందడి చేయాల్సింది. కానీ నితిన్ గాయపడటం వల్ల వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా చిత్రీకరణ ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో ఈ సినిమా విడుదల వచ్చే ఏడాది ఫిబ్రవరికి వాయిదా పడింది. ఇలా అనుకోని గాయం నితిన్‌ను హీరోగా ఈ ఏడాది వెండితెరకు దూరం చేసింది. కానీ వరుణ్ తేజ్ నటించిన 'గద్దలకొండ గణేష్'లో అతిథిగా నితిన్ కనిపించారు. చంద్రశేఖర్ ఏలేటి, వెంకీ అట్లూరి ('రంగ్ దే' టైటిల్), కృష్ణచైతన్య దర్శకత్వాల్లో నితిన్ తర్వాతి చిత్రాలు తెరకెక్కనున్నాయి.

**రానా... రాలేదు**

'అరణ్య', '1945', 'భుజ్: ది ప్రైడ్ ఆఫ్ ఇండియా' సినిమాల చిత్రీకరణలతో ఈ ఏడాది బిజీబిజీగా గడిపారు రానా. ఈ ఏడాది హీరోగా తెలుగు వెండితెరపైకి రాలేదు రానా. నిజానికి 'అరణ్య' చిత్రాన్ని ఈ ఏడాది చివర్లో విడుదల చేయాలని ప్లాన్ చేసినప్పటికీ కొన్ని కారణాల వల్ల కుదర్లేదు. అయితే 'ఎన్టీఆర్: కథానాయకుడు' సినిమాలో రానా కొద్దిసేపు కనిపించిన సంగతి తెలిసిందే. 'హౌస్‌ఫుల్ 4'తో హిందీ తెరపైనా కనిపించారు. గుణశేఖర్ దర్శకత్వం వహించనున్న 'హిరణ్యకశ్యప', ప్రముఖ మల్లయోధుడు కోడి రామ్మూర్తి బయోపిక్ .. నటుడిగా రానా నెక్ట్స్ ప్రాజెక్ట్స్. శ్రీలంక ప్రముఖ క్రికెటర్ ముత్తయ్య మురళీధరన్ బయోపిక్‌కు రానా ఓ నిర్మాత. ఇలా హీరోగా, నిర్మాతగా రానా వచ్చే ఏడాది హల్‌చల్ చేస్తారు.


అల్లు అర్జున్

దాదాపు రెండేళ్లు వెండితెరకు దూరమయ్యారు మంచు మనోజ్. ఇటీవలే మనోజ్ ఎమ్‌ఎమ్ ఆర్ట్స్ అనే ఓ నిర్మాణ సంస్థను ప్రారంభించారు. మనోజ్ తర్వాతి చిత్రం ఈ నిర్మాణ సంస్థలోనే తెరకెక్కుతుందని ఊహించవచ్చు. మనోజ్ హీరోగా నటించిన 'ఒక్కడు మిగిలాడు' 2017లో విడుదలైంది. దాదాపు రెండేళ్లుగా సిల్వర్ స్క్రీన్‌పై కనిపించని సాయిరామ్ శంకర్ ఇటీవలే తన కొత్త చిత్రం 'రీసౌండ్'కు కొబ్బరికాయ కొట్టారు. 2018లో 'అజ్ఞాతవాసి' చిత్రం విడుదల తర్వాత పవన్ కల్యాణ్ మళ్లీ మూవీ కెమెరా ముందుకు రాలేదు. ప్రస్తుతానికి సినిమాలేవీ కమిట్ అయిన దాఖలాలు కూడా లేవు. అయితే హిందీ 'పింక్' తెలుగు రీమేక్‌లో నటించనున్నారని టాక్.


మనోజ్


సుధీర్‌బాబు


నితిన్

**వితో వస్తాడు**

ప్రస్తుతం 'వి' సినిమాలో పోలీసాఫీసర్‌గా చేస్తున్న సుధీర్‌బాబు ఈ ఏడాది ప్రేక్షకులను పలకరించలేదు. ఇంద్రగంటి మోహన కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో నాని మరో హీరో. 'వి' చిత్రం వచ్చే ఏడాది మే 25న విడుదల కానుంది. ఇది కాకుండా ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో పుల్లెల గోపీచంద్ బయోపిక్‌తో పాటు ఓ నూతన దర్శకుడు తెరకెక్కించనున్న సినిమాల చిత్రీకరణల్లో పాల్గొంటారు సుధీర్.

గత ఏడాది కథానాయికగా 'భాగమతి'లో కనిపించిన అనుష్క ఈ ఏడాది 'నిశ్శబ్దం' చిత్రంలో వెండితెరపై కనిపించాల్సింది. కానీ ఈ ఏడాది చివర్లో విడుదల కావాల్సిన 'నిశ్శబ్దం' వచ్చే ఏడాది జనవరికి వాయిదా పడింది. దీంతో చిరంజీవి 'సైరా: నరసింహారెడ్డి' చిత్రంలో అనుష్క అతిథి పాత్రలో కనిపించారు కదా అని అనుష్క ఫ్యాన్స్ సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 'మహానటి' కీర్తీ సురేష్ ఈ ఏడాది 'మిస్ ఇండియా, గుడ్‌లుక్ సఖి' అనే రెండు లేడీ ఓరియంటెడ్ సినిమాలతో పాటు తమిళంలో 'పెంగ్విన్', మలయాళంలో 'అరేబియన్ కడలింటే సింగమ్', హిందీలో 'మైదాన్' సినిమాల చిత్రీకరణలతో బిజీగా ఉన్నారు. రజనీకాంత్ 168వ సినిమాకి ఇటీవల సైన్ చేశారు. ఈ ఏడాది 'మన్మథుడు 2'లో అతిథిగా కనిపించడం మినహా కీర్తీ వేరే సిరిమాల్లో కనిపించలేదు. అయితే ఇప్పుడు చేస్తున్న సినిమాలన్నీ వచ్చే ఏడాది విడుదలవుతాయి కాబట్టి 2020లో కీర్తీ పలు మార్లు దర్శనమిస్తారు. ఇక 'ఎన్టీఆర్: కథానాయకుడు'లో అతిథిగా నటించి, హాలీవుడ్ మూవీ 'ఫ్రోజెన్ 2' తెలుగు వెర్షన్‌కు తన గొంతును వినిపించిన నిత్యామీనన్ హీరోయిన్‌గా ఈ ఏడాది తెలుగు తెరపై కనిపించలేదు. నిత్యా నటించిన 'ప్రాణ' ఈ ఏడాది తెలుగులో విడుదల కావాల్సింది. కానీ అనుకోని కారణాల వల్ల విడుదలకు నోచుకోలేదు. 'దేవుడు చేసిన మనుషులు' (2012) చిత్రంలో హీరోయిన్‌గా నటించిన తర్వాత దాదాపు ఆరేళ్లు హిందీ చిత్రాలు చేస్తూ గత ఏడాది 'అమర్ అక్బర్ ఆంటొని' సినిమాతో తెలుగు తెరపైకి కమ్ బ్యాక్ ఇచ్చారు ఇలియానా. ఆ తర్వాత మరో తెలుగు సినిమాకు సైన్ చేయలేదు. 'కాటమ రాయుడు' (2017) తర్వాత శ్రుతీహాసన్ తెలుగు తెరకు దాదాపు రెండేళ్లు దూరంగా ఉన్నారు. మళ్లీ ఇప్పుడు రవితేజ 'క్రాక్' సినిమాతో టాలీవుడ్ ట్రాక్‌లోకి వచ్చారు శ్రుతి. 2017లో 'కేశవ'లో నటించిన రీతూ వర్మ. ఇటీవలే నాని 'టక్ జగదీష్'లో ఒక హీరోయిన్‌గా నటించే చాన్స్ దక్కించుకున్నారు.


కీర్తీ సురేశ్ / అనుష్క / శ్రుతీహాసన్

సినిమాల్లో గ్యాప్ అనేది సహజం. మహామహా స్టార్లకు కూడా గ్యాప్‌లు వచ్చిన సందర్భాలున్నాయి. సో.. ఈ ఏడాది తమ అభిమాన తారలను వెండితెరపై చూసుకోలేకపోయామని ప్రేక్షకులు బాధపడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఈ ఏడాదిని మిస్సయినవారందరూ షూటింగ్‌లతో బిజీ బిజీగా ఉన్నవారే. కాబట్టి వచ్చే ఏడాది వీరి సందడి కాస్త ఎక్కువగానే ఉండొచ్చని ఊహించవచ్చు.

– మునిమి శివాంజనేయులు

# ముఖాన్ని నాశనం చేశాడు... నా ఆత్మవిశ్వాసాన్ని కాదు


'చప్పాక్'లో దీపిక

''యాసిడ్ అమ్మడం ఆపేస్తే ఎంత బాగుంటుంది. ఈ దాడులు ఉండవు, నా ముక్కు, నా చెవులు సరిగా లేవు..ఈ జుమ్కీని నేను ఎక్కడ అలంకరించుకోవాలి, అతను నా ముఖాన్ని నాశనం చేశాడు.. నా ఆత్మవిశ్వాసాన్ని కాదు''...మంగళవారం విడుదలైన హిందీ చిత్రం 'చప్పాక్' ట్రైలర్‌లోని డైలాగ్స్ ఇవి. యాసిడ్ బాధితురాలు లక్ష్మీ అగర్వాల్ జీవితం ఆధారంగా 'రాజీ' ఫేమ్ మేఘన్ గుల్జర్ ఈ సినిమాను తెరకెక్కించారు. లక్ష్మీ అగర్వాల్ పాత్రలో దీపికా పదుకోన్ నటించారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి 10న విడుదల చేయాలనుకుంటున్నారు.

# ఈ సినిమాతో క్లారిటీ వచ్చింది

**- కార్తికేయ**


నేహా, కార్తికేయ

''90 ఎంఎల్' కథ ఎంపిక చేసుకున్నప్పుడు ప్రేక్షకులు ఎలా ఆదరిస్తారో అనుకున్నా. ప్రేక్షకులు నన్ను వైవిధ్యంగా చూడటానికి ఇష్టపడుతున్నారని ఈ సినిమాతో క్లారిటీ వచ్చేసింది'' అని కార్తికేయ అన్నారు. శేఖర్ రెడ్డి ఎర్ర దర్శకత్వంలో కార్తికేయ, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం '90 ఎంఎల్'. అశోక్ రెడ్డి గుమ్మకొండ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 6న విడుదలైంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా సక్సెస్ మీట్‌లో కార్తికేయ మాట్లాడుతూ– ''శుక్రవారం విడుదలైన మా సినిమా సక్సెస్ అయ్యిందని సోమవారంతో పూర్తిగా అర్థమైంది. ప్రతి సినిమాతో ప్రేక్షకుల్ని అలరించడానికి వంద శాతం కష్టపడతా'' అన్నారు. ''మా సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా బి,సి సెంటర్ల నుంచి మంచి స్పందన వస్తోంది'' అన్నారు శేఖర్ రెడ్డి. సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్, కథానాయిక నేహా సోలంకి పాల్గొన్నారు.

# బాగుంది అంటే చాలు

''సినిమా చూసిన తర్వాత అందులోని సందేశాన్ని ప్రేక్షకులు గుర్తుపెట్టుకోవాలి. మా సినిమాలో అవయవదానం గురించి చెప్పాం. సినిమా చూసి ప్రేక్షకులు బాగుందంటే చాలు'' అన్నారు మున్నా కాశి. ఆయన హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'హేజా'. తనికెళ్ల భరణి, ముమైత్ ఖాన్, నూతన్ నాయుడు (బిగ్‌బాస్ ఫేమ్) కీలక పాత్రధారులు. కెవిఎస్‌ఎన్ మూర్తి నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. మున్నా కాశి మాట్లాడుతూ– ''మిస్టర్ 7, యాక్షన్ 3డీ' వంటి సినిమాలకు సంగీతం అందించాను. రామ్‌గోపాల్‌వర్మగారి 'కిల్లింగ్ వీరప్పన్'కు రెండు పాటలు చేశాను. 'మామా చందమామ' సంగీత దర్శకుడిగా నా చివరి చిత్రం. సంగీత దర్శకుడిగా బ్రేక్ తీసుకుని, 'చంద్రముఖి, అరుంధతి' లాంటి హారర్ కథలు అయితే బాగుంటుందని ఈ చిత్రం చేశాను. కథలో నాది లీడ్ రోల్ మాత్రమే. కథను మలుపు తిప్పే పాత్రలో తనికెళ్ల భరణిగారు నటించారు. నా తర్వాతి చిత్రం సెటైరికల్ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది'' అన్నారు.


మున్నా కాశి

# కాలేజ్‌కి వెళ్లాను

**- రాజేంద్ర ప్రసాద్**

'కాలేజ్ కుమార్' చిత్రంలో కాలేజీకి వెళ్లేది నేనే. ఇప్పటి వరకూ నా మనసుకు నచ్చిన కథల్లో ఈ కథ కూడా ఒకటి. కథా బలం ఉండి దాన్ని ఎంటర్‌టైన్‌మెంట్‌గా చెప్పగలిగితే ప్రేక్షకులకు బాగా చేరవవుతుంది. ఈ కథకు ఆ లక్షణాలు చాలా ఉన్నాయి.. ఆద్యంతం నవ్వుతూనే ఉంటారు'' అని నటుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. రాహుల్ విజయ్, ప్రియ వడ్లమాని జంటగా రాజేంద్రప్రసాద్ ముఖ్య పాత్రలో నటించిన చిత్రం 'కాలేజ్ కుమార్'. కన్నడలో ఘన విజయం సాధించిన 'కాలేజ్ కుమార్' చిత్రాన్ని అదే పేరుతో తెలుగులో తెరకెక్కించారు డైరెక్టర్ హరి సంతోష్. లక్ష్మణ్ గౌడ సమర్పణలో ఎమ్‌ఆర్ పిక్చర్స్ పతాకంపై ఎల్. పద్మనాభ నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని రేఖ విడుదల చేశారు. రాహుల్ విజయ్ మాట్లాడుతూ– ''ప్రతి కొడుక్కి వాళ్ల నాన్నే హీరో. శివకుమార్ అనే కొడుక్కి నేల మీద నిలబడి సమాజాన్ని ఎలా చూడాలో శశికుమార్ అనే తండ్రి నేర్పిస్తాడు.. ఆ క్రమంలో వారిద్దరి మధ్య జరిగే కథే 'కాలేజ్ కుమార్'' అన్నారు. ''మా అబ్బాయి రాహుల్‌తో పాటు ఇందులో పని చేసిన అందరికీ మంచి పేరు రావాలి'' అన్నారు స్టంట్ మాస్టర్ విజయ్. ''ఈ సినిమాని తెలుగులో నిర్మించడం చాలా సంతోషంగా ఉంది'' అన్నారు ఎల్. పద్మనాభ. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీధర్ నార్ల, ప్రియ వడ్లమాని, నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడారు.


రాహుల్ విజయ్, రాజేంద్రప్రసాద్, ప్రియ

# మేం విడిపోయాం

మరో రెండు రోజులు గడిస్తే తొలి వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకోవాల్సిన సమయంలో నటి శ్వేతాబసు ప్రసాద్ జీవితంలో ఓ నిర్ణయం తీసుకున్నారు. తన భర్త రోహిత్ మిట్టల్‌తో విడిపోతున్నట్లు ఆమె వెల్లడించారు. ''రోహిత్‌తో నా వివాహ బంధం ముగిసింది. పరస్పర అంగీకారంతోనే మేం విడిపోవాలని నిర్ణయించుకున్నాం. ప్రతి పుస్తకాన్ని పూర్తిగా చదవాలనేం లేదు. అలా అని ఆ పుస్తకం మంచిది కాదని కాదు. మరొకరు చదవకూడదని కూడా కాదు. కొన్ని అలా అసంపూర్ణంగా మిగిలిపోతాయంతే. మర్చిపోలేని జ్ఞాపకాలను ఇచ్చి, ఇన్ని రోజులు నాకు స్ఫూర్తిగా నిలిచిన రోహిత్‌కు ధన్యవాదాలు. భవిష్యత్‌లో నీ (రోహిత్) జీవితం మరింత బాగుండాలని కోరుకుంటున్నాను'' అని పేర్కొన్నారు శ్వేతాబసు ప్రసాద్. గత ఏడాది డిసెంబరు 13న రోహిత్ మిట్టల్‌ను శ్వేతాబసు ప్రసాద్ వివాహం చేసుకున్న విషయం గుర్తుండే ఉంటుంది.


శ్వేతా బసు









సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
బుధవారం II 11-12-2019

సినీ పరివారం



సినిమా కుటుంబాలు రెండు రకాలు. పిల్లలను తిరిగి సినిమాల్లోనే ప్రవేశపెట్టే కుటుంబాలు కొన్ని. సంతానాన్ని కొత్త దారుల్లో నడిపించే కుటుంబాలు కొన్ని. సినిమాల్లో కొనసాగుతున్నవారు ఎలాగూ తెలుస్తారు. పరిశ్రమకు దూరంగా ఉన్నవారు ఏం చేస్తున్నారో తెలుసుకోవాలనే ఆసక్తి ఉంటుంది. అలనాటి సూపర్‌స్టార్ జమున పిల్లలు ఏం చేస్తున్నారు? కుమారుడు వంశీకృష్ణ శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉంటున్నారు. కుమార్తె స్రవంతి హైదరాబాద్‌లో తల్లితో కలిసి ఉంటున్నారు. ఆమె తన జీవితం గురించి, తల్లితో అనుబంధం గురించి 'సాక్షి'కి వివరించారు. ఆ విశేషాలు ఆమె మాటల్లో...

# అమ్మ నటి.. నేను పెయింటర్

నా చిన్నప్పుడు అమ్మ నటిగా, ఎంపీగా, సోషల్ యాక్టివిస్ట్‌గా చాలా బిజీగా ఉండటం వల్ల ఎక్కువ సమయం గడపలేకపోయాను. ఆమె ఆ పనుల నుంచి కొద్దిగా విశ్రాంతి తీసుకోవడం మొదలుపెట్టాకే ఆమెతో ఎక్కువ సమయం గడుపుతున్నాను. ఆమె నన్ను ఒక సెలబ్రిటీ కూతురులా కాకుండా సాధారణమైన అమ్మాయిగానే పెంచింది. టైమ్ మేనేజ్‌మెంట్, డిసిప్లిన్, స్వేచ్ఛ అన్నీ అలవాటు చేసింది. నేను ఫలానా వాళ్ల అమ్మాయినని చెప్పుకుని ప్రయోజనాలు పొందకూడదు అనేది. తప్పు చేయొద్దని, పనులన్నీ సొంతంగా చేసుకోవాలని చెప్పేది.

### ప్రోగ్రెస్ కార్డు వచ్చిన రోజు దెబ్బలే...

నా చిన్నప్పుడు సినిమా వాళ్ల పిల్లలు సినిమా తారలు అవుతారు అనుకునేదాన్ని. స్కూల్‌లో టీచర్లు కూడా 'నువ్వు చదువుకోకపోయినా పరవాలేదు, మీ అమ్మగారు పెద్ద హీరోయిన్ కదా, నువ్వు కూడా హీరోయిన్‌వి అయిపోతావు' అనేవారు. నేను అదే నిజం అనుకున్నాను. చదువు మీద పెద్దగా శ్రద్ధ ఉండేది కాదు. కాని అమ్మ ఊరుకునేది కాదు. తక్కువ మార్కులు వస్తే బెత్తం అందుకునేది. అందుకని నా రిపోర్టు కార్డు నాన్న స్వయంగా తీసుకునేవారు. ఆ టైమ్‌లో అమ్మకు కనపడకుండా పారిపోవడానికి ప్రయత్నించేదాన్ని. ఒక్కోసారి చెట్టు ఎక్కేసేదాన్ని. అమ్మ చేతికి చిక్కగానే రెండు దెబ్బలు పడేవి. నాకు ఇంగ్లీషు, సైన్స్ సబ్జెక్ట్స్ మాత్రమే ఇష్టం. నెమ్మదిగా చదువు మీద శ్రద్ధ పెట్టి, బి.ఏ. పూర్తి చేశాను. అమ్మ ఎంత బిజీగా ఉన్నా నేను స్కూల్‌లో ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్‌కి నా చేత సత్యభామ వేషం వేయించి, తనే కొత్త డ్రెస్ కుట్టించి, మేకప్ చేసి, పద్యాలు నేర్పించేది. మా స్కూల్‌కి వచ్చేది. అమ్మని ప్రత్యేక అతిథిగా వేదిక మీదకు ఆహ్వానించేవారు.

### తెలుగుతో సూర్యోదయం...

తెల్లవారుజామున ఇంకా చీకటిగా ఉండగానే అమ్మ నిద్ర లేచి నాకు హిందీ, తెలుగు నేర్పించేది. ఎంత ఆధునికంగా ఉన్నా, సంప్రదాయాన్ని విడిచిపెట్టకూడదని, పెద్దల పట్ల గౌరవంగా ఉండాలని అమ్మానాన్న ఇద్దరూ చెప్పేవారు. పూజ, మడి, ప్రసాదం తయారు చేయడం, నైవేద్యం పెట్టడం... అన్నీ నేర్పింది. అందరితో కలసిమెలసి ఉండాలని చెప్పేది, కలవనిచ్చేది. ఒత్తులు సరిగా పలక్కపోతే ఒప్పుకునేది కాదు. మా అబ్బాయికి కూడా అమ్మే తెలుగు నేర్పిస్తూ, తెలుగులో మాట్లాడాలని చెబుతుంది. మా చిన్నతనం నుంచి అమ్మానాన్నల్లో ఎవరో ఒకరు మా విషయాలు పట్టించుకునేవారు.

### పాటలు - పాత్రలు...

అమ్మకి జ్ఞాపకం బాగా ఎక్కువ. ఏ సినిమా ఎప్పుడు ఎక్కడ షూటింగ్ జరిగిందీ, అక్కడ సెట్లో వాళ్లు ఏ ముచ్చట్లు మాట్లాడుకున్నారో అన్నీ నాకు చెప్పేది. నేను, నాన్న 'మీరజాలగలనా' పాటను పాడుతూ అమ్మను ఆట పట్టించేవాళ్లం. అమ్మ నటించిన 'గుండమ్మ కథ' నా ఫస్ట్ ఫేవరేట్. అందులో అమ్మ వేసిన సరోజ పాత్రలో నన్ను నేను చూసుకుంటాను. నేను కూడా ఆ సినిమాలో లాగే నిద్ర మంచం మీద నుంచే 'అమ్మా! కాఫీ' అనే దాన్ని. 'కిందకి వచ్చి తాగు' అని అమ్మ గట్టిగా అనేది. ఈ సినిమాలో రెండోభాగంలో ఒక సామాన్యుడి భార్యగా అమ్మని చూడటం నాకు నచ్చేది కాదు. ఒక సినిమాలో అంత వేరియేషన్ రావడం ఆ తరవాతి రోజుల్లో నాకు బాగా నచ్చింది. పరిశ్రమలో వేరెవ్వరికీ ఇటువంటి పాత్రలు లేవేమో అనుకుంటాను. అమ్మ వేసిన పాత్రలలో 'మూగమనసులు' చిత్రంలోని గౌరి కూడా నాకు ఇష్టం. ఆ చిత్రంలో అమ్మని ముసలిగా చూడలేకపోయేదాన్ని. చిన్నప్పుడు ఈ సినిమా అమ్మతో కూర్చుని చూశాను. అమ్మ నటించిన 'మూగనోము' చిత్రాన్ని చూస్తూ, నాన్న ఏడ్చేవారు. నేను ఆ సినిమా చూడలేదు. 'ఉండమ్మా బొట్టు పెడతా'లో మహిళాశక్తి, స్త్రీ త్యాగం చూపారు. హిందీలో 'మిలన్', 'మిస్ మేరీ' సినిమాల్లో అమ్మ బాగా చేసింది. ఆధ్యాత్మిక పాత్రలు, ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే పాత్రలు, పౌరాణికాలు... ఇన్ని విలక్షణమైన పాత్రలు చేసినది బహుశ అమ్మ ఒక్కరేనేమో. అమ్మ సినిమా జీవితంలో పడిన కష్టాలు విని ఆశ్చర్యపోయాను. అమ్మను సినిమా షూటింగ్‌లో ఎప్పుడూ చూడలేదు. తీసుకెళ్లేది కాదు.

### గ్లాస్ పెయింటర్‌ని...

బి.ఏ. పూర్తయ్యాక కొంత కాలం శాన్‌ఫ్రాన్సిస్కోలో అన్నయ్య దగ్గరున్నాను. ఆ సమయంలోనే బర్కిలీలో గ్లాస్ ఆర్ట్ మీద కోర్సు చేశాను. ఇదే నా కెరీర్ అని అర్థం చేసుకుని, పెయింటింగ్స్ మీద దృష్టి పెట్టాను. గ్లాస్ పెయింటింగ్ వర్క్ అర్ధ రాత్రి వరకు చేస్తుండేదాన్ని. చేతులు కోసుకుపోతుండేవి. నా చేతులు చూసి, అమ్మ గోరుముద్దలు తినిపించేది. నవ రసాల మీద తొమ్మిది పెయింటింగులు వేసి, 'త్వమేవాహమ్' పేరు పెట్టాను. 'నిత్య విద్యార్థి'లా ఉండాలని అమ్మ ఎప్పుడూ చెబుతుంది. అమ్మ తనను తాను అలాగే అనుకుంటుంది.

- స్రవంతి



### దసరా బొమ్మల కొలువు...

అమ్మ తన బాల్యం నుంచి ఇప్పటివరకు దసరాకు బొమ్మల కొలువు పెడుతూనే ఉంది. వందేళ్లనాటి మా అమ్మమ్మ ఆడుకున్న బొమ్మలు ఇప్పటికీ ఉన్నాయి. అమ్మ పెట్టే బొమ్మల అమరికలో చాలా పర్ఫెక్షన్ ఉంటుంది. అమ్మమ్మ... అమ్మ... నేను... మా అబ్బాయి... పరంపర కొనసాగుతోంది.

### ఆ సంవత్సరం గృహిణిగా...

నాకు 16 సంవత్సరాలు వచ్చేవరకు అమ్మని ఎన్నడూ కిచెన్‌లో చూడలేదు. ఒకసారి ఒక సంవత్సరం పాటు వంట మనిషి దొరకలేదు. దానితో ఏడాదిపాటు అమ్మ తన పనులన్నీ మానేసి, కెరీర్‌కి సెలవు పెట్టేసింది. వంటల పుస్తకాలు తెప్పించుకుని, చదివి, చేసేది. అమ్మ చేసిన వాటిలో క్యాలీఫ్లవర్ బజ్జీ, వెజిటబుల్ అగ్రెట్టా (ఇటాలియన్) నాకు బాగా ఇష్టం. ప్రతిరోజూ నా బాక్స్‌లో లంచ్ నా స్నేహితులు తీసుకుని తినేసేవారు. ఇంటికి వచ్చాక అమ్మ, 'ఈ రోజు లంచ్ ఎలా ఉంది' అని అడిగితే, నేను సమాధానం చెప్పలేకపోయేదాన్ని. ఆ ఏడాది అమ్మని అచ్చమైన గృహిణిగా చూశాను.

### వ్యక్తిత్వం నిలబెట్టుకుంది...

సినిమా రంగంలో వ్యక్తిత్వం నిలబెట్టుకున్న అమ్మ దగ్గర ఎవ్వరూ వెకిలి జోకులు వేసేవారు కాదు. అలా నిలదొక్కుకోవడం చాలా కష్టమని చెప్పేది. మా అబ్బాయితో రెజ్లింగ్ చేస్తుంది. అమ్మ డైట్ చాలా డిసిప్లిన్డ్‌గా ఉంటుంది. ఇప్పటికీ మాకు ఆహారపు అలవాట్ల గురించి క్లాసు పీకుతుంది. అమ్మ నుంచి జెనెటిక్‌గా నాకు మంచి ఆరోగ్యం వచ్చింది. అమ్మకు కోపం ఎంత త్వరగా వస్తుందో, అంత త్వరగా పోతుంది. పర్ఫెక్షన్ కోసమే అమ్మకి కోపం వస్తుంది. అన్నయ్య, నేను సినిమాలలోకి వెళ్లకపోయినా, మనవడైనా సినిమాలలోకి ప్రవేశించి, తన పేరు నిలబెట్టాలని కోరుకుంటోంది అమ్మ.

– సంభాషణ:డా. వైజయంతి పురాణపండ

ఫొటోలు: శివ మల్లాల

సీరియల్

'చిన్నప్పుడు క్రికెట్ ఆడుకొని ఇంటికి వచ్చాక టీవీ చూద్దామంటే ఇంట్లో అమ్మ, అక్కవాళ్లు సీరియల్స్ చూస్తుండేవాళ్లు. సినిమా పెట్టమంటే నన్ను బయటకు వెళ్లమని తిట్టేవారు. ఇప్పుడు నేను సీరియల్స్‌లో చేస్తూ మా అమ్మవాళ్లని చూడమని రిక్వెస్ట్ చేస్తుంటాను' అని నవ్వుతూ తన నట ప్రయాణాన్ని పంచుకున్నారు సిద్ధార్థ. జీ తెలుగులో వచ్చే గంగ-మంగ సీరియల్‌లో 'సిద్ధు'గా బుల్లితెర ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న సిద్ధార్థ పంచుకున్న కబుర్లివి.

# అంత ఈజీగా ఏమీ సిద్ధించలేదు

ఐదేళ్లు అయ్యింది ఈ ఫీల్డ్‌కి వచ్చి. సినిమా అవకాశాల కోసం వైజాగ్ నుంచి హైదరాబాద్ వచ్చిన కొత్తలో చాలా సమస్యలు ఎదుర్కొన్నాను. ఆదాయం ఏమీ లేదు. ఇంటి దగ్గర నుంచి డబ్బు వచ్చే అవకాశం లేదు. అలాంటి సమయంలో మా కజిన్ నన్ను బాగా చూసుకున్నాడు.

### బుల్లితెర ప్రయాణం

హైదరాబాద్‌లో ఉన్న మా బ్రదర్ తప్ప అంతకుమించి ఎవ్వరూ తెలియదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సినిమా అవకాశాల కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతూనే ఉండేవాణ్ణి. ఆరునెలల పాటు అందరి వెనకాల తిరిగాను. అందరూ చేద్దాం, చూద్దాం అంటున్నారు. ఇక ఇలా లాభం లేదని సీరియస్‌గా ట్రై చేద్దామని ఒక సీరియల్ మేనేజర్‌కి కాల్ చేశాను. లొకేషన్‌కి రమ్మనడంతో వెళ్లి మాట్లాడాను. వారం తర్వాత వాళ్లే ఫోన్ చేశారు ఆడిషన్స్‌కి రమ్మని. అలా 'అమెరికా అమ్మాయి' సీరియల్‌తో నా టీవీ జర్నీ మొదలయ్యింది. అటు తర్వాత 'కథలో రాజకుమారి', 'మనసు మమత' సీరియల్స్ చేశాను. ఇప్పుడు 'గంగ మంగ' సీరియల్ చేస్తున్నాను. రేపు ఎలా ఉంటుందో ఇక్కడ గ్యారంటీ ఏమీ లేదు. అవకాశాలు వస్తుంటాయి. వాటిని చేసుకుంటూ వెళ్లడమే.

### గ్యాప్‌లో సినిమా

ఖాళీ దొరికితే చేసే పని సినిమాలు చూడ్డం. ఒకేసారి వరసబెట్టి హాలీవుడ్, బాలీవుడ్, టాలీవుడ్.. చూస్తూ ఉంటాను. లేదంటే జిమ్‌లో ఉంటాను. ఇంకాస్త టైమ్ ఉంటే ప్రొడక్షన్ ఆఫీసుల వారిని కలుస్తుంటాను. ఒక సీరియల్ చేస్తూ మిగతా 15 రోజులు సినిమాలకు ట్రై చేస్తున్నాను. సినిమా, టీవీ రెండింటిలోనూ రాణించాలన్నది నా కల. ఒకప్పుడు మా ఊళ్లో చుట్టుపక్కల వాళ్లు 'చదువుకొని కూడా మీ అబ్బాయి ఎందుకు లైఫ్ వేస్ట్ చేసుకుంటున్నాడు' అని అనేవారు. ఇప్పుడు మీ వాడు సూపర్ అంటుంటారు. ఈ మాటలు అమ్మానాన్నలు చెబుతుంటే చాలా సంతోషం అనిపిస్తుంది. మన పొజిషన్‌ను బట్టి బయటి వాళ్ల మాటలు ఉంటాయి. వారికేది అనిపిస్తే అది మాట్లాడుతుంటారు.

### గైడ్‌గా నళినమ్మ!

సీరియల్ టీమ్ ఒక మంచి కుటుంబంలా కలిసిపోయింది. మాకందరికీ పెద్ద దిక్కు అంటే నళినమ్మ. చాలా మంచావిడ. లొకేషన్‌కి ఉదయం ఏడు గంటలకే రకరకాల వంటకాలు చేసుకొని మరీ మా కోసం తీసుకువస్తారు. ఒక కుటుంబంలా కలిసిపోయాం. నటనలో సలహాలు, సినిమా విశేషాలు ఒకప్పటి హీరోయిన్‌గా రాణించిన నళినమ్మే చెబుతుంటారు. అవన్నీ నన్ను నేను బెటర్ చేసుకోవడానికి ఉపయోగపడుతుంటాయి. షూటింగ్‌లో చిన్న గ్యాప్ దొరికినా నళినమ్మ చుట్టూతా కూర్చుంటాం. తను చూసొచ్చిన ఇండస్ట్రీ గురించి విషయాలు చెప్పమని అడుగుతుంటాం. అల్లరి చేస్తూ ఉంటాం.

### షార్ట్ ఫిల్మ్స్ ప్లాన్

బీటెక్ చేశాను. అమ్మానాన్న వైజాగ్‌లోనే ఉంటారు. పదవ తరగతి పూర్తయినప్పటి నుంచే షార్ట్‌ఫిల్మ్స్ తీయాలనే ప్లాన్‌లో ఉండేది మా స్నేహ బృందం. హర్రర్, సస్పెన్స్ షార్ట్ ఫిల్మ్స్‌కి ట్రై చేసేవాణ్ణి. దీంతో కెమెరా, షూట్స్, స్క్రిప్ట్.. ఈ హంగామా అంతా బాగా ఆకట్టుకుంది. ఫ్రెండ్స్ కూడా ఎంకరేజ్ చేశారు. చదువయ్యాక చిన్న మూవీ చేశాను. కానీ రిలీజ్ అవలేదు. ఇలా అయితే టైమ్ వేస్ట్ అవుతుందని హైదరాబాద్ వచ్చేశాను.

### గంగ - మంగ

జీ తెలుగులో వచ్చే గంగ మంగ సీరియల్ కథనం చాలా ఆసక్తిగా ఉంటుంది. ప్రస్తుతం సీరియల్‌లో గంగకి, సిద్దుకి పెళ్లవదు. గంగ తనే తాళి కట్టేసుకుంటుంది. ఇంట్లో వాళ్లందరినీ ఒప్పించి మళ్లీ పెళ్లి చేసుకోవాలని వాళ్ల ఆలోచన. మధ్యలో అడ్డంకులు వస్తుంటాయి.

ఇంటర్వ్యూ
నిర్మలారెడ్డి



'గంగ-మంగ' సీరియల్‌లో...





సిద్ధార్థ

చారిటీ కాలం

# ఆనందానికి అడ్రెస్ ఇవ్వండి



ఈ కాలం ధరించడానికి సరైన దుస్తులు లేక చల్లటి వాతావరణాన్ని తట్టుకోలేక కొంత మంది కఠిన పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇలాంటప్పుడే కొందరు దాతలు ముందుకువచ్చి తాము వాడని దుస్తులను అవసరమైన వారికి ఇస్తుంటారు. మీరు దానంగా ఇచ్చే దుస్తులను తీసుకున్నవారి ముఖంలో చిరునవ్వులు వెలిగే విధంగా ఉండాలి. అందుకు ఏం చేయాలో తెలుసుకుందాం..

### ఎంపిక అవసరం

మీ దుస్తుల అల్మారాను ఒకసారి క్షుణ్ణంగా పరిశీలించండి. కొన్నాళ్లుగా పక్కన పెట్టేసినవి, మీకు నచ్చనివి, మరోసారి అవి మీకు తగిన విధంగా ఉన్నాయా అనేది సరిచూసుకోండి. వాటిలో కుటుంబసభ్యులకు ఏవైనా ఉపయోగించవచ్చా అని ఆలోచించి, ఎంపిక చేసి పక్కన పెట్టండి.. చిరిగిన, మరకలు పడిన, ఇంకొద్ది రోజుల్లో పూర్తిగా పనికిరావు అనుకున్న దుస్తులను దానంగా ఇవ్వాలనుకోవద్దు.

### దారాల బంధం



కొన్ని డ్రెస్సులు కొద్దిగా చిరిగినవో, కుట్లు ఊడిపోయినవో ఉంటాయి. ఇలాంటప్పుడు సూది, దారం తీసుకొని ఆ డ్రెస్సులు తిరిగి వాడేలా కుట్లు వేయాలి. మీరు చేసే పని మానవత్వానికి సంబంధించింది కాబట్టి ఆ దయ, ప్రేమ ఆ దుస్తుల ద్వారా వాటిని అందుకున్నవారికి చేరుతుంది. ఇది మీలో ఓ గొప్ప పాజిటివ్ శక్తిని నింపుతుంది. బట్టలన్నీ సేకరించడమే కాదు, వాటిని ఉపయోగించే విధంగా బాగుచేసి ఇవ్వడంలోనే మన గొప్పదనం దాగుంటుంది. ఉదాహరణకు పాత జీన్స్, పాత మోడల్ అనిపించిన ఫుల్ హ్యాండ్ షర్ట్స్, వాడని స్కార్ఫ్స్, స్వెటర్స్.. వంటివి ఇవ్వచ్చు.

### స్వచ్ఛమైన మనసు

'దానంగా ఇచ్చే బట్టలే కదా మళ్లీ వాటిని శుభ్రం చేయడం ఎందుకు' అనే ఆలోచనతో వాటిని అలాగే ఇవ్వకూడదు. సరిచేసిన దుస్తులను, శుభ్రం చేసి, చక్కగా మడతవేసి ఇస్తే వాటిని అందుకున్నవారి మనసు కూడా అంతే ఆనందంగా ఉంటుంది.

### కాలానికి తగినవి

ఏ కాలంలో దుస్తులను ఇస్తున్నాం అనేది కూడా ముఖ్యం. చలికాలం కాబట్టి ఈ కాలం వాడుకోదగిన దుస్తులనే దానంగా ఇస్తే అవి వారికి ఉపయోగపడతాయి. అలాకాకుండా ఇంట్లోని చెత్త తీసేస్తున్నాం అనుకుంటే వేసవి కాలానికి అనువైన డ్రెస్సులు కూడా ఆ జాబితాలో ఉంటాయి. అవి, చివరకు ఎవరికీ ఉపయోగం లేని విధంగా ఉండిపోతాయి.

### ఎవరికి అవసరమో వారికే!

సేకరించిన, బాగు చేసిన బట్టలన్నీ ఒక దగ్గరగా ఉంచాక ఎవరికి ఇవ్వాలో కూడా సరిచూసుకోవాలి. అందుకు స్వచ్ఛంద సంస్థలు గానీ దగ్గరలో ఉన్న ఆశ్రమాలకు గాని వెళ్లి వాటిని ఇవ్వచ్చు. ఇందుకు ఆన్‌లైన్ సమాచారం కూడా ఉపయోగపడుతుంది.

ఫెర్టిలిటీ కౌన్సెలింగ్

ఫ్యామిలీ డాక్టర్

# ఓవరీలో సిస్ట్... సంతానం కలుగుతుందా?

**నా వయసు 32 ఏళ్లు. పెళ్లయి ఎనిమిదేళ్లు అవుతోంది. ఇంతవరకు పిల్లలు లేరు. కొన్నాళ్ల క్రితం స్కానింగ్ తీయించాం. ఓవరీలలో సిస్ట్ ఉందని తెలిసింది. భవిష్యత్తులో అది క్యాన్సర్‌గా మారే అవకాశం ఉందని మా ఫ్రెండ్స్ చెబుతుంటే నాకు చాలా ఆందోళనగా ఉంది. సిస్ట్ ఉన్నవారికి సంతానం పొందే అవకాశాలు ఎలా ఉంటాయి. ఈ విషయమై నాకు వివరంగా చెప్పండి.**

**- ఆర్. ధనలక్ష్మి, నిడదవోలు**

ఓవేరియన్ సిస్ట్ (అండాశయాల్లో నీటితిత్తులు) ఉండటం అన్నది చాలా సాధారణ సమస్య. ఇవి చాలామందిలో కనిపిస్తుంటాయి. ఈ నీటితిత్తులు క్యాన్సర్ కణాలుగా మారవు. చాలామందిలో అవి కొద్దికాలం పాటు కనిపించి, ఆ తర్వాత వాటంతట అవే తగ్గిపోతాయి. కాబట్టి మీరు వీటి గురించి ఆందోళన పడాల్సిన అవసరం లేదు. ఓవేరియన్ సిస్ట్స్ ఉన్న మహిళలు డాక్టర్ల దగ్గరికి వచ్చినప్పుడు అవి ఏ తరహాకు చెందినవో గుర్తించేందుకు వైద్యులు ప్రయత్నిస్తారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్ష ద్వారా వాటి పరిమాణం, సంఖ్య, వాటిలోకి జరిగే రక్తసరఫరా వంటి అంశాలను తెలుసుకుంటారు. కొన్ని సందర్భాల్లో కొన్ని రక్తపరీక్షలు, ఎమ్మారై వంటి ఇతర పరీక్షలనూ చేయించాల్సి వస్తుంది. ఫ్యామిలీ హిస్టరీ గురించి తెలుసుకొని అలా వాళ్ల కుటుంబ చరిత్రలో క్యాన్సర్లు వచ్చి ఉంటే వారికి మరికొన్ని అదనపు పరీక్షలు సైతం చేయించాల్సి ఉంటుంది. చాలా సందర్భాల్లో ఓవేరియన్ సిస్ట్‌లు వాటంతట అవే తగ్గిపోతాయి. అయితే వాటి పరిమాణం పెరుగుపోతున్నా లేదా ట్విస్ట్ అవుతున్నా, అవి చీరుకుపోయి రక్తస్రావం అవుతున్నా, వాటి వల్ల నొప్పి కలుగుతుంటే మాత్రం వాటిని శస్త్రచికిత్స ద్వారా తొలగించాల్సి ఉంటుంది. ఈ శస్త్రచికిత్స సైతం లాపరోస్కోపీ ప్రక్రియ ద్వారా చేయడం కూడా చాలామందిలో సాధ్యమవుతుంది. కొన్ని సందర్భాల్లో ఇలా సిస్ట్‌లు రావడం అన్నది ఎండోమెట్రియాసిస్ కారణంగా జరుగుతుంటుంది. అలాంటప్పుడు రుతుస్రావం, కలయిక సమయంలో నొప్పి, గర్భధారణకు అడ్డంకిగా ఉంటుంది.

ఇక గర్భధారణ అవకాశాల విషయానికి వస్తే మీకు గర్భధారణ జరగకపోవడానికి ఇంకా ఏయే అంశాలు కారణమో పూర్తిగా విశ్లేషించాల్సి ఉంటుంది. దాంతోపాటు మీలో వస్తున్న సిస్ట్‌లు ఏ తరహాకు చెందినవి అని తెలుసుకోవడం కూడా అవసరమే. అంతేకాకుండా మహిళల్లో వయసు పెరుగుతున్న కొద్దీ గర్భధారణకు అవకాశాలు తగ్గిపోతాయి. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకొని వీలైనంత త్వరగా వైద్య నిపుణులను కలవండి.



# ఎండోమెట్రియాసిస్‌కు సర్జరీ అయ్యింది... పిల్లలు పుట్టే ఛాన్స్ ఉందా?

**నా వయసు 35 ఏళ్లు. పెళ్లయి పదేళ్లు అవుతోంది. పీరియడ్స్ సమయంలో తీవ్రమైన నొప్పి వస్తుంటే ఇటీవలే డాక్టర్‌ను కలిశాను. అక్కడ నాకు 'ఎండోమెట్రియాసిస్' ఉందని వైద్యులు నిర్ధారణ చేసి, లాపరోస్కోపిక్ ఆపరేషన్ చేశారు. నాకు పిల్లలు పుట్టే అవకాశాలున్నాయా? నాకు పీరియడ్స్ సమయంలో మళ్లీ మళ్లీ నొప్పి వచ్చే అవకాశాలు ఉన్నాయా?**

**- ఒక సోదరి, సికింద్రాబాద్**

ఎండోమెట్రియాసిస్ సమస్య రావడం అన్నది చాలామంది మహిళల్లో కనిపించే సాధారణమైన విషయం. ల్యాపరోస్కోపిక్ శస్త్రచికిత్స తర్వాత కొంతమందిలో ఈ నొప్పి పూర్తిగా తగ్గిపోతుంది. అయితే మరి కొంతమందిలో మాత్రం నొప్పి మళ్లీ రావచ్చు. నొప్పి తీవ్రత తక్కువగా ఉంటే జీవనశైలిలో చిన్న చిన్న మార్పులతో దాన్ని నియంత్రించవచ్చు. అంటే... తేలికపాటి వ్యాయామాలు చేయడంతో పాటు చాలా తక్కువ మోతాదుల్లో నొప్పినివారణమాత్రలు వాడుతూ నొప్పిని అదుపులో ఉంచవచ్చు. కానీ కొందరిలో మాత్రం నొప్పి తీవ్రత చాల ఎక్కువగా ఉంటుంది. అలాంటివారిలో వాళ్లు మళ్లీ గర్భధారణను కోరుకోకపోతే... వారికి హార్మోన్లలో మార్పులు తీసుకువచ్చే మందులను డాక్టర్లు సూచిస్తారు. అయితే నొప్పి తీవ్రత చాలా ఎక్కువగా ఉంటే మాత్రం మళ్లీ శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం రావచ్చు. అయితే దాదాపు 60 శాతం నుంచి 80 శాతం మందిలో మళ్లీ గర్భధారణ వచ్చేలాగే శస్త్రచికిత్స చేసి, నొప్పిని నియంత్రించవచ్చు. మీ లేఖను బట్టి మీరు గర్భధారణను కోరుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఒకవేళ మీరు గర్భధారణను కోరుకుంటుంటే మాత్రం 'ఫెర్టిలిటీ ఇవాల్యుయేషన్' (అంటే గర్భధారణకు అవకాశాలను తెలుసుకునేందుకు కొన్ని పరీక్షలు) చేయించాల్సి ఉంటుంది. మీరు రాసినదాన్ని బట్టి మీకు మినిమల్/మైల్డ్ ఎండోమెట్రియాసిస్ ఉండటం వల్ల లాపరోస్కోపిక్ చికిత్స జరిగినట్లు తెలిపారు. కాబట్టి కొన్ని రకాల మందులతో మీలో అండం విడుదల (ఒవ్యులేషన్) అయ్యేలా చేసి, ఐయూఐ (ఇంట్రా యుటెరైన్ ఇన్‌సెమినేషన్) వంటి ప్రక్రియలను అనుసరిస్తే... మీలో గర్భధారణకు కొంతవరకు అవకాశాలు ఉండవచ్చు. కాకపోతే తీవ్రమైన ఎండోమెట్రియాసిస్ (సివియర్ ఎండోమెట్రియాసిస్) కేసుల్లో మాత్రం ఐవీఎఫ్ వంటి ఆధునిక ప్రక్రియలకు వెళ్లాల్సిన అవసరం ఉంటుంది. ఈరోజుల్లో సంతాన సాఫల్యానికి తగిన ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. మీరు సంబంధిత నిపుణులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోండి.



డాక్టర్ ప్రీతిరెడ్డి
సీనియర్ కన్సల్టెంట్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్,
బర్త్ రైట్ బై రెయిన్‌బో, హైదరాబాద్

epaper.sakshi.com

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
బుధవారం 11-12-2019



మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com


**నేడు ప్రపంచమంతా ఇంటర్నెట్ మీద ఆధారపడి నడుస్తోంది. మన దేశంలోనూ గత మూడేళ్లుగా డేటా వినియోగం విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా వీడియో కంటెంట్ పట్ల వీక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. అదే సమయంలో డేటా చార్జీలు తగ్గడం మరింత ఊతమిస్తోంది. గూగుల్ తర్వాత ఎక్కువ మంది, ఎక్కువ సార్లు వీక్షిస్తున్న వెబ్‌సైట్.. 'యూట్యూబ్'. ఈ డిజిటల్ వీడియో వేదిక ప్రజలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని పంచడంతోపాటు వీడియో క్రియేటర్లకు ఆదాయాన్ని కూడా తెచ్చిపెడుతోంది. మన అభిరుచికి తగిన టాపిక్ ఎంచుకొని.. దానికి సంబంధించిన వివరాలను వీడియోల రూపంలో యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేస్తూ సంపాదించుకోవచ్చు. ఇటీవల కాలంలో ఎంతోమంది యూట్యూబ్‌ను ఆఫ్‌బీట్ కెరీర్‌గా ఎంచుకుంటున్నారు. యూట్యూబర్‌గా మారి ఉపాధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో.. యూట్యూబ్ ఛానల్ ద్వారా ఉపాధి మార్గాల గురించి తెలుసుకుందాం...**

ఆఫ్‌బీట్ కెరీర్

# కంటెంటే కింగ్.. ప్రతిభే పెట్టుబడి!




- ఆఫ్‌బీట్ కెరీర్‌గా యూట్యూబ్ ఛానల్
- ప్రతిభను ప్రదర్శించేందుకు సరికొత్త వేదిక
- నాణ్యమైన కంటెంట్‌తో ఆదాయానికి మార్గం
- యూట్యూబర్‌గా మారేందుకు యువత ఆసక్తి

**యూట్యూబ్..** వీడియో డిజిటల్ వేదిక. ఫుడ్ నుంచి ఫార్మింగ్ వరకూ.. అనేకానేక అంశాలపై విజ్ఞానం, వినోదం, సమీక్షలు.. ఇలా ఎన్నో విషయాలను యూట్యూబ్ ద్వారా తెలుసుకోవచ్చు. దీని ద్వారా మనకు తెలియని ఎన్నో విషయాలపై అవగాహన పెంచుకోవచ్చు. యూట్యూబ్ మిమ్మల్ని రాత్రికి రాత్రే స్టార్లుగా మార్చేయవచ్చు. ఊహించని డబ్బు తెచ్చిపెట్టవచ్చు. ఇందుకోసం పెద్దగా పెట్టుబడి అవసరం లేదు. వినూత్నంగా ఆలోచించే తత్వం, ఆసక్తికరమైన కొత్త సబ్జెక్టును ఎంచుకోవడం, టెక్నికల్ నాలెడ్జ్, నాణ్యమైన కంటెంట్, ఓపికగా ఎడిటింగ్ చేయగలగడం, సరికొత్తగా ప్రజెంటేషన్ చేయగలిగితే చాలు.. యూట్యూబ్ ఛానల్ ఆదాయ వనరుగా మారుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే.. విభిన్న ఆలోచనా ధోరణి, సృజనాత్మకత ఉన్నవారికి యూట్యూబ్ చక్కటి వేదిక.

### ప్రతిభకు వేదిక

ప్రతిభను ప్రపంచానికి చాటేందుకు యూట్యూబ్ ప్లాట్‌ఫాం ఉపయోగపడుతుంది. ముఖ్యంగా సినిమా రంగంలో రైటింగ్, డైరెక్షన్, ఫొటోగ్రఫీ, స్క్రీన్‌ప్లే, మ్యూజిక్, ఎడిటింగ్, విజువల్ వర్క్స్ మొదలైన విభాగాల్లో అవకాశాల కోసం యూట్యూబ్‌ను ఉపయోగించుకోవచ్చు. సాహో సుజిత్, పెళ్లి చూపులు తరుణ్ భాస్కర్, ఘాజీ సంకల్ప్ రెడ్డి, వైవా హర్ష, ప్రియదర్శి, రాహుల్ వంటి ఎంతో మంది యూట్యూబ్‌లో తమ ప్రతిభను నిరూపించుకొని సినిమాల్లో అవకాశాలు దక్కించుకున్నవారే.

### ఛానల్ ప్రారంభం

గూగుల్ అకౌంట్ ఆధారంగా యూట్యూబ్ ఛానల్ ఓపెన్ చేయొచ్చు. గూగుల్ ఖాతాతోనే యూట్యూబ్ అకౌంట్ తీసుకొని అదే పేరుతో ఛానల్ నడిపించవచ్చు. యూట్యూబ్ చానల్ ఓపెన్ చేశాక.. అప్‌లోడ్ బటన్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి వీడియో అప్‌లోడ్ చేయవచ్చు. అప్‌లోడింగ్ చేసే వీడియోలు సొంతంగా తీసినవి మాత్రమే పెట్టాలి. ఇతరుల వీడియోలు పెడితే కాపీ రైట్ కింద వాటిని తొలగిస్తారు. ఖాతా కూడా డిలీట్ చేసే ఆస్కారం ఉంటుంది. మీరు అప్‌లోడ్ చేసే వీడియోలకు యూట్యూబ్ మేనేజ్‌మెంట్ యాడ్స్ జత చేస్తుంది. వాటిద్వారా వచ్చే యాడ్ రెవెన్యూలో మెజారిటీ వాటా (దాదాపు 60 శాతం రెవెన్యూ) మీకే చెందుతుంది. ఇందుకోసం పలు నిబంధనలను యూట్యూబ్ అమలు చేస్తుంది.

### నిబంధనలు

కనీసం వెయి మంది ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోవాలి. అలాగే కనీసం 4000 గంటల వాచ్‌టైం పూర్తవ్వాలి. ఇటీవల యూట్యూబ్‌లో స్పామ్ కంటెంట్ పెరగడం, వీడియోలను వాయిస్‌ఓవర్‌తో తప్పుదోవ పట్టిస్తున్న సందర్భాలు ఎక్కువ అవడంతో గూగుల్ సంస్థ యూట్యూబ్ నిబంధనలను కఠిన తరం చేసింది. దీంతో సొంతంగా రూపొందించిన, నాణ్యమైన కంటెంట్ ఉంటేనే ప్రాధాన్యం లభిస్తోంది. సరైన సబ్జెక్టు ఎంచుకొని.. నాణ్యమైన వీడియోలు అప్‌లోడ్ చేయడం ద్వారా ముందుకు దూసుకుపోవచ్చు. మొబైల్స్, గాడ్జెట్స్, మ్యూజిక్, ట్రావెల్, గేమింగ్, టెక్నాలజీ, ఫుడ్, బ్యూటీ అండ్ ఫ్యాషన్, రివ్యూలు, సినిమా, ఫన్, ప్రాంక్, స్పోర్ట్స్ విభాగాల్లో వీడియోలకు డిమాండ్ ఉందని యూట్యూబర్స్ చెబుతున్నారు.

### ఆదాయం ఎలా

నిర్దేశిత సబ్‌స్క్రిప్షన్స్, వాచ్‌టైమ్ లక్ష్యం చేరిన తర్వాత యాడ్స్ ప్లే అవడానికి గూగుల్ యాడ్‌సెన్స్ అకౌంట్ క్రియేట్ చేసుకోవాలి. ఇక్కడ వచ్చే ఒక ఐడీ నంబర్‌ను మానిటైజేషన్ ఆప్షన్‌లో నమోదు చేసిన తర్వాత యూట్యూబ్ నుంచి మెయిల్ వస్తుంది. తర్వాత బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం వ్యూస్ ఆధారంగా డబ్బు రావడం ప్రారంభమవుతుంది. యాడ్‌సెన్స్ అకౌంట్‌లో ఖాతా వివరాలను తెలుసుకోవచ్చు. సాధారణంగా ప్రతి వెయ్యి వీక్షణలకు వీడియో నిడివి, జోనర్, లోకేషన్ ఆధారంగా 1.5 డాలర్ల నుంచి 6 డాలర్లకు వస్తుంటాయి. పది లక్షల వ్యూస్ వస్తే సగటును 2 వేల డాలర్లు వరకు వచ్చే అవకాశం ఉంటుంది. 2017 నుంచి యాడ్ రెవెన్యూ తగ్గినట్లు ప్రముఖ యూట్యూబర్ ఒకరు చెప్పారు. ట్రెండింగ్, రికమెండెడ్, సెర్చ్‌లో వీడియోలు కనిపించడం తగ్గుతోందని చెబుతున్నారు.

### ప్రమోషన్స్ ద్వారా

యూట్యూబ్ అంటే కేవలం వ్యూస్(వీక్షణలు) ద్వారానే కాకుండా.. ఇతర మార్గాల ద్వారా కూడా డబ్బు సంపాదించుకోవచ్చు. వాటిల్లో ప్రధానంగా ఉత్పత్తులను ప్రమోట్ చేసుకోవడం ద్వారా ఆకర్షణీయమైన మొత్తం పొందవచ్చు. యూట్యూబ్‌లో తక్షణమే ఛానల్‌కు పేరు రావడం, ఆదాయం పెరగడం జరగదు. సబ్‌స్క్రైబర్స్‌ను ఆకట్టుకుంటూ.. వారి సంఖ్య పెంచుకునేందుకు చాలా కాలం ఓపికతో ఉండాలి. సబ్‌స్క్రిప్షన్స్ పెరిగాక వస్తువుల ఉత్పత్తిదారులు, సేవలు అందించే సంస్థలు మీ ఛానల్ ద్వారా ప్రమోషన్ కోసం ప్రయత్నిస్తాయి. వారి ఉత్పత్తులను, సేవలను ప్రమోట్ చేయడం ద్వారా డబ్బు సంపాదించుకోవచ్చు. పెద్ద సంస్థలు కూడా ఛానల్ ద్వారా ప్రమోషన్స్ పొందేందుకు ప్రయత్నిస్తుంటాయి. మరోవైపు సొంతంగా.. టీ షర్ట్స్, బుక్స్ వంటి వాటిని ప్రమోట్ చేసుకుంటూ.. వాటి అమ్మకాల ద్వారా కూడా ఆర్జించొచ్చు.

### ముఖ్యమైన టూల్స్

- యూట్యూబ్ ఛానల్ ఓపెన్ చేయడానికి పెట్టుబడి అవసరం లేకున్నా .. వీడియోలను కొన్ని టూల్స్ ద్వారా ఆకర్షణీయంగా రూపొందించవచ్చు. ఫలితంగా వ్యూస్‌తో పాటు సబ్‌స్క్రిప్షన్స్ కూడా పెరుగుతాయి.
- ఛానల్ ప్రారంభించే ముందు మీరు ఎంచుకునే జోనర్‌పై స్పష్టత ఉండాలి. దాని కోసం కొంత పరిశోధన చేయాలి. వీడియో రికార్డింగ్ కోసం 720పి రెజల్యూషన్ కంటే ఎక్కువ క్వాలిటీతో రికార్డింగ్ చేస్తే మేలు. బడ్జెట్ అనుకూలిస్తే తక్కువ బడ్జెట్‌లో అందుబాటులో ఉన్న డీఎస్‌ఎల్‌ఆర్ కెమెరాలు తీసుకొని..వాటితో వీడియోలు చేయవచ్చు. ప్రస్తుతం మొబైల్‌లోనూ హైరెజల్యూషన్ వీడియోస్ తీసే అవకాశం ఉంది.
- ట్రైపాడ్స్ తీసుకుంటే రికార్డింగ్ సులువు అవుతుంది. మార్కెట్‌లో తక్కువ పెట్టుబడితో ట్రైపాడ్స్ కొనుగోలు చేయవచ్చు.
- మైక్రోఫోన్ ఆధారంగా చక్కటి ఆడియోతో వీడియో రికార్డింగ్ సాధ్యపడుతుంది. ఇది ప్రేక్షకుల ఆదరణ పొందడానికి ఉపయోగపడుతుంది.
- బ్లూ స్క్రీన్ లేదా గ్రీన్ స్క్రీన్ ఉపయోగిస్తే బ్యాక్‌గ్రౌండ్ ఎడిటింగ్ సులువు అవుతుంది.
- వీడియో రికార్డింగ్ చేసే క్రమంలో ఏవైనా అవాంతరాలు రావడం సహజం. వాటిని డిలీట్ చేయడానికి ఎడిటింగ్ టూల్స్ ఉపయోగపడతాయి. అంతేగాకుండా, వీడియో, ఆడియో ఎడిటింగ్ టూల్స్ ఉపయోగించి వీడియోను ప్రొఫెషనల్‌గా తీర్చిదిద్దవచ్చు. ముఖ్యంగా వీడియో ఎడిటర్ల కోసం థర్డ్ పార్టీ సాఫ్ట్‌వేర్లను ఉపయోగించుకోవచ్చు. యూట్యూబ్‌లోనూ ఇన్‌బిల్ట్ ఎడిటింగ్ టూల్స్ ఉంటాయని.. వాటిని ఉపయోగించుకుంటే.. కోరుకున్న అవుట్‌పుట్ వస్తుందని నిపుణులు చెబుతున్నారు.

### చిట్కాలు

- వ్యూస్ పెంచుకునేందుకు కొన్ని చిట్కాలు పాటించడం తప్పనిసరి. ప్రధానంగా టైటిల్స్ ఆకర్షించే విధంగా ఉండాలి. అలానే, థంబ్ నైల్స్ కూడా చూపరులను ఇట్టే కట్టిపడేసే విధంగా కనిపించాలి. తెలుగులో ఛానల్ ప్రారంభిస్తే.. తెలుగు భాషలోనే కీవర్డ్స్ ఇవ్వాలి. ఇక, యూట్యూబ్ నుంచి కూడా ఆటోమేటిక్/సజెస్టెడ్ కీవర్డ్స్ వస్తుంటాయి. వాటిని ఉపయోగించుకోవాలి. 'కీవర్డ్స్', 'కీఫ్రేజెస్' ఇచ్చేటప్పుడు సెట్ అయ్యేవి ఇవ్వాలి. కొత్త ఛానల్ పెట్టిన వారు 'కీ ఫ్రేజెస్'కు ప్రాధాన్యం ఇవ్వాలి. 'న్యూస్', 'ఎంటర్‌టైన్‌మెంట్' విభాగాల వీడియోలు ట్రెండింగ్‌లో నిలుస్తున్నాయి!!

### స్పాన్సర్‌షిప్

- కొన్ని ఛానల్స్ పలు ఉత్పత్తుల రివ్యూలు చేసి.. వాటిని కొనుగోలు చేసుకునేందుకు ఆ వీడియో కిందనే లింక్ ఇస్తాయి. వాటిని అఫిలియేట్ లింక్స్ అంటారు. ఎవరైనా యూజర్ మీరు ఇచ్చే లింక్ ద్వారా కొనుగోలు చేస్తే.. మీకు సుమారు 6 శాతం కమీషన్ దక్కుతుంది.
- స్పాన్సర్‌షిప్స్ ద్వారా మంచి ఆదాయాన్ని పొందొచ్చు. సబ్‌స్క్రైబర్ల సంఖ్య, వస్తున్న వీక్షణలు మొదలైన వాటి ఆధారంగా చాలా బ్రాండెడ్ కంపెనీలు పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించి.. ప్రచారం పొందేందుకు ముందుకు వస్తాయి. ఇప్పటికే ప్రముఖ బ్రాండెడ్ సంస్థ 'అడిదాస్' సంప్రదాయక టీవీ, పేపర్ యాడ్స్ మానేసి.. పూర్తిగా డిజిటల్ యాడ్స్ ద్వారా మాత్రమే వినియోగదారులకు చేరువ అవుతున్నట్లు చెబుతోంది. రాబోయే రోజుల్లో ప్రముఖ సంస్థలన్నీ యూట్యూబ్ ద్వారా ప్రమోషన్ పొందేందుకు పెద్ద మొత్తంలో ఖర్చు చేయబోతున్నాయి. కాబట్టి మీ ఛానల్ పేరు పొందితే స్పాన్సర్‌షిప్స్ ద్వారా డబ్బు సంపాదించుకోవచ్చు. అయితే స్పాన్సర్‌షిప్స్ వీడియోల వల్ల ఛానల్స్ విశ్వసనీయత దెబ్బతింటున్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. యూజర్లు సదరు ఛానెల్స్‌కు దూరమయ్యే అవకాశం ఉంటుంది.







## ఈస్ట్ కోస్ట్ రైల్వే-21

**ఒడిశా** (భువనేశ్వర్) ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న ఈస్ట్ కోస్ట్ రైల్వేలో స్పోర్ట్స్ కోటా ద్వారా రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ (ఆర్ఆర్‌సీ) 21 పోస్టుల భర్తీకి పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **క్రీడల వారీ ఖాళీలు:** అథ్లెటిక్స్-1, ఆక్వాటిక్స్-2, బాక్సింగ్-1, కబడ్డీ-1, బ్యాడ్మింటన్-2, క్రికెట్-2, హాకీ-2, కబడ్డీ (ఉమెన్)-2, వాలీ బాల్ (మెన్)-2, వాలీ బాల్ (ఉమెన్)-2, వెయిట్ లిఫ్టింగ్ (మెన్)-2, వెయిట్ లిఫ్టింగ్ (ఉమెన్)-2.
- **అర్హత:** పోస్టులను బట్టి ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణత, సంబంధిత క్రీడలో అంతర్జాతీయ/ జాతీయ/ రాష్ట్ర స్థాయిలో ప్రాతినిధ్యం ఉండాలి.
- **ఎంపిక:** స్పోర్ట్స్ ట్రయల్, క్రీడా విజయాల మదింపు, విద్యార్హతల ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500(ఎస్సీ,ఎస్టీ, పీడబ్ల్యూడీ, ఉమెన్, ఎక్స్-సర్వీస్‌మెన్లకు రూ.250).
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 3, 2020.
- **వెబ్‌సైట్:** https://rrcbbs.org.in

## హెచ్ఐఎల్-6

**న్యూఢిల్లీ** ప్రధాన కేంద్రంగా ఉన్న హిందుస్థాన్ ఇన్‌సెక్టిసైడ్స్ లిమిటెడ్ (హెచ్ఐఎల్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 6 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ఎలక్ట్రికల్ ఇంజనీర్-1, ఇంజనీర్ (ఐటీ)-1, హిందీ ఆఫీసర్-1, ఆఫీసర్ (కమర్షియల్)-1, ఆఫీసర్(అకౌంట్స్)-2.
- **అర్హత:** పోస్టులను బట్టి డిప్లొమా (ఇంజనీరింగ్), ఇంజనీరింగ్ డిగ్రీ, సీఏ/ ఐసీడబ్ల్యూఏ, సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఎంపిక:** స్క్రీనింగ్, రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ (డిసెంబర్ 7-13)లో ప్రకటన వెలువడిన తేదీ నుంచి 21 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
- **వెబ్‌సైట్:** http://hil.gov.in

## ఎన్‌సీఆర్‌టీసీ-40

**ఢిల్లీ**లోని నేషనల్ క్యాపిటల్ రీజియన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎన్‌సీఆర్‌టీసీ)..40 జూనియర్ ఇంజనీర్ (సివిల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** ఇంజనీరింగ్ డిప్లొమా (సివిల్)తో పాటు అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ, ఫిజికల్ ఫిట్‌నెస్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **వయసు:** 30 ఏళ్లకు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 21, 2019.
- **వెబ్‌సైట్:** www.ncrtc.in

## కొచ్చిన్ షిప్‌యార్డ్-31

**కొచ్చి**లోని షిప్‌యార్డ్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 31 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **షిప్ డ్రాఫ్ట్స్‌మెన్ ట్రైనీ:** 29
  - **విభాగాలు:** మెకానికల్-11, ఎలక్ట్రికల్-18.
  - **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
  - **వయసు:** 2019, డిసెంబర్ 20 నాటికి 25 ఏళ్లు మించకూడదు.
- **షిప్ డిజైన్ అసిస్టెంట్స్(ఇన్‌స్ట్రుమెంటేషన్):** 2
  - **అర్హత:** సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
  - **వయసు:** 2019, డిసెంబర్ 20 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** ఆబ్జెక్టివ్ టైప్ ఆన్‌లైన్ టెస్ట్, ప్రాక్టికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.200.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 20, 2019.
- **వెబ్‌సైట్:** https://cochinshipyard.com

## సాయ్-130

**భారత** ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ.. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) ఒప్పంద ప్రాతిపదికన 130 యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** పోస్టులను బట్టి డిగ్రీ, సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట అనుభవం ఉండాలి.
- **వయసు:** 32 ఏళ్లకు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 20, 2019.
- **వెబ్‌సైట్:** https://sportsauthorityofindia.nic.in

## ఐడబ్ల్యూఎస్‌టీ-16

**బెంగళూరు**లోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐడబ్ల్యూఎస్‌టీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 16 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** టెక్నికల్ అసిస్టెంట్-1, లోయర్ డివిజన్ క్లర్క్-1, టెక్నీషియన్-2, మల్టీటాస్కింగ్ స్టాఫ్-12.
- **అర్హత:** పోస్టులను బట్టి ఐటీఐ, ఇంటర్మీడియట్, బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **వయసు:** 2020, జనవరి 16 నాటికి 18-30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్ లిస్టింగ్, రాతపరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 16, 2020.
- **వెబ్‌సైట్:** http://iwst.icfre.gov.in

## జేఈటీ-2020



**ఫిల్మ్** అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీటీఐ)-పుణే, సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్ఆర్ఎఫ్‌టీఐ)-కోల్‌కతాలో ప్రవేశాలకు నిర్వహించే జాయింట్ ఎంట్రెన్స్ టెస్ట్ (జేఈటీ)-2020 నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **కోర్సులు:** ఫిల్మ్ కోర్సులు, టీవీ/ఈడీఎం.
- **విభాగాలు:** స్క్రీన్ యాక్టింగ్, డైరెక్షన్ అండ్ స్క్రీన్‌ప్లే రైటింగ్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, సౌండ్ రికార్డింగ్ అండ్ డిజైన్, యానిమేషన్ సినిమా తదితర విభాగాలున్నాయి.
- **అర్హత:** కోర్సును బట్టి ఏదైనా డిగ్రీ, డిగ్రీ (అప్లయిడ్ ఆర్ట్స్, ఆర్కిటెక్చర్, పెయింటింగ్, స్కల్పచర్) ఉత్తీర్ణత.
- **ఎంపిక:** ప్రవేశ పరీక్ష, షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్‌ల ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ కేటగిరీ అభ్యర్థులకు రూ.4000; ఎస్సీ,ఎస్టీ,పీడబ్ల్యూడీలకు రూ.1250.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 24, 2020.
- **ప్రవేశ పరీక్షతేదీ:** 2020, ఫిబ్రవరి 15, 16.
- **వెబ్‌సైట్:** https://applyadmission.net

## ఎడ్యున్యూస్

### ఛండీగఢ్ యూనివర్సిటీకి ఏ+ గ్రేడ్

**ఛండీగఢ్** యూనివర్సిటీకి తొలి రౌండ్‌లోనే ప్రతిష్టాత్మక నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్(న్యాక్) ఏ+ గ్రేడ్ ఇచ్చింది. న్యాక్ కొలమానం ప్రకారం-నాలుగు పాయింట్లకు గాను 3.28 పాయింట్లతో ఈ యూనివర్సిటీ ఈ హోదా సొంతం చేసుకుంది. 2012లో ఏర్పాటై దేశంలోనే అతి తక్కువ సమయంలో ఏ+ గ్రేడ్ హోదా దక్కించుకున్న తొలి వర్సిటీ ఇది. అంతే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు వర్సిటీల్లో ఈ ఘనత దక్కించుకున్న తొలి వర్సిటీ కూడా ఇదేనని యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి.

## ప్రవేశాలు

### ఎన్ఐఏఎంలో ప్రవేశాలు

**భారత** ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన జయపురలోని చౌదరి చరణ్ సింగ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ మార్కెటింగ్ (ఎన్ఐఏఎం) 2020-22కి గాను పీజీడీఎం కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సు:** పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీడీఎం) (అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్-ఏబీఎం)-2020.
- **కాల వ్యవధి:** రెండేళ్లు.
- **అర్హత:** బ్యాచిలర్స్ డిగ్రీ (అగ్రికల్చర్) ఉత్తీర్ణత, క్యాట్ 2019/సీమ్యాట్ 2020 వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.
- **ఎంపిక:** క్యాట్ 2019/సీమ్యాట్ 2020 స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.1200.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 29, 2020.
- **వెబ్‌సైట్:** www.ccsniam.gov.in

### నార్మ్‌లో ప్రవేశాలు

**హైదరాబాద్**లోని ఐకార్-నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్)-2020కి గాను పీజీడీ-టీఎంఏ 2020 ప్రోగ్రాములో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సును దూర విద్య విధానంలో అభ్యసించవచ్చు.

- **పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఇన్ అగ్రికల్చర్ (పీజీడీ-టీఎంఏ 2020).**
- **కాల వ్యవధి:** ఏడాది.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత. లేదా సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారికి రెండేళ్ల పని అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.300.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 31, 2020.
- **వెబ్‌సైట్:** https://naarm.org.in


సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్లో..
డీఎస్సీ స్టడీ మెటీరియల్, బిట్‌బ్యాంక్, మోడల్ పేపర్స్, ప్రీవియస్ పేపర్స్, గైడెన్స్
ఎస్ఐ, కానిస్టేబుల్ స్టడీ మెటీరియల్, మోడల్ పేపర్స్, ప్రీవియస్ పేపర్స్, వీడియో గైడెన్స్
పదో తరగతి స్టడీ మెటీరియల్, ప్రీవియస్ పేపర్స్, మోడల్‌పేపర్స్, సిలబస్, గైడెన్స్
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

సాక్షి స్పోర్ట్స్
బుధవారం
11-12-2019

**1** ముంబైలోని వాంఖెడే స్టేడియంలో భారత్ ఇప్పటివరకు మూడు టి20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో ఒక మ్యాచ్‌లో గెలిచి (శ్రీలంకపై 5 వికెట్లతో; డిసెంబర్ 24న, 2017)... రెండింటిలో (ఇంగ్లండ్ చేతిలో 6 వికెట్లతో; డిసెంబర్ 22న, 2012... విండీస్ చేతిలో 7 వికెట్లతో; మార్చి 31న, 2016) ఓడిపోయింది. వాంఖెడేలో జరిగిన ఈ మూడు మ్యాచ్‌ల్లోనూ ఛేజింగ్ చేసిన జట్టే గెలుపొందడం విశేషం.


కెప్టెన్ కోహ్లి

# పట్టాలి... క్యాచుల్ని, సిరీస్‌ని!

**కీలక పోరుకు కోహ్లి సేన • సమరోత్సాహంతో పొలార్డ్ బృందం**

**నేడే చివరి టి20 మ్యాచ్ • రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం**


పొలార్డ్

**సిరీస్ సొంతం చేసుకోవడానికి భారత్, వెస్టిండీస్ జట్లు ఆఖరి సమరానికి సిద్ధమయ్యాయి. నిలకడలేని బ్యాటింగ్, ఫీల్డర్ల వైఫల్యం టీమిండియాను ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా... ఐపీఎల్ అనుభవంతో నిర్ణాయక మ్యాచ్ ఫలితాన్ని శాసించాలని పొలార్డ్ బృందం పట్టుదలతో ఉంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో విఫలమైన రోహిత్ శర్మ సొంత మైదానంలో 'హిట్' కావాలని, జట్టుకు సిరీస్ అందించాలని ఉత్సాహంతో ఉన్నాడు.**

**ముంబై:** భారత్, వెస్టిండీస్‌ల మధ్య 'పొట్టి'పోరు ఆఖరి అంకానికి చేరింది. కోహ్లి సేన లోపాలను సరిదిద్దుకొని సమరానికి సన్నద్ధం కాగా... వాంఖెడే స్టేడియం పొలార్డ్‌ను ఊరిస్తోంది. ఐపీఎల్‌తో సొంత మైదానమైన చోట మ్యాచ్‌ను, సిరీస్‌ను చేజిక్కించుకోవాలని విండీస్ కెప్టెన్ పట్టుదలతో ఉన్నాడు. పూర్తిగా యువకులతో కూడిన వెస్టిండీస్ గత మ్యాచ్‌లో గెలిచి భారత్‌కు సవాల్ విసిరింది. టి20ల్లో రెండుసార్లు ప్రపంచ చాంపియన్ అయిన విండీస్‌తో ఈ పోరులో భారత్ ఆదమరిస్తే... మూల్యంగా మ్యాచ్‌నే కాదు, సిరీస్‌నే చెల్లించుకోవాల్సి వస్తుంది. కాబట్టి అనుభవజ్ఞులు, కుర్రాళ్ల కలయికతో ఉన్న టీమిండియా సత్తా చాటాల్సిన సమయమిదే. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇరు జట్లు చెరో మ్యాచ్‌లో గెలిచి 1–1తో సమంగా ఉన్న నేపథ్యంలో నేడు జరిగే చివరిదైన మూడో టి20 మ్యాచ్ నిర్ణాయకం కానుంది.

**రోహిత్‌పై ఆశలు...**

తన సొంతగడ్డపై రోహిత్ శర్మ మెరుపులు మెరిపిస్తే భారత్ విజయం సులువవుతుంది. గత రెండు మ్యాచ్‌ల్లో అతను నిరాశపరిచాడు. 8, 15 పరుగులే చేసిన 'హిట్‌మ్యాచ్' ఈ పోరులో బ్యాట్ ఝుళిపిస్తే పరుగుల వరద ఖాయం. తొలి మ్యాచ్‌లో కోహ్లితో పాటు చెలరేగిన రాహుల్ ఈ మ్యాచ్‌లో తన ప్రభావం చూపేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఛేజింగ్‌లో ఓపెనర్లిద్దరు శుభారంభమిస్తే కోహ్లి సేన ఎంతటి లక్ష్యాన్నైనా ఛేదించగలుగుతుంది. సిరీస్‌ను తేల్చే కీలకమైన ఈ మ్యాచ్‌కు తుదిజట్టులో మార్పులు చేయకపోవచ్చు. పైగా కెప్టెన్ కోహ్లి... వికెట్ కీపర్ రిషభ్ పంత్‌పై నమ్మకముంచడంతో సంజూ సామ్సన్‌కు ఈ సిరీస్‌లోనూ తుది జట్టులో ఆడే చాన్స్ లేకపోయింది. బంగ్లాదేశ్‌తో కూడా అతన్ని ఒక్క మ్యాచ్‌లోనూ ఆడించలేదు.

> మేం ఎప్పుడో జరిగే పొట్టి ప్రపంచకప్‌పై ఆలోచించడం లేదు. ఈ మ్యాచ్‌తో సిరీస్ గెలవడంపైనే దృష్టి పెట్టాం. ఇప్పుడైతే మా లోపాలను సవరించుకునే పనిలో ఉన్నాం. లక్ష్యాన్ని ఛేదించడమే భారత్‌కు సులువు. ఈ సిరీస్‌లో కూడా అదే జరిగింది. ప్రస్తుతం పటిష్టమైన జట్టును ఎదుర్కొంటున్నాం. ఆ తర్వాత శ్రీలంకతో ఆడాలి. అనంతరం న్యూజిలాండ్‌కు వెళ్లాలి. పది నెలల తర్వాత జరిగే మెగా ఈవెంట్‌కు ముందు మేం ఎన్నో టి20లు ఆడాల్సి ఉంటుంది.
>
> -భారత ఓపెనర్ రోహిత్


రోహిత్ కోచ్ రవిశాస్త్రి

టాపార్డర్‌లో ప్రమోషన్ పొందిన శివమ్ దూబే ఈ మ్యాచ్‌లోనూ మెరుపులు మెరిపించేందుకు తహతహలాడుతున్నాడు. మిడిలార్డర్‌లో శ్రేయస్ అయ్యర్, పంత్‌లు కూడా పరుగుల ప్రవాహానికి జతకలిస్తే భారత్ భారీ స్కోరు చేయగలుగుతుంది. ముఖ్యంగా స్లాగ్ ఓవర్లపై భారత బ్యాట్స్‌మెన్ దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

**క్యాచ్‌లు పడితేనే...**

ఈ సిరీస్‌లో భారత ఫీల్డింగ్ వైఫల్యం జట్టు మేనేజ్‌మెంట్‌ను కలవరపరుస్తోంది. రెండు మ్యాచ్‌ల్లోనూ విలువైన క్యాచ్‌లు జారవిడువడం సమస్యగా మారింది. తొలి టి20లో ఈ వైఫల్యాన్ని అనుకూలంగా మలుచుకున్న విండీస్ 200 పైచిలుకు పరుగులు చేసింది. కోహ్లి ఆఖరిదాకా చెలరేగడంతో గెలుపు దక్కింది. కానీ రెండో వన్డేలో క్యాచ్‌లు చేజార్చి భారత్ మూల్యం చెల్లించుకుంది. లేదంటే ఈపాటికే సిరీస్‌ను గెలిచేది. నెట్స్‌లోనూ భారత్ ప్రధానంగా ఈ లోపాలపైనే కసరత్తు చేసింది. మరోవైపు బౌలింగ్ విభాగం కూడా మెరుగుపడాలి. పునరాగమనం చేసిన భువనేశ్వర్ పరుగుల్ని కట్టడి చేయలేకపోయాడు. బంగ్లాదేశ్‌పై నిప్పులు చెరిగిన దీపక్ చాహర్ ఈ సిరీస్‌లో లయ కోల్పోయాడు. స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ పేలవ ప్రదర్శన కనబరుస్తున్నాడు. వీళ్లంతా రాణిస్తేనే కీలకమైన ఆఖరి మ్యాచ్‌లో భారత్ విజయఢంకా మోగిస్తుంది.

> క్యాచ్‌లు చేజార్చుతుంటే మ్యాచ్‌ల్ని నెగ్గలేం. ఫీల్డర్లు ఈ విషయాన్ని బాగా గుర్తుంచుకోవాలి. ఫ్లడ్‌లైట్ల వల్ల కనబడలేదనో, మరే ఇతర కారణాల్ని సాకులుగా చెప్పడానికి వీల్లేదు. అవసరమైతే ప్రాక్టీస్‌లో కఠోరంగా శ్రమించైనా పట్టు సాధించాలి. కెప్టెన్ పొలార్డ్‌కు ఈ వేదికపై విశేషంగా ఆడిన అనుభవముంది. ఇది మా జట్టుకు పనికొస్తుంది. ఇక్కడ 200 చేసినా ఛేదించవచ్చు. మొదట బ్యాటింగ్ కంటే ఛేజింగే సులువు.
>
> -వెస్టిండీస్ కోచ్ ఫిల్ సిమన్స్

**పొలార్డ్‌కు కలిసొచ్చే ముంబై...**

ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ ఆల్‌రౌండర్‌గా వాంఖెడేలో విండీస్ సారథి పొలార్డ్‌కు ఎంతో అనుభవముంది. పిచ్, గ్రౌండ్‌పై అతనికి రోహిత్ శర్మకు ఉన్నంత అవగాహన ఉండటం ఈ మ్యాచ్‌లో విండీస్‌కు కలిసిరావొచ్చు. టాపార్డర్‌లో సిమన్స్, లూయిస్ ఫామ్‌లో ఉన్నారు. హిట్టర్లు హెట్‌మైర్, నికోలస్ పూరన్ అందుబాటులో ఉండటం కరీబియన్ బ్యాటింగ్ ఆర్డర్‌ను పటిష్టం చేసింది. జట్టు మొత్తం యువకులే. పొట్టి ఫార్మాట్‌కు తగిన దూకుడు కుర్రాళ్లలోనే ఉంటుంది. బ్రాండన్ కింగ్ భారీషాట్లు ఆడగల సమర్థుడు. గత మ్యాచ్‌లో బౌలర్లు విలియమ్స్, కాట్రెల్ భారత జోరుకు కళ్లెం వేశారు. ముఖ్యంగా ఆఖరి ఓవర్లలో అద్భుతంగా కట్టడి చేశారు. అనుభవజ్ఞుడైన పేసర్ హోల్డర్, లెగ్ స్పిన్నర్ హేడెన్ వాల్ష్... టీమిండియాపై తప్పకుండా ప్రభావం చూపే అవకాశం ఉంది.

**పిచ్, వాతావరణం**

వాంఖెడేలో లక్ష్యఛేదన సులువు. టాస్ నెగ్గిన జట్టు ఫీల్డింగే ఎంచుకుంటుంది. మంచుకురిసే రాత్రి వేళ బౌలర్లకు పట్టుదొరకడం కష్టం కావొచ్చు. మ్యాచ్‌కు వర్షం ముప్పు లేదు.

**జట్లు (అంచనా)**

**భారత్:** కోహ్లి (కెప్టెన్), రోహిత్ శర్మ, రాహుల్, పంత్, శ్రేయస్, శివమ్ దూబే, జడేజా, వాషింగ్టన్ సుందర్, దీపక్ చాహర్, భువనేశ్వర్, చహల్.

**వెస్టిండీస్:** కీరన్ పొలార్డ్ (కెప్టెన్), లెండిల్ సిమన్స్, లూయిస్, కింగ్, హెట్‌మైర్, నికోలస్ పూరన్, జేసన్ హోల్డర్, పియరీ, విలియమ్స్, కాట్రెల్, హేడెన్ వాల్ష్.


గతేడాది వరల్డ్ టూర్ ఫైనల్స్ ట్రోఫీతో సింధు (ఫైల్)

## సింధు సత్తాకు పరీక్ష

• నేటి నుంచి వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీ

**గ్వాంగ్‌జౌ (చైనా):** గత ఆగస్టులో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ గెలిచాక... భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఆడిన ఆరు టోర్నీల్లో కనీసం క్వార్టర్ ఫైనల్ దశ దాటలేకపోయింది. ఈ నేపథ్యంలో బ్యాడ్మింటన్ సీజన్ ముగింపు టోర్నీ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో టైటిల్ నిలబెట్టుకొని ఈ ఏడాదిని ఘనంగా ముగించాలనే లక్ష్యంతో సింధు ఉంది. వాస్తవానికి వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీకి సూపర్ టోర్నీల ర్యాంకింగ్స్‌లో టాప్–8లో ఉన్నవారికి మాత్రమే అవకాశం లభిస్తుంది. టాప్–8లో సింధు లేకపోయినా ప్రపంచ చాంపియన్ హోదాలో ఆమెకు ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో ఆడేందుకు అవకాశమిచ్చారు. వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీలో సింధుకు మెరుగైన రికార్డు ఉంది. 2017లో ఆమె రన్నరప్‌గా నిలువగా... 2018లో విజేతగా అవతరించింది. ఈసారి సింధుకు క్లిష్టమైన 'డ్రా' ఎదురైంది. మహిళల సింగిల్స్ గ్రూప్ 'ఎ'లో సింధుతోపాటు ప్రపంచ నాలుగో ర్యాంకర్ అకానె యామగుచి (జపాన్), రెండో ర్యాంకర్ చెన్ యుఫె (చైనా), ఏడో ర్యాంకర్ హి బింగ్‌జియావో (చైనా) ఉన్నారు. నేడు జరిగే తొలి లీగ్ మ్యాచ్‌లో యామగుచితో సింధు ఆడుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 10–6తో ఆధిక్యంలో ఉంది. గ్రూప్ 'బి'లో నంబర్‌వన్ తై జు యింగ్ (చైనీస్ తైపీ), ప్రపంచ మాజీ చాంపియన్స్ రచనోక్ (థాయ్‌లాండ్), ఒకుహారా (జపాన్), బుసానన్ (థాయ్‌లాండ్) ఉన్నారు. లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాక గ్రూప్‌ల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తారు. 14న సెమీ ఫైనల్స్, 15న ఫైనల్స్ జరుగుతాయి.

## భారత్ 'టాప్' లేపింది

**దక్షిణాసియా క్రీడల్లో తమ అత్యుత్తమ ప్రదర్శన • రికార్డుస్థాయిలో 312 పతకాలు సొంతం**

**కఠ్మాండు (నేపాల్):** మూడున్నర దశాబ్దాల చరిత్ర కలిగిన దక్షిణాసియా క్రీడల్లో భారత్ తమ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. నేపాల్‌లో మంగళవారం ముగిసిన ఈ క్రీడల్లో భారత్ అత్యధికంగా 312 పతకాలు సాధించి 'టాప్'లో నిలిచింది. ఇందులో 174 స్వర్ణాలు, 93 రజతాలు, 45 కాంస్యాలు ఉన్నాయి. 2016లో స్వదేశంలో జరిగిన దక్షిణాసియా క్రీడల్లో భారత్ అత్యధికంగా 309 పతకాలు సాధించింది. ఈసారి ఆ రికార్డును భారత్ బృందం సవరించింది. 1984లో దక్షిణాసియా క్రీడలు మొదలుకాగా... ఇప్పటి వరకు జరిగిన అన్ని క్రీడల్లోనూ పతకాల పట్టికలో భారతే అగ్రస్థానంలో నిలిచింది.

**పతకాల పట్టిక**

| దేశం | స్వర్ణం | రజతం | కాంస్యం | మొత్తం |
|---|---|---|---|---|
| భారత్ | 174 | 93 | 45 | 312 |
| నేపాల్ | 51 | 60 | 95 | 206 |
| శ్రీలంక | 40 | 83 | 128 | 251 |
| పాకిస్తాన్ | 31 | 41 | 59 | 131 |
| బంగ్లాదేశ్ | 19 | 32 | 87 | 138 |
| మాల్దీవులు | 1 | 0 | 4 | 5 |
| భూటాన్ | 0 | 7 | 13 | 20 |

నోట్: స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్‌ను నిర్ణయిస్తారు.


బాక్సర్ పింకీ రాణి


వికాస్

ఈ క్రీడల ఆఖరి రోజు మంగళవారం భారత్ 15 స్వర్ణాలు, రెండు రజతాలు, ఒక కాంస్యంతో కలిపి మొత్తం 18 పతకాలు సాధించింది. బాస్కెట్‌బాల్ ఫైనల్స్‌లో భారత పురుషుల జట్టు 101–62తో శ్రీలంక జట్టుపై, భారత మహిళల జట్టు 127–46తో నేపాల్‌పై గెలిచి స్వర్ణ పతకాలు నెగ్గాయి. స్క్వాష్ టీమ్ ఈవెంట్స్‌లో భారత మహిళల జట్టు స్వర్ణం, పురుషుల జట్టు రజతం సాధించాయి. బాక్సింగ్‌లో ఆరు పసిడి పతకాలు లభించాయి. పురుషుల విభాగంలో వికాస్ కృషన్ (69 కేజీలు), స్పర్శ్ కుమార్ (52 కేజీలు), నరేందర్ (ప్లస్ 91 కేజీలు)... మహిళల విభాగంలో పింకీ రాణి (51 కేజీలు), సోనియా లాథెర్ (57 కేజీలు), మంజు బొంబారియా (64 కేజీలు) విజేతలుగా నిలిచారు.



## కోహ్లి ట్వీట్ రికార్డు

**న్యూఢిల్లీ:** భారత కెప్టెన్ విరాట్ కోహ్లి బ్యాట్‌తో మైదానంలో ఎన్నో రికార్డులు బద్దలు కొట్టాడు. తాజాగా అతను బ్యాట్‌తో కాకుండా ట్వీట్‌తోనూ రికార్డులకెక్కాడు. అది కూడా తన స్ఫూర్తి ప్రదాత, మాజీ కెప్టెన్ ధోనికి చెప్పిన పుట్టిన రోజు శుభాకాంక్షల ద్వారా కావడం మరో విశేషం. ఈ ఏడాది తన అభిమాన కెప్టెన్ జన్మదినోత్సవం సందర్భంగా కోహ్లి 'హ్యాపీ బర్త్ డే మహి భాయ్. చాలా కొద్దిమందికే నమ్మకానికి అర్థం తెలుసు. మీ నుంచి ఆ నమ్మకాన్ని పొందిన నేను అదృష్టవంతుణ్ని. మీ సహచర్యంలో నేను ఎన్నో ఏళ్లు నడిచాను. నా వరకైతే మీరే నాకు పెద్దన్న. నేనెపుడు చెప్పినట్లుగా ఎప్పటికీ నీవే నా సారథివి' అని ట్వీట్ చేశాడు. ఇది సోషల్ మీడియాలో ప్రత్యేకించి స్పోర్ట్స్ విభాగంలో అత్యధికంగా రీట్వీట్ (45,500 సార్లు) అయిన పోస్ట్‌గా రికార్డుకెక్కిందని ట్విట్టర్ మంగళవారం వెల్లడించింది.

## ధావన్ స్థానంలో మయాంక్!



**న్యూఢిల్లీ:** మోకాలి గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో ఓపెనర్ శిఖర్ ధావన్ వెస్టిండీస్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కూ దూరమయ్యాడు. ధావన్ స్థానంలో మయాంక్ అగర్వాల్ జట్టులోకి వచ్చే అవకాశముంది. మూడు వన్డేల సిరీస్‌లో తొలి వన్డే ఈనెల 15న చెన్నైలో... రెండో వన్డే 18న విశాఖపట్నంలో... మూడో వన్డే 22న కటక్‌లో జరుగుతాయి. 'ధావన్ కోలుకోకపోవడంతో... టీమ్ మేనేజ్‌మెంట్‌తో చర్చించి అతని స్థానంలో మయాంక్ పేరును సెలక్షన్ కమిటీ ప్రతిపాదించింది' అని బీసీసీఐ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

## జ్వాల కొత్త క్రీడా అకాడమీ


రాజీవ్ ప్రతాప్ జ్వాల సుశీల్ విజేందర్

**న్యూఢిల్లీ:** భారత బ్యాడ్మింటన్ డబుల్స్ క్రీడాకారిణి గుత్తా జ్వాల ఆధ్వర్యంలో కొత్త క్రీడా అకాడమీ ప్రారంభం కానుంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని సుజాత హైస్కూల్ ప్రాంగణంలో ఈ అకాడమీని నెలకొల్పారు. గుత్తా జ్వాల అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ అకాడమీలో 14 బ్యాడ్మింటన్ కోర్టులు, అత్యాధునిక జిమ్నాజియం ఉన్నాయి. ఈ అకాడమీలో బ్యాడ్మింటన్ తోపాటు క్రికెట్, స్విమ్మింగ్ క్రీడాంశాల్లోనూ శిక్షణ ఇస్తారు. అకాడమీకి సంబంధించిన లోగోను మంగళవారం న్యూఢిల్లీలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భారత స్టార్ రెజ్లర్, బీజింగ్, లండన్ ఒలింపిక్స్‌లో పతకాలు గెలిచిన సుశీల్ కుమార్... భారత ప్రొఫెషనల్ బాక్సర్ విజేందర్ సింగ్, పార్లమెంట్ సభ్యుడు రాజీవ్ ప్రతాప్ రూడీ పాల్గొన్నారు. 'భారత్ ఎంతో పెద్ద దేశం. కానీ మనకు బ్యాడ్మింటన్‌లో సైనా, సింధు మాత్రమే ఉన్నారు. ఈ సంఖ్య పెరగాలి. జ్వాల అకాడమీ ద్వారా చాంపియన్లను తయారు చేయాలని అనుకుంటున్నాను. నా అకాడమీకి మద్దతు ఇవ్వాలని కోరుతూ కేంద్ర క్రీడల మంత్రి కిరణ్ రిజిజును కలిశాను. ఆయన నుంచి సానుకూల స్పందన వచ్చింది. అకాడమీ నిర్మాణం కోసం ఎవరి సహాయం తీసుకోలేదు. సొంతంగా ఏర్పాటు చేశాను. నా అకాడమీలో కనీసం 10 మంది కోచ్‌లు ఉంటారు. అందులో ఇద్దరు విదేశీ కోచ్‌లు' అని జ్వాల వివరించింది. వచ్చే నెలలో అధికారికంగా ప్రారంభమయ్యే ఈ అకాడమీలో చేరాలనుకునే వారికి రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. వివరాలకు 8826984583, 9811325251 ఫోన్ నంబర్లలో సంప్రదించాలి.


కరుణరత్నే అజహర్ అలీ

## పాక్‌లో పదేళ్ల తర్వాత...

**నేటి నుంచి శ్రీలంకతో టెస్టు సిరీస్**

**రావల్పిండి:** పదేళ్ల తర్వాత సొంతగడ్డపై అంతర్జాతీయ టెస్టు జరగనుండటంతో ఆటగాళ్లంతా భావోద్వేగంతో ఉన్నారని పాకిస్తాన్ కెప్టెన్ అజహర్ అలీ అన్నాడు. రెండు టెస్టుల సిరీస్ ఆడేందుకు శ్రీలంక జట్టు పాక్‌కు వచ్చింది. ఇరుజట్ల మధ్య బుధవారం నుంచి ఇక్కడ తొలి టెస్టు జరుగుతుంది. సరిగ్గా పదేళ్ల క్రితం 2009లో శ్రీలంక జట్టుపై లాహోర్‌లో ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. అనంతరం మళ్లీ ఏ జట్టూ పాక్‌లో టెస్టులు ఆడేందుకు రాకపోవడంతో తటస్థ వేదికలపై పాక్ మ్యాచ్‌ల్ని నిర్వహించారు. మళ్లీ పాక్ గడ్డపై టెస్టులు జరగడం ఆనందంగా ఉందని, ఇకపై క్రమం తప్పకుండా తమ దేశంలో టెస్టులు జరుగుతాయని ఆశిస్తున్నట్లు పాక్ కెప్టెన్ అజహర్ అలీ చెప్పాడు. మరోవైపు కొత్త కోచ్ మికీ ఆర్థర్ రాకతో శ్రీలంక జట్టు ఆటతీరులో మార్పు ఉంటుందని ఆశిస్తున్నట్లు శ్రీలంక కెప్టెన్ కరుణరత్నే అన్నాడు. గతంలో ఆర్థర్ పాక్ జట్టుకు కోచ్‌గా పని చేశారు.

## విదర్భ 268/4

**సతీశ్ సెంచరీ • ఆంధ్రతో రంజీ మ్యాచ్**

**మూలపాడు (విజయవాడ):** రంజీ ట్రోఫీలో భాగంగా ఆంధ్రతో జరుగుతున్న మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ విదర్భ భారీ ఆధిక్యంపై కన్నేసింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి విదర్భ 97 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 268 పరుగులు చేసింది. 57 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని సంపాదించింది. ఓవర్‌నైట్ స్కోరు 26/0తో రెండో రోజు ఆట మొదలు పెట్టిన విదర్భ బ్యాట్స్‌మెన్... ఆంధ్ర బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్నారు. గణేశ్ సతీశ్ (113 బ్యాటింగ్; 16 ఫోర్లు) అజేయ శతకంతో అలరించాడు. అతనికి మోహిత్ కాలే (82; 9 ఫోర్లు) చక్కని సహకారం అందించాడు. రంజీల్లో 150వ మ్యాచ్ ఆడుతున్న వసీం జాఫర్ (0) డకౌట్ అయ్యాడు. ప్రస్తుతం గణేశ్‌కు తోడుగా అక్షయ్ (9 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఆంధ్ర బౌలర్లలో స్టీఫెన్ (3/76) రాణించాడు.


సతీశ్

## స్టాక్‌ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 248 ▼ | 81 ▼ |
| 40,240 | 11,857 |

మరిన్ని వార్తలు, స్టాక్‌ అప్‌డేట్స్‌ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (రాత్రి రెండు 11.30గంటలకు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్‌ | 8,630 | ▲ | 5 |
| డోజోన్స్‌ | 27,895 | ▼ | 15 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,214 | ▼ | 20 |
| డాక్స్‌ | 13,071 | ▼ | 35 |
| షాంఘై | 2,917 | ▲ | 3 |
| నికాయ్‌ | 23,410 | ▼ | 21 |

● అమెరికా ● బ్రిటన్‌ ● జర్మనీ ● చైనా ● జపాన్‌

## ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

| | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్‌ డాలర్‌ | ఎస్‌బీఐ | 70.25 | 71.89 |
| బ్రిటన్‌ పౌండ్‌ | ఎస్‌బీఐ | 91.85 | 95.07 |
| యూరో | ఎస్‌బీఐ | 77.20 | 80.12 |
| జపాన్‌ ఎన్‌ (100) | ఎస్‌బీఐ | 64.21 | 66.63 |
| ఆస్ట్రేలియా డాలర్‌ | ఎస్‌బీఐ | 47.52 | 49.68 |
| సింగపూర్‌ డాలర్‌ | ఎస్‌బీఐ | 51.37 | 53.15 |
| సౌదీ రియాల్‌ | థామస్‌కుక్‌ | 18.12 | 19.73 |
| యూఏఈ దిర్హామ్‌ | థామస్‌కుక్‌ | 18.85 | 19.85 |
| చైనా యువాన్‌ | థామస్‌కుక్‌ | 9.45 | 10.86 |

# గోల్డ్‌.. క్రూడ్‌.. రయ్‌ రయ్‌!

**గోల్డ్‌మన్‌ శాక్స్‌ నివేదిక ● 2020 అంచనాల పెంపు**

**న్యూఢిల్లీ:** ఆర్థిక వ్యవస్థలో కీలకమైన రెండు కమోడిటీలు బంగారం, క్రూడ్‌ రెండూ 2020లో అప్‌ట్రెండ్‌లోనే ఉంటాయని అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్‌ బ్యాంకింగ్‌ దిగ్గజం... గోల్డ్‌మన్‌ శాక్స్‌ తాజాగా ఒక నివేదికలో అంచనా వేసింది. ఈ సంస్థ ఇంకా ఏమని చెబుతోందంటే...

''అంతర్జాతీయ ఫ్యూచర్స్‌ మార్కెట్‌– న్యూయార్క్‌ మర్కంటైల్‌ ఎక్స్ఛేంజ్‌ (నైమెక్స్‌)లో పసిడి ఔన్స్‌ (31.1గ్రా) ధర 2020లో సగటున 1,600 డాలర్లుగా ఉంటుంది. 2021లో కూడా ఇదే పరిస్థితి కొనసాగవచ్చు. అంతర్జాతీయంగా ఆర్థిక మాంద్యం భయాలు, రాజకీయ అనిశ్చితి వల్ల ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులకు పసిడిని ఎంచుకునే అవకాశాలున్నాయి. 2019లో ఇప్పటివరకూ పసిడి 14 శాతం పెరిగింది. ఒకే ఏడాది ఈ స్థాయిలో పసిడి ధర బలపడ్డం 2010 తరువాత ఇదే తొలిసారి. అంతర్జాతీయ మార్కెట్‌లో గడిచిన 52 వారాల్లో పసిడి ఔన్స్‌ (31.1గ్రా) ధర 1,248 డాలర్ల కనిష్ట స్థాయిని చూసింది. అమెరికా– చైనా వాణిజ్య యుద్ధం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై దీని ప్రభావం, ఉత్తరకొరియా, ఇరాన్‌ వంటి దేశాలకు సంబంధించి భౌగోళిక ఉద్రిక్తతలు వంటివి బంగారం ధరను ఒకదశలో 1,566 డాలర్లకూ చేర్చాయి. తర్వాత దాదాపు 100 డాలర్ల కరెక్షన్‌కు గురై... ప్రస్తుతం 1,470– 80 డాలర్ల శ్రేణిలో ట్రేడవుతోంది. అమెరికా– చైనా వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుతాయన్న ఆశలు, అమెరికా కార్మిక మార్కెట్‌ పటిష్టత ఈ కరెక్షన్‌కు ప్రధాన కారణాలు. ప్రస్తుతం ఈ ఆశారేఖల వల్ల పసిడి సమీప కాలంలో తగ్గితే తగ్గవచ్చు. దీర్ఘకాలంలో చూస్తే, ప్రపంచ వృద్ధి అంతంతమాత్రమే. ఉపాధి కల్పన రేటు కూడా బలహీనంగానే ఉంటుంది. దాంతో దీర్ఘకాలంలో పసిడి పరుగుకే అవకాశాలెక్కువ. ప్రధాన అభివృద్ధి చెందిన దేశాల్లో కుటుంబాల పొదుపులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పసిడి వంటి రక్షణాత్మక అసెట్స్‌లో పెట్టుబడులు పెరిగే అవకాశం ఉంది. 2019లో ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్‌ బ్యాంకులన్నీ కలిసి దాదాపు 750 టన్నుల పసిడిని కొనుగోలు చేయడం కూడా చెప్పుకోవాల్సిన ప్రధాన అంశం.



### ఉత్పత్తి కోతతో క్రూడ్‌ భగభగలు...

2020లో క్రూడ్‌ ధరల అంచనాలను కూడా పెంచుతున్నాం. వచ్చే ఏడాది తొలి త్రైమాసికం నుంచీ... ఉత్పత్తిలో కోత పెట్టాలని పెట్రోలియం ఎగుమతి దేశాల సంఘం (ఒపెక్‌), దాని మిత్ర దేశాలు ఒక అంగీకారానికి రావడం దీనికి ప్రధాన కారణం. దీనివల్ల చమురు నిల్వలు కొంత తగ్గే అవకాశం ఉంది. ఇది తొలి ఆరు నెలల్లో క్రూడ్‌ ధరల పెరుగుదలకు దారితీస్తుంది. 2020లో బ్రెంట్‌ ధర బేరల్‌కు సగటున 60 డాలర్లు ఉంటుందన్న తొలి అంచనాలను 63కు పెంచుతున్నాం. నైమెక్స్‌ లైట్‌ స్వీట్‌ ధరను కూడా 55.3 డాలర్ల నుంచి 58.5 డాలర్లకు పెంచుతున్నాం'' అని గోల్డ్‌మన్‌ శాక్స్‌ తెలిపింది.

### మరి రూపాయి పరిస్థితి?



అంతర్జాతీయంగా క్రూడ్‌ ధరలు పెరిగితే, అది డాలర్‌ మారకంలో రూపాయి విలువకు ప్రతికూలాంశమేనని నిపుణుల అభిప్రాయం. గత ఏడాది అక్టోబర్‌ 9న రూపాయి చరిత్రాత్మక కనిష్ట స్థాయి 74.39 వద్ద ముగిసింది. తర్వాత పలు సానుకూల అంశాలతో క్రమంగా కీలక నిరోధం 68.50 వద్దకు చేరింది. అయితే ఇక్కడ నుంచి ఏ దశలోనూ మరింత బలపడలేకపోయింది. మంగళవారం ఇంటర్‌బ్యాంక్‌ ఫారెక్స్‌ మార్కెట్‌లో 12 పైసలు బలపడి నెల గరిష్టం 70.92కు చేరింది.

### 2020 మధ్య నుంచి చల్లారవచ్చు: మోర్గాన్‌ స్టాన్లీ

ఇదిలావుంటే... వచ్చే ఏడాది తొలి త్రైమాసికం నుంచి ఉత్పత్తిలో కోత పెట్టాలన్న ఒపెక్‌, దాని మిత్రపక్షాల నిర్ణయం స్వల్పకాలికంగానే క్రూడ్‌ ధర పెరుగుదలకు దారితీయవచ్చని మరో దిగ్గజ సంస్థ– మోర్గాన్‌ స్టాన్లీ అభిప్రాయపడింది. 2020 మధ్యస్థం నుంచీ ధరలు తిరిగి తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. బ్రెంట్‌ క్రూడ్‌ 2020 మధ్య నుంచీ 60 డాలర్లుగానే కొనసాగే వీలుందని, దీనికి అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితే కారణమని అభిప్రాయపడింది. మొదటి త్రైమాసికం అంచనా మాత్రం 62.50 డాలర్లుగా పేర్కొంది.

## హ్యుందాయ్‌ కార్ల ధరలు పెంపు..!



**న్యూఢిల్లీ:** ప్రముఖ కార్ల తయారీ కంపెనీ హ్యుందాయ్‌ మోటార్స్‌ ఇండియా తన వాహన ధరలను పెంచనున్నట్లు ప్రకటించింది. వచ్చే ఏడాది ఆరంభం నుంచి ఈ పెంపు అమల్లోకి రానుందని తెలియజేసింది. పెరిగిన ఉత్పత్తి వ్యయాన్ని కస్టమర్లకు బదలాయించే క్రమంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. మోడల్‌ ఆధారంగా పెంపు ఉండనున్నట్లు చెప్పిన కంపెనీ.. ఎంత మేర ధరలు పెరగనున్నాయనేది వెల్లడించలేదు. మారుతీ, టాటా మోటార్స్‌తో పాటు ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్‌ కూడా వాహన ధరలను జనవరి 1 నుంచి పెంచనున్నట్లు ఇప్పటికే ప్రకటించాయి.

## మెట్జ్‌ నుంచి నూతన ఉపకరణాలు




**హైదరాబాద్‌, బిజినెస్‌ బ్యూరో:** ఎలక్ట్రానిక్స్‌ తయారీలో ఉన్న జర్మనీ బ్రాండ్‌ మెట్జ్‌ నూతన శ్రేణి ఉపకరణాలను మార్కెట్లోకి తీసుకురానుంది. ప్రస్తుతం ఈ బ్రాండ్‌ ఆన్‌లైన్‌లో టీవీలను విక్రయిస్తోంది. వచ్చే ఏడాది వాషింగ్‌ మెషీన్లను విడుదల చేయనున్నట్టు మెట్జ్‌ను ప్రమోట్‌ చేస్తున్న స్కైవర్త్‌ సంస్థ ఇండియా ఎండీ క్రైవర్‌ లూ మంగళవారమిక్కడ మీడియాకు తెలిపారు. రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, మొబైల్స్‌ వంటి ఇతర ఉత్పత్తులను దశల వారీగా ప్రవేశపెడతామని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన స్కైక్వాడ్‌ ఎలక్ట్రానిక్స్‌తో కలిసి శంషాబాద్‌ వద్ద నెలకొల్పుతున్న ప్లాంటులో వీటిని ఉత్పత్తి చేస్తామన్నారు. ఏటా 40 లక్షల టీవీల తయారీ సామర్థ్యంతో ఈ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కూకా బ్రాండ్‌ టీవీలను ఇప్పటికే భారత్‌లో అమ్ముతున్నామని, ఈ బ్రాండ్‌ నుంచి కూడా ఇతర అప్లయెన్సెస్‌ను పరిచయం చేస్తామని చెప్పారాయన. చైనాలో స్కైవర్త్‌ ఏటా 90 లక్షల టీవీలను విక్రయిస్తోందని కంపెనీ ఈ–కామర్స్‌ బిజినెస్‌ హెడ్‌ సుశోవిత్‌ రంజన్‌ వెల్లడించారు. చైనా టీవీల మార్కెట్లో స్కైవర్త్‌కు 22% వాటా ఉంది.

## ట్యాక్సీ సేవల్లోకి ఇ–యానా



ఇ–యానా వాహనాలతో జయేశ్‌, సులజ్జ, కంపెనీ ప్రతినిధులు

**హైదరాబాద్‌, బిజినెస్‌ బ్యూరో:** పునరుత్పాదక ఇంధన రంగంలో ఉన్న వీజీ అర్బెడో ఎనర్జీ.. ట్యాక్సీ సేవల్లోకి ఎంట్రీ ఇస్తోంది. ఇ–యానా పేరుతో తొలుత కరీంనగర్‌, వరంగల్‌లో ప్రవేశిస్తోంది. ఎలక్ట్రిక్‌ త్రీ వీలర్లు, టూ వీలర్లతో సేవలందించడం దీని ప్రత్యేకత. ఇ–యానా యాప్‌ను తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ జయేశ్‌ రంజన్‌, కైనెటిక్‌ గ్రీన్‌ ఫౌండర్‌ సులజ్జ ఫిరోదియా మోత్వానీ మంగళవారమిక్కడ ఆవిష్కరించారు. ప్రస్తుతం రెండు నగరాలకు కలిపి 50 ఆటోలు, 50 స్కూటర్లను కొనుగోలు చేశామని కంపెనీ డైరెక్టర్‌ సందీప్‌ వంగపల్లి తెలిపారు. డైరెక్టర్లు విజయ్‌ కుమార్‌, నవనీత్‌ రావు, శశికాంత్‌ రెడ్డితో కలిసి ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. '2020 మార్చినాటికి మరో 200 స్కూటర్లు, 200 ఆటోలు కొంటాం. ఆరు నెలల్లో రూ.50 కోట్ల నిధులు సమకూర్చుకుంటాం. ఇప్పటికే రూ.4.5 కోట్లు ఖర్చు చేశాం. దశలవారీగా ఖమ్మం, నిజామాబాద్‌, చెన్నై, భువనేశ్వర్‌లో అడుగు పెడతాం. కిలోమీటరుకు చార్జీ త్రీ వీలర్‌ అయితే రూ.10, టూ వీలర్‌కు రూ.6 ఉంటుంది' అని చెప్పారు.

## రేటు తగ్గింపు వరుసలో మరో మూడు బ్యాంకులు

**న్యూఢిల్లీ:** ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ బాటలోనే మరో మూడు బ్యాంకులు రుణ రేట్లను తగ్గించాయి. వివరాలివీ...

- యూనియన్‌ బ్యాంక్‌ (యూబీఐ) విషయంలో రేటు తగ్గింపు 5 నుంచి 10 బేసిస్‌ పాయింట్ల శ్రేణిలో ఉంది. బుధవారం నుంచీ తాజా రేటు అమల్లోకి వస్తుంది.



- మంగళవారం నుంచీ అమల్లోకి వచ్చే విధంగా.. యూకో బ్యాంక్‌ అన్ని రుణ కాలపరిమితులపై ఎంసీఎల్‌ఆర్‌ 10 బేసిస్‌ పాయింట్ల వరకూ తగ్గించింది.
- ఇక బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా(బీఓబీ) కూడా వివిధ కాలపరిమితి రుణ రేట్లను 20 బేసిస్‌ పాయింట్ల వరకూ తగ్గించింది. 12వ తేదీ నుంచీ తగ్గించిన రేట్లు అందుబాటులో ఉంటాయి.

## 'కార్వీ' ఉదంతంతో కన్సాలిడేషన్‌ వేగవంతం

- వచ్చే ఏడాది 13,400కు నిఫ్టీ
- కొటక్‌ సెక్యూరిటీస్‌ ఎస్‌వీపీ రష్మిక్‌ ఓఝూ



**హైదరాబాద్‌, బిజినెస్‌ బ్యూరో:** కార్వీ ఉదంతంతో బ్రోకింగ్‌ పరిశ్రమలో కన్సాలిడేషన్‌ మరింత వేగవంతమయ్యే అవకాశముందని కొటక్‌ సెక్యూరిటీస్‌ సీనియర్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ (ఫండమెంటల్‌ రీసెర్చ్‌ విభాగం హెడ్‌) రష్మిక్‌ ఓఝూ అంచనా వేశారు. దీని వల్ల పెద్ద సంఖ్యలో క్లయింట్స్‌.. క్రమంగా చిన్న సంస్థల నుంచి పటిష్టమైన, పెద్ద సంస్థల వైపు మళ్లే అవకాశాలున్నాయని మంగళవారమిక్కడ విలేకరులతో చెప్పారు. క్లయింట్ల సెక్యూరిటీలను సొంత అవసరాలకు వాడుకుందని కార్వీ ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. మరోవైపు, వచ్చే ఏడాది ఆఖరు నాటికి నిఫ్టీ 13,400 పాయింట్లు, సెన్సెక్స్‌ 45,500 పాయింట్లకు చేరవచ్చని కొటక్‌ సెక్యూరిటీస్‌ అంచనా వేస్తున్నట్లు ఓఝూ చెప్పారు. ఆర్థిక వ్యవస్థలో పరిస్థితులు నిరాశావహంగా కనిపిస్తున్నప్పటికీ.. మార్కెట్‌ మాత్రం సానుకూలంగా ఉంటోందని పేర్కొన్నారు. కార్పొరేట్‌ ట్యాక్స్‌ రేటు తగ్గింపు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల రాకతో పాటు దేశీయంగా సిప్‌ రూపంలో పెట్టుబడులు వస్తుండటం మార్కెట్లకు దోహదపడుతోందని ఓఝూ తెలిపారు. మార్కెట్లు, ఎకానమీ మధ్య వైరుధ్యాలు మరికొంత కాలం కొనసాగవచ్చని, బడ్జెట్‌లో తాయిలాలపై ఆశలతో మార్కెట్లు అధిక స్థాయిలోనే ఉండవచ్చని ఆయన తెలిపారు. ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ ప్రక్రియ వంటి అంశాలు వచ్చే ఏడాది కీలకంగా ఉండగలవని చెప్పారు. మందగమనం, ఆదాయాల్లో పెద్దగా మార్పులు లేకపోవడం, అమెరికా–చైనా మధ్య వాణిజ్య యుద్ధ తీవ్రత మొదలైనవి దేశీ మార్కెట్లపై ప్రభావం చూపవచ్చని ఓఝూ చెప్పారు.

**ఆకర్షణీయంగా ఈ రంగాలు..**

కార్పొరేట్‌ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు (పటిష్టమైన మాతృ సంస్థల మద్దతున్నవి), ఆయిల్‌ అండ్‌ గ్యాస్‌, క్యాపిటల్‌ గూడ్స్‌, నిర్మాణ, హెల్త్‌కేర్‌, అగ్రోకెమికల్స్‌ రంగాల షేర్లపై ఇన్వెస్టర్లు దృష్టి సారించవచ్చని ఓఝూ పేర్కొన్నారు. సిమెంటు, ఫార్మా రంగాల్లో మిడ్‌క్యాప్‌ కంపెనీలు కూడా పరిశీలించవచ్చని తెలిపారు.

## బులియన్‌ రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,960 | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 37,100 | 0 |
| వెండి (కిలో) | 46,600 | 0 |
| **చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 37,770 | ▼ 80 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,970 | ▼ 80 |
| వెండి (కిలో) | 46,600 | 0 |
| **హైదరాబాద్‌** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 37,770 | ▼ 80 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,970 | ▼ 80 |
| వెండి (కిలో) | 46,600 | 0 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,600 | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,680 | ▼ 100 |
| వెండి (కిలో) | 44,500 | 0 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,680 | ▼ 120 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,980 | ▼ 110 |
| వెండి (కిలో) | 44,500 | ▼ 500 |
| **ఏపీ బులియన్‌ అసోసియేషన్‌** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,890 | ▼ 90 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,970 | ▼ 80 |
| వెండి (కిలో) | 46,600 | 0 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## ముడిచమురు... (బ్యారల్‌)

| | | |
|---|---|---|
| నైమెక్స్‌ లైట్‌ స్వీట్‌ | 59.14 (రాత్రి 11.30కు) | $ 59.02 (సోమవారం ముగింపు) |
| బ్రెంట్‌ | 64.27 (రాత్రి 11.30కు) | $ 64.25 (సోమవారం ముగింపు) |

## కోడిగుడ్లు (హోల్‌సేల్‌ -నెక్‌ /100కు రూ.లలో) 11-12-2019

| | |
|---|---|
| విశాఖ | 470–00 |
| చిత్తూరు | 453–00 |
| వరంగల్‌ | 437–00 |
| **10–12–2019 ఫామ్‌ ధర...** | |
| హైదరాబాద్‌ | 434–00 |
| రిటైల్‌ (ఒక గుడ్డుకు) | 5.50 |
| విజయవాడ | 454–00 |
| గోదావరి | 454–00 |

## ముంబై మెట్రోకు 'శ్రీసిటీ' బోగీలు

**తయారీ ప్రారంభించిన ఆల్‌స్టామ్‌**



మెట్రో రైలు బోగీల తయారీ పనుల ప్రారంభోత్సవంలో ప్రసంగిస్తున్న ఆల్‌స్టామ్‌ ఇండియా ఎండీ అలెన్‌ స్పార్‌

**వరదయ్యపాళెం (చిత్తూరు జిల్లా):** ముంబై మెట్రో లైన్‌–3 ప్రాజెక్టుకు శ్రీసిటీలో ఆల్‌స్టామ్‌ పరిశ్రమ ఉత్పత్తి చేస్తున్న రైలు బోగీలను వాడనున్నారు. ఈ మేరకు మెట్రో ప్రాజెక్టుతో ఒప్పందం కుదిరినట్లు ఆల్‌స్టామ్‌ ఇండియా, దక్షిణాసియా ఎండీ అలెన్‌ స్పార్‌ చెప్పారు. నిర్దేశిత సమయంలో 8 బోగీలుండే 31 ట్రైన్‌ సెట్‌లను అందజేస్తామని, వీటి తయారీని కూడా ఆరంభించామని అలెన్‌ స్పార్‌ చెప్పారు. శ్రీసిటీ ప్లాంట్‌లో వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 240 నుంచి 480 రైళ్లకు చేర్చేందుకు తాము శ్రమిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఇక్కడ చెన్నై మెట్రో, మాంట్రియల్‌ మెట్రో(కెనడా), ముంబై మెట్రో లైన్‌–3 ఆర్డర్లకు అనుగుణంగా ఉత్పత్తి జరుగుతోందన్నారు. సిడ్నీకి చెందిన మరో ప్రాజెక్టు ఒప్పందం కూడా జరిగిందని తెలియజేశారు.

## పార్క్‌ హయత్‌లో ఐవోటీ ఆధారిత వాటర్‌ ప్లాంట్‌



ఐవోటీ ఆధారిత మంచినీటి బాట్లింగ్‌ యూనిట్‌ను ప్రారంభిస్తున్న హెల్త్‌ ఇండియా నిర్వాహకులు

**హైదరాబాద్‌, బిజినెస్‌ బ్యూరో:** ప్రముఖ హాస్పిటాలిటీ కంపెనీ హయత్‌ హోటల్స్‌ కార్పొరేషన్‌ దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లోని పార్క్‌ హయత్‌ హోటల్‌లో ఇంటర్నెట్‌ ఆఫ్‌ థింగ్స్‌ (ఐవోటీ) ఆధారిత వాటర్‌ ప్యూరిఫికేషన్‌, బాట్లింగ్‌ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు 'వాటర్‌హెల్త్‌ ఇండియా'తో ఒప్పందం చేసుకుంది. ప్లాస్టిక్‌ వ్యర్థాలను పునర్వినియోగించడం, నీటిని ఆదా చేయడం ఈ యూనిట్‌ ప్రత్యేకతని పార్క్‌ హయత్‌ సౌత్‌ ఇండియా వైస్‌ ప్రెసిడెంట్‌ థామస్‌ అబ్రహం మంగళవారమిక్కడ విలేకరులతో చెప్పారు. ప్రస్తుతం హయత్‌కు దేశంలో 30 హోటల్స్‌ ఉన్నాయి. వాటర్‌హెల్త్‌ సీఓఓ వికాస్‌ షా మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో ఏటా 50 లక్షల టన్నుల ప్లాస్టిక్‌ విడుదలవుతోందని, ఇది భూమిలో లేదా సముద్రాల్లో కలిసిపోతోందని చెప్పారు. ''2040 నాటికి దేశంలో నీటి సంక్షోభం ఏర్పడే అవకాశముంది. ఎందుకంటే ప్రపంచ జనాభాలో మన వాటా 17 శాతం. కానీ నీటి వనరుల్లో మన వాటా 4 శాతమే'' అని వివరించారు.

## యస్‌ బ్యాంక్‌లో పెట్టుబడులపై అనిశ్చితి

- సైటాక్స్‌ గ్రూప్‌ ఆఫర్‌కు ఓకే..
- తదుపరి బోర్డ్‌ భేటీలోనే తుది నిర్ణయం
- పరిశీలనలోనే బ్రెయిచ్‌ ప్రతిపాదన




**ముంబై:** యస్‌ బ్యాంక్‌లో పెట్టుబడుల ప్రతిపాదనపై ఇంకా అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. 200 కోట్ల డాలర్ల మేర పెట్టుబడులు రాగలవని భావించగా, కేవలం 50 కోట్ల డాలర్లకే బ్యాంక్‌ సుముఖత వ్యక్తం చేసింది. సైటాక్స్‌ హోల్డింగ్స్‌, సైటాక్స్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ గ్రూప్‌ ప్రతిపాదించిన ఈ ఆఫర్‌ విషయంలో సానుకూలంగా ఉన్నామని మంగళవారం జరిగిన బోర్డు సమావేశం అనంతరం యస్‌ బ్యాంక్‌ స్టాక్‌ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. అయితే దీనిపై తుది నిర్ణయాన్ని తదుపరి బోర్డ్‌ సమావేశంలో తీసుకుంటామని వెల్లడించింది. ఎర్విన్‌ సింగ్‌ బ్రెయిచ్‌/ఎస్‌పీజీపీ హోల్డింగ్స్‌ ప్రతిపాదించిన 120 కోట్ల బిలియన్‌ డాలర్ల పెట్టుబడుల ఆఫర్‌పై డైరెక్టర్ల బోర్డు ఇంకా పరిశీలన జరుపుతోందని పేర్కొంది. 200 కోట్ల డాలర్ల దాకా పెట్టుబడులు సమీకరించే దిశగా ఇతరత్రా ఇన్వెస్టర్ల ప్రతిపాదనలపై కసరత్తును కొనసాగిస్తున్నట్లు యస్‌ బ్యాంక్‌ తెలిపింది. రిజర్వ్‌ బ్యాంక్‌ ఆదేశాల మేరకు 2018 ఆగస్టులో ప్రమోటరు, సీఈవో రాణా కపూర్‌ నిష్క్రమించినప్పట్నుంచి యస్‌ బ్యాంక్‌ పరిస్థితులు నానాటికీ దిగజారుతున్న సంగతి తెలిసిందే. మొండిబాకీల భారం, మూలధనంపరమైన సమస్యల కారణంగా రుణ వృద్ధిపై ప్రతికూల ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో కొందరు ఇన్వెస్టర్ల నుంచి 200 కోట్ల డాలర్ల దాకా పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చినట్లు యస్‌ బ్యాంక్‌ గత నెలలో వెల్లడించింది. వీటినే ప్రస్తుతం మదింపు చేస్తోంది. తాజా వార్తల నేపథ్యంలో యస్‌బ్యాంక్‌ షేర్‌ 10 శాతం నష్టంతో రూ.50.55 వద్ద ముగిసింది.

## ఈ నెల 16 నుంచి కొత్త ఎంఎన్‌పీ నిబంధనలు

**15 దాకా పోర్టబిలిటీ నిలిపివేత**

**న్యూఢిల్లీ:** మొబైల్‌ నంబర్‌ పోర్టబిలిటీ (ఎంఎన్‌పీ) ప్రక్రియకు సంబంధించి కొత్త నిబంధనలు డిసెంబర్‌ 16 నుంచి అమల్లోకి రానున్నట్లు టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్‌ వెల్లడించింది. పాత వ్యవస్థ నుంచి కొత్త వ్యవస్థకు మారే క్రమంలో డిసెంబర్‌ 10 నుంచి 15 దాకా ఎంఎన్‌పీ సదుపాయం అందుబాటులో ఉండదని, ప్రత్యేక పోర్టింగ్‌ కోడ్‌ (యూపీసీ) కూడా జనరేట్‌ కాదని పేర్కొంది. అయితే, ఇప్పటికే వచ్చిన దరఖాస్తుల ప్రాసెసింగ్‌ ప్రక్రియ మాత్రం కొనసాగుతుందని వివరించింది. కొత్త నిబంధనల ప్రకారం అర్హులైన సబ్‌స్క్రయిబర్స్‌కి మాత్రమే యూపీసీ జనరేట్‌ అవుతుంది. ఉదాహరణకు.. పోస్ట్‌ పెయిడ్‌ మొబైల్‌ కనెక్షన్‌ గల సబ్‌స్క్రయిబర్‌.. ప్రస్తుత టెలికం సంస్థ బకాయిలన్నీ కట్టేశాకే, కొత్త టెల్కోకు మారేందుకు పోర్టబిలిటీ కోడ్‌ వస్తుంది. జమ్మూ కశ్మీర్‌, అసోం, ఈశాన్య రాష్ట్రాలు మినహా మిగతా అన్ని సర్కిల్స్‌లో దీనికి 4 రోజుల వేలిడిటీ ఉంటుంది. జమ్మూ తదితర రాష్ట్రాల్లో వేలిడిటీ 30 రోజులు.



## రూ. 12 వేల కోట్ల లెక్క తప్పింది!!

**ఆర్‌బీఐ ఆడిట్‌లో పెరిగిన ఎస్‌బీఐ మొండిబాకీలు**




**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఎస్‌బీఐ) గత ఆర్థిక సంవత్సర ఫలితాల్లో దాదాపు రూ.12,000 కోట్ల మేర మొండిబాకీలు బయటపడలేదు. రిజర్వ్‌ బ్యాంకు ఆడిట్‌లో రూ.11,932 కోట్ల మేర వ్యత్యాసం (డైవర్జెన్స్‌) వచ్చినట్లు ఎస్‌బీఐ మంగళవారం తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం ఫలితాల్లో.. స్థూల మొండిబాకీలు (ఎన్‌పీఏ) రూ.1,72,750 కోట్లుగా ఎస్‌బీఐ లెక్కించింది. అయితే, ఇవి మరో రూ.11,932 కోట్లు పెరిగి రూ.1,84,682 కోట్లుగా ఉన్నట్లు ఆర్‌బీఐ మదింపు చేసింది. అలాగే, నికర ఎన్‌పీఏలు రూ.65,895 కోట్లుగా ఎస్‌బీఐ వెల్లడించగా.. ఇవి రూ. 77,827 కోట్లుగా ఉంటాయని ఆర్‌బీఐ లెక్కించింది. దీంతో రూ.12,036 కోట్ల మేర అదనంగా ప్రొవిజనింగ్‌ చేయాల్సి వచ్చిందని, దీని ప్రకారం చూస్తే రూ.6,968 కోట్ల మేర నష్టం నమోదు చేయాల్సి వచ్చేదని స్టాక్‌ ఎక్స్ఛేంజీలకు ఎస్‌బీఐ తెలియజేసింది. 2018–19లో ఎస్‌బీఐ రూ.862 కోట్ల నికర లాభం ప్రకటించింది. ఆర్థికంగా మెరుగైన పనితీరు చూపించుకునేందుకు బ్యాంకులు.. మొండిబాకీల పరిమాణాన్ని తక్కువ చేసి చూపిస్తుండటాన్ని ఆర్‌బీఐ కొన్నాళ్లుగా నిశితంగా పరిశీలిస్తోంది. లెక్కలను స్వయంగా మదింపు చేస్తోంది. రెండింటి మధ్య తేడాలేమైనా ఉంటే సత్వరం చర్యలు తీసుకుంటోంది.

## ఫోన్‌పే సంస్థకు రూ.586 కోట్ల నిధులు

**న్యూఢిల్లీ:** ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన డిజిటల్‌ చెల్లింపుల సంస్థ, ఫోన్‌పే తన మాతృ సంస్థ నుంచి రూ.585.66 కోట్ల పెట్టుబడులను సమీకరించింది. ఫోన్‌పే ప్రైవేట్‌ లిమిటెడ్‌, సింగపూర్‌కు (గతంలో ఫ్లిప్‌కార్ట్‌ పేమెంట్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌) 13.8 లక్షల ఈక్విటీ షేర్లను కేటాయించి ఫోన్‌పే ఈ పెట్టుబడులను సమీకరించింది. కాగా ఫోన్‌పే కంపెనీని ప్రత్యేక కంపెనీగా విడగొట్టాలని ఫ్లిప్‌కార్ట్‌ యోచిస్తోందన్న వార్తలు వస్తున్నాయి. ప్రత్యేక కంపెనీగా విడిపోతే, ఫోన్‌పే సొంతంగా పెట్టుబడులను సమీకరించే వీలవుతుంది.

# 11,900 దిగువకు నిఫ్టీ

- ప్రతికూలంగా అంతర్జాతీయ సంకేతాలు
- పై స్థాయిల్లో లాభాల స్వీకరణ
- 248 పాయింట్ల పతనంతో 40,240కు సెన్సెక్స్‌
- 81 పాయింట్ల నష్టంతో 11,857కు నిఫ్టీ



అంతర్జాతీయ సంకేతాలు అంతంతమాత్రంగానే ఉండటంతో ఇంధన, ఐటీ షేర్లలో పై స్థాయిల్లో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. దీంతో మంగళవారం స్టాక్‌ మార్కెట్‌ నష్టపోయింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ కీలకమైన 11,900 పాయింట్ల దిగువకు పడిపోయింది. 81 పాయింట్లు నష్టపోయి 11,857 పాయింట్ల వద్ద ముగిసింది. రోజంతా 379 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన బీఎస్‌ఈ సెన్సెక్స్‌ చివరకు 248 పాయింట్ల పతనంతో 40,240 పాయింట్లకు పరిమితమయింది. అన్ని రంగాల సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ ఇంట్రాడేలో నెల గరిష్టానికి చేరినా, మార్కెట్‌కు నష్టాలు తప్పలేదు.

**ఆరంభంలోనే లాభాలు...**

డిమాండ్‌ అంతంతమాత్రంగానే ఉండటంతో వాహన విక్రయాలు నవంబర్‌లో 0.7 శాతం మేర తగ్గాయి. వృద్ధి బలహీనంగా ఉండటం, ద్రవ్యోల్బణం పెరుగుతుండటం.. ఈ రెండు అంశాలు మార్కెట్‌ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. మరోవైపు రేట్ల విషయమై అమెరికా ఫెడరల్‌ రిజర్వ్‌ బుధవారంనాడు నిర్ణయాన్ని వెలువరించనుండటం, కీలకమైన ద్రవ్యోల్బణ గణాంకాలు ఈ వారంలోనే వెలువడనుండటం తదితర కారణాలతో ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించారు. సెన్సెక్స్‌ లాభాల్లోనే ఆరంభమైనప్పటికీ, ఆ తర్వాత నష్టాల్లోకి జారిపోయింది. రోజంతా నష్టాలు తప్పలేదు. ఆరంభంలో 101 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్‌, ఆ తర్వాత 278 పాయింట్లు నష్టపోయింది. అమెరికా– చైనా వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో ఆసియా మార్కెట్లు నష్టాల్లో, యూరప్‌ మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి.

- యస్‌ బ్యాంక్‌ షేర్‌ 10 శాతం నష్టంతో రూ.50.55 వద్ద ముగిసింది.
- గత ఆర్థిక సంవత్సరంలో మొండి బకాయిలను రూ.11,932 కోట్ల మేర తక్కువ చేసి చూపిందన్న వార్తల కారణంగా స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఎస్‌బీఐ) షేర్‌ 1% నష్టంతో రూ.313 వద్ద ముగిసింది. ఈ ప్రభావం ఇతర బ్యాంక్‌ షేర్లపైనా కూడా పడింది.

# నేడు రాజ్యసభకు పౌరసత్వ బిల్లు

- ఆమోదం కోసం అమిత్ వ్యూహాలు
- శివసేన యూ టర్న్
- జేడీయూలో అభిప్రాయభేదాలు
- బిల్లు పాసవుతుందని బీజేపీ ధీమా



మంగళవారం అగర్తలాలో పౌరసత్వ సవరణ బిల్లుపై నిరసన

**న్యూఢిల్లీ:** సుదీర్ఘమైన చర్చలు, తీవ్ర నిరసనలు, వాదోపవాదాలు, సవరణలకు డిమాండ్ల మధ్య పౌరసత్వ సవరణ బిల్లుకి 311–80 ఓట్ల తేడాతో లోక్‌సభ ఆమోద ముద్ర వేసింది కానీ, పెద్దల సభలో ఏం జరుగబోతోందన్న ఉత్కంఠ నెలకొంది. పొరుగు దేశాల్లో ఉన్న ముస్లిమేతరులకు భారత్ పౌరసత్వాన్నిచ్చే పౌరసత్వ సవరణ బిల్లు (సీఏబీ) బుధవారం ఎగువ సభలో ప్రవేశపెడుతున్నట్టు రాజ్యసభ వర్గాలు వెల్లడించాయి. ఈ బిల్లుపై చర్చకు 6 గంటలు కేటాయించినట్టు తెలుస్తోంది.

### బిల్లుపై సందేహాలు తీర్చాలి: ఉద్ధవ్ ఠాక్రే

హిందుత్వ పార్టీ శివసేన జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని లోక్‌సభలో బిల్లుకి మద్దతు తెలిపినప్పటికీ మంగళవారం యూ టర్న్ తీసుకుంది. బిల్లుపై నెలకొన్న సందేహాలను తీర్చనట్లయితే రాజ్యసభలో మద్దతివ్వబోమని పార్టీ అధినేత ఉద్ధవ్ ఠాక్రే స్పష్టం చేశారు. బీజేపీ తమకు మద్దతు పలికే వారిని దేశభక్తులని, వ్యతిరేకించే వారందరినీ దేశద్రోహులని ముద్ర వేస్తోందని ధ్వజమెత్తారు. ఠాక్రే వ్యాఖ్యల్ని స్వాగతించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ పౌరసత్వ సవరణ బిల్లు పాసయితే రాజ్యాంగంపైన దాడి జరిగినట్లేనని వ్యాఖ్యానించారు. మరోవైపు జాతీయ పౌర పట్టిక(ఎన్నార్సీ), పౌరసత్వ సవరణ బిల్లుతో ఈశాన్య రాష్ట్రాల్లోని ముస్లింలలో తీవ్ర అభద్రత నెలకొంటుందని జేడీ(యూ) ఆందోళన వ్యక్తం చేసింది. ఆ పార్టీ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ కిశోర్ ఈ బిల్లుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముస్లింల పట్ల ఈ బిల్లు వివక్ష చూపుతోందన్నారు. అయినప్పటికీ రాజ్యసభలో ఈ బిల్లుకు మద్దతివ్వాలని జేడీ(యూ) నిర్ణయించింది.

### బీజేపీ అంచనాలివి

రాజ్యసభలో అధికార బీజేపీకి మెజారిటీ లేకపోవడంతో మిత్రపక్షాలు, ప్రాంతీయ పార్టీల మద్దతుతోనే బిల్లును గట్టెక్కించడానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వ్యూహాలు పన్నుతున్నారు. బిల్లుకు అనుకూలంగా కనీసం 124–130 ఓట్లు వస్తాయని బీజేపీ ధీమాగా ఉంది. విపక్షాల బలం 90–93కి పరిమితమైపోతుందని అంచనా వేస్తోంది. ఇన్నాళ్లూ ఎన్డీయే ప్రభుత్వం పెట్టిన ప్రతీ బిల్లుకి టీఆర్ఎస్ మద్దతు ఇస్తూ వచ్చింది. కానీ ఈ సారి మైనారిటీ ముస్లింల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్నదని పేర్కొంటూ ఈ బిల్లుకి లోక్‌సభలోనూ టీఆర్ఎస్ మద్దతివ్వలేదు.

### ఈశాన్య రాష్ట్రాల బంద్ సక్సెస్

ముస్లిం మైనారిటీల ప్రయోజనాలను కాలరాసేలా ఉందంటూ పౌరసత్వ సవరణ బిల్లుకి వ్యతిరేకంగా ఈశాన్య రాష్ట్రాల్లో మంగళవారం చేపట్టిన బంద్ సక్సెస్ అయింది. లెఫ్ట్ పార్టీలు, ఇతర ప్రజాస్వామ్య సంస్థలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగిన బంద్‌తో అసోంలో జనజీవనం స్తంభించింది.

### పెద్దల సభలో ఎవరు ఎటు వైపు ?

| | |
|---|---|
| మొత్తం సభ్యుల సంఖ్య: | 245 |
| ప్రస్తుతం ఉన్న సభ్యులు: | 240 |
| మేజిక్ ఫిగర్: | 121 |

**బిల్లుకి అనుకూలం 115**

బీజేపీ (83), ఏఐఏడీఎంకే (11), జేడీయూ (6), శిరోమణి అకాలీదళ్ (3), స్వతంత్ర, నామినేటెడ్ అభ్యర్థులు (7), ఒక్కో సభ్యుడు ఉన్న చిన్న పార్టీలు (5)

**ఎన్డీయేతర పక్షాలు బిల్లుకి అనుకూలం 11**

బీజేడీ (7), వైసీపీ (2), టీడీపీ (2),
మొత్తం: 115 + 11 = 126

**బిల్లుకి వ్యతిరేకం 95**

కాంగ్రెస్ (46), తృణమూల్ కాంగ్రెస్ (13), సమాజ్‌వాదీ పార్టీ (9), లెఫ్ట్ పార్టీలు (6), టీఆర్ఎస్ (6), ఎన్సీపీ (4), బీఎస్పీ (4), ఆర్‌జేడీ (4), ఆప్ (3), మొత్తం: 95

- ఇవి కాకుండా ముగ్గురు సభ్యులున్న శివసేన, ఒక్కో సభ్యుడున్న చిన్న పార్టీల మద్దతుతో విపక్షాల సంఖ్య 100 వరకు చేరుకోవచ్చునని ఓ అంచనా

### అమిత్ షాపై ఆంక్షలు విధించాలి

**అమెరికా సర్కార్‌కి యూఎస్‌సీఐఆర్‌ఎఫ్ సూచన**

పౌరసత్వ సవరణ బిల్లును యూఎస్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలీజియస్ ఫ్రీడమ్ (యూఎస్‌సీఐఆర్‌ఎఫ్) తప్పు పట్టింది. ఈ బిల్లు తప్పుడు మార్గంలో వెళుతూ అత్యంత ప్రమాదకరంగా మారిందని వ్యాఖ్యానించింది. భారత లౌకికతత్వాన్ని ఈ బిల్లు దెబ్బ తీస్తోందని, సమాన హక్కుల్ని కాలరాస్తోందని పేర్కొంది. మత ప్రాతిపదికన చట్టం తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న హోం మంత్రి అమిత్, ఇతర నాయకులపై ఆంక్షలు విధించే అంశాన్ని పరిగణించాలని యూఎస్‌సీఐఆర్‌ఎఫ్ అమెరికా ప్రభుత్వ యంత్రాంగానికి సూచించింది.

**ఎదురుదాడికి దిగిన భారత్**

అమెరికా కమిషన్‌పై భారత్ మంగళవారం తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. పౌరసత్వ సవరణ బిల్లుపై కనీస అవగాహన లేకుండా ఆ కమిషన్ సూచనలు చేస్తోందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ అన్నారు. ఈ అంశంలో ఆ సంస్థ ఈర్ష్య, పక్షపాతంతో వ్యవహరిస్తోందని ఎదురు దాడికి దిగారు. ఆంక్షలు విధించాలంటూ సిఫార్సులు చేయడం అత్యంత విచారకరమన్న రవీష్ కుమార్ భారత్‌లో చట్టాలపై వ్యాఖ్యలు చేసే హక్కు ఆ సంస్థకు లేదని అన్నారు. గోద్రా ఘర్షణల సమయంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీకి టూరిస్ట్ వీసా నిరాకరణకు యూఎస్‌సీఐఆర్‌ఎఫ్ మద్దతునిచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

## రూ.2 వేల నోటు రద్దు లేదు



**న్యూఢిల్లీ:** భవిష్యత్తులో కేంద్రం రూ.2 వేల నోట్లను రద్దు చేస్తుందన్న ఊహాగానాలను కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ కొట్టిపారేశారు. 'దేశవ్యాప్తంగా ఈ విషయంపై ఆందోళన వ్యక్తం అవుతోంది. అయితే దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు'అని మంగళవారం రాజ్యభలో వివరించారు. కేంద్రం రూ.2 వేల నోట్లు రద్దు చేస్తుందన్న అనుమానాలపై సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ విశంభర్ ప్రసాద్ నిషద్ అడిగిన ప్రశ్నకు ఠాకూర్ సమాధానమిచ్చారు. 'రూ.2 వేల నోట్ల వల్ల దేశంలో నల్ల ధనం పెరిగిపోయింది. రూ.2 వేల నోట్ల స్థానంలో రూ. వెయ్యి నోట్లను ప్రవేశపెడతారనే భ్రమ ప్రజల్లో ఉంది. దీనిపై ఏమంటారు'అని నిషద్ ప్రశ్నించారు. దీనిపై ఠాకూర్ మాట్లాడుతూ.. నల్ల ధనాన్ని పారదోలేందుకు, నకిలీ కరెన్సీ బెడదను తొలగించేందుకు, ఉగ్రవాదానికి ఆర్థిక సాయం, తీవ్రవాద భావజాలాలను వేర్లతో సహా పెకిలించేందుకు, పన్ను పరిధి పెంచడమే కాకుండా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు పెద్ద నోట్ల రద్దు చేసినట్లు గుర్తు చేశారు.

## 1.17 లక్షల రీట్వీట్లు.. 4.2లక్షల లైక్‌లు



**న్యూఢిల్లీ:** 2019 లోక్‌సభ ఎన్నికల్లో విజయాన్ని ప్రస్తావిస్తూ ప్రధాని మోదీ చేసిన ట్వీట్ రికార్డుల మోత మోగించింది. భారత్‌లో అత్యంత ఎక్కువ సార్లు (1.17 లక్షలు) రీట్వీట్, అత్యంత ఎక్కువ లైక్ (4.2 లక్షలు)లు సాధించిన ట్వీట్ ఇదేనని ట్విట్టర్ తెలిపింది. అందులో మోదీ 'సబ్‌కా సాథ్+సబ్‌కా వికాస్ + సబ్‌కా విశ్వాస్ = విజయీ భారత్' అని పేర్కొన్నారు. ఈ సంవత్సరపు గోల్డెన్ ట్వీట్ ఇదేనని తెలిపింది. ఈ యేడాది 'లోక్‌సభ ఎలక్షన్స్ 2019', 'చంద్రయాన్–2', 'సీడబ్ల్యూసీ–19', 'పుల్వామా', 'ఆర్టికల్–370' అనే హాష్‌టాగ్‌లపై ఎక్కువ ట్వీట్లు నమోదైనట్లు తెలిపింది. ఎక్కువ సార్లు మెన్షన్ అయిన జాబితాలో పురుషుల్లో బాలీవుడ్ ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్ నిలవగా, మహిళల జాబితాలో సోనాక్షి సిన్హాలు నిలిచారు. క్రీడల్లో ధోనీ పుట్టిన రోజు సందర్భంగా విరాట్ కోహ్లి పోస్ట్ చేసిన ట్వీట్ ఏకంగా 45 వేల సార్లు రీట్వీట్ కాగా, 4.12లక్షల లైక్‌లను అందుకుంది.

## పీఎం కిసాన్‌కు ఆధార్ తప్పనిసరి



**న్యూఢిల్లీ:** ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన (పీఎం కిసాన్) కింద లబ్ధి పొందాలనుకునే రైతులకు ఆధార్ తప్పనిసరని కేంద్రం తెలిపింది. ఆధార్‌తో అనుసంధానించిన బ్యాంకు ఖాతా ఉన్న రైతులే పీఎం కిసాన్‌కు అర్హులని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ లోక్‌సభలో మంగళవారం చెప్పారు. పీఎం కిసాన్ కింద దేశవ్యాప్తంగా 14 కోట్ల మంది రైతులకు ఏటా రూ.6 వేల చొప్పున (మూడు వాయిదాల్లో) బ్యాంకు ఖాతాల్లో కేంద్రం జమ చేస్తోంది. ఆధార్ సీడింగ్ నమోదులో ఆలస్యం కారణంగా ఈ ఏడాది నవంబర్ 30 వరకు ఆధార్ తప్పనిసరి నిబంధనను కేంద్రం సడలించింది. '2019 డిసెంబర్ 1 నుంచి పీఎం కిసాన్ లబ్ధిదారులకు ఆధార్ తప్పనిసరి. లేకపోతే వాయిదా మొత్తాలు బ్యాంకు ఖాతాల్లో జమకావు'అని తోమర్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఈ పథకం కింద 7.60 కోట్ల లబ్ధిదారులకు ఈ ఏడాది నవంబర్ వరకు సుమారు రూ.35,882.8 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.





మంగళవారం స్వీడన్ రాజధాని స్టాక్‌హోమ్‌లో ఆ దేశ రాజు కార్ల్-16 గుస్తాఫ్ నుంచి 2019ఏడాదికి ఆర్థిక శాస్త్ర నోబెల్ బహుమతిని అందుకుంటున్న భారత సంతతికి చెందిన అభిజిత్ బెనర్జీ. ఆయన భార్య ఎస్తేర్ డఫ్లో సైతం ఈ విభాగంలోనే నోబెల్‌ను అందుకున్నారు. అవార్డు ప్రదాన కార్యక్రమంలో దంపతులిద్దరూ భారతీయ సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొన్నారు.

## రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం

**న్యూఢిల్లీ:** లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు మరో పదేళ్ల పాటు, 2030 జనవరి 25 వరకు, రిజర్వేషన్లను పొడిగించేందుకు ఉద్దేశించిన 126వ రాజ్యాంగ సవరణ బిల్లును మంగళవారం లోక్‌సభ ఆమోదించింది. బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో అనుకూలంగా 352 మంది ఓటేయగా, ఎవరూ వ్యతిరేకంగా ఓటేయలేదు. అయితే, చట్టసభల్లో ఆంగ్లో ఇండియన్లకు కూడా రిజర్వేషన్లను పొడిగించే ప్రతిపాదనను మాత్రం ఈ బిల్లులో చేర్చలేదు. ఈ విషయమై త్వరలో నిర్ణయం తీసుకుంటామని న్యాయశాఖమంత్రి రవిశంకర్ తెలిపారు. దీనిపై ప్రభుత్వ తీరును విపక్షాలు ప్రశ్నించాయి. రిజిస్ట్రార్ జనరల్ గణాంకాల ఆధారంగా దేశంలో ఆంగ్లో ఇండియన్ల జనాభాను 296గా పేర్కొనడంపై అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఒక్క తమిళనాడులోనే ఆంగ్లో ఇండియన్లు వేల సంఖ్యలో ఉన్నారని డీఎంకే ఎంపీ కనిమొళి పేర్కొన్నారు. మహిళలను కూడా దళితులుగా పరిగణించి వారికి కూడా రిజర్వేషన్లు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. దేశ అభివృద్ధిలో ఆంగ్లో ఇండియన్ల పాత్ర కూడా ఉందని, దేశవ్యాప్తంగా ఉన్న 3.47లక్షల ఆంగ్లో ఇండియన్లకు లోక్‌సభలో ప్రాతినిధ్యం అవసరమని కాంగ్రెస్ సభ్యుడు హిబి ఎడెన్ పేర్కొన్నారు. రిజర్వేషన్ల పొడిగింపునకు సంబంధించిన సవరణ బిల్లు ఆమోదం పొందడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

## ఆయుధ సవరణ బిల్లుకు పార్లమెంట్ ఓకే

**న్యూఢిల్లీ:** ఆయుధ సవరణ బిల్లుకు మంగళవారం రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లును సోమవారం లోక్‌సభ ఆమోదించింది. ఒక వ్యక్తి ఇప్పటివరకు అత్యధికంగా మూడు తుపాకులు, లేదా సంబంధిత ఆయుధాలను కలిగి ఉండే అవకాశం ఉండగా, ఇకపై అత్యధికంగా రెండు మాత్రమే కలిగి ఉండే ప్రతిపాదనను బిల్లులో చేర్చారు. వారసత్వంగా వచ్చిన ప్రాచీన ఆయుధాలను నిరుపయోగం చేసి, ఎన్నైనా భద్రపరుచుకోవచ్చని హోంశాఖ సహాయమంత్రి కిషన్ రెడ్డి రాజ్యసభకు తెలిపారు. నిర్లక్ష్యంగా, మనుషులకు ప్రాణహాని కలిగేలా ఆయుధాన్ని ఉపయోగిస్తే రెండేళ్ల జైలు, లక్ష జరిమానా ప్రతిపాదన బిల్లులో ఉంది.

## ‘ఉన్నావ్’ రేప్ కేసు తీర్పు 16న

### ఢిల్లీ హైకోర్టు



**ఢిల్లీ:** ఉత్తరప్రదేశ్‌లోని 'ఉన్నావ్'లో మైనర్ బాలికపై బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సెంగార్ అత్యాచారానికి పాల్పడ్డారన్న కేసులో తీర్పును ఢిల్లీ హైకోర్టు రిజర్వ్‌లో ఉంచింది. ఈ నెల 16న తీర్పు వెలువరిస్తామని హైకోర్టు జడ్జి జస్టిస్ ధర్మేశ్ శర్మ తెలిపారు. 2017లో మైనర్ బాలికను బీజేపీ ఎమ్మెల్యే కిడ్నాప్ చేసి గ్యాంగ్‌రేప్ చేశారని ఆరోపణలున్నాయి. ఈ కేసులో నిందితుడిపై పోక్సో సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసు ఉత్తరప్రదేశ్ నుంచి ఢిల్లీ హైకోర్టుకు మారింది. గోప్యంగా జరిగిన విచారణలో ఈ నెల 2న నిందితుడు తన వాదనలు వినిపించగా, సోమవారం సీబీఐ తన వాదనలను కోర్టులో వినిపించింది. సెంగార్ నిందితుడిగా ఉన్న ఈ కేసులో బాధితురాలు ప్రయాణిస్తున్న కారును గత జూలై 28న ఓ ట్రక్కు ఢీకొట్టింది. అనంతరం ఆమెను ఢిల్లీ ఎయిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆమె కుటుంబానికి ఢిల్లీ మహిళా కమిషన్ ఆశ్రయమిచ్చి ఢిల్లీలో ఉంచింది. సుప్రీం ఆదేశాలతో ఆ కుటుంబానికి సీఆర్‌పీఎఫ్ బలగాలతో రక్షణ కల్పించారు.

## నిర్భయ దోషులందరూ తీహార్ జైల్లో

- మండోలి నుంచి తీహార్‌కు పవన్ కుమార్ గుప్తా తరలింపు
- జైల్లో డమ్మీ ఉరి ట్రయల్స్
- మరో దోషి అక్షయ్ రివ్యూ పిటిషన్


నిర్భయ కేసులోని దోషులు (ఫైల్)

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో నిర్భయపై మూకుమ్మడి అత్యాచారం, హత్య కేసులో దోషులకి ఉరి శిక్ష అమలు చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. బిహార్ బక్సర్ జైలు నుంచి ఉరితాళ్లను తీసుకువస్తున్నారు. ఉరికంబంపై శిక్ష అమలు ఎలా జరపాలో నలుగురు దోషుల బరువు, ఎత్తున్న దిష్టిబొమ్మలకి ఉరి తీసి డమ్మీ ట్రయల్స్ వేసి చూశారని జైలు వర్గాలు తెలిపాయి. దోషులందరినీ ప్రస్తుతం తీహార్ జైలు నంబర్ మూడులో వేర్వేరు గదుల్లో ఉంచి సీసీటీవీ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జైలు నంబర్ 3లోనే దోషులకి ఉరిశిక్ష అమలు చేయనున్నారు. ఇటీవల మండోలి జైలులో ఉన్న పవన్ కుమార్ గుప్తాను తీహార్ జైలుకి తరలించినట్టు డైరెక్టర్ జనరల్ (జైళ్లు) సందీప్ గోయెల్ వెల్లడించారు. ముఖేష్ సింగ్, అక్షయ్ సింగ్, వినయ్ శర్మను ఉంచిన జైలు నెంబర్3లో పవన్ కుమార్ గుప్తాను ఉంచారు. నిర్భయను 2012 డిసెంబర్ 16 అర్ధరాత్రి బస్సులో ఆరుగురు రాక్షసులు మూకుమ్మడిగా అత్యాచారం చేయడమే కాకుండా, దారుణంగా హింసించడంతో ఆమె కొన్నాళ్లు మృత్యువుతో పోరాడి సింగపూర్ ఆస్పత్రిలో కన్నుమూసింది. ఆరుగురు దోషుల్లో ఒకరైన రామ్‌సింగ్ జైల్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మరొకరు మైనర్ కావడంతో మూడేళ్ల పాటు జువైనల్ హోంకి పంపారు. మిగిలిన నలుగురిని ఏ రోజైతే అత్యంత పాశవికంగా నిర్భయపై అత్యాచారానికి పాల్పడ్డారో అదే రోజు డిసెంబర్ 16న ఉరితీస్తారని వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు దోషులందరూ ఒకే జైలుకి చేరడంతో వారికి ఉరిశిక్ష అమలు జరపడం ఖాయమన్న వార్తలకు ఊతమిచ్చినట్టయింది.

ఢిల్లీ కాలుష్యం చంపేస్తోంది.

### మళ్లీ ఉరి ఎందుకు ?

**సుప్రీంలో అక్షయ్ సింగ్ రివ్యూ పిటిషన్**

నిర్భయ గ్యాంగ్ రేప్ కేసు దోషుల్లో ఒకరైన అక్షయ్ సింగ్ మరణ దండనని సమీక్షించాల్సిందిగా సుప్రీం కోర్టుకెక్కినట్టు అతని తరపు లాయర్ ఏపీ సింగ్ వెల్లడించారు. తన రివ్యూ పిటిషన్‌లో అక్షయ్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. ఢిల్లీలో వాయు కాలుష్యం, నీటి కాలుష్యం ఎలాగూ తమని చంపేస్తోందని, తమ ఆయుష్షని తగ్గిస్తోందని మళ్లీ ఉరి శిక్ష ఎందుకంటూ ప్రశ్నించాడు. 2018, జూలై 9న అత్యున్నత న్యాయస్థానం మిగిలిన ముగ్గురు దోషులు దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ని కొట్టివేసింది. అప్పుడు రివ్యూ పిటిషన్ వేయని అక్షయ్ ఉరి శిక్ష అమలుకు సన్నాహాలు జరుగుతున్న వేళ పిటిషన్ వేశాడు. ఈ పిటిషన్‌ను కూడా సుప్రీం కోర్టు కొట్టివేసే అవకాశాలే ఎక్కువున్నాయి.

## క్లుప్తంగా...

### రోహింగ్యాల నరమేధం ఆపండి

**ది హేగ్:** రోహింగ్యా ముస్లింలపై నరమేధం ఆపాలని మయన్మార్ కౌన్సిలర్ అంగ్ సాన్ సూకీ(74)ను గాంబియా కోరింది. మయన్మార్‌లోని రోహింగ్యా ముస్లింలపై సైనిక బలగాల సామూహిక హత్యాకాండ, అత్యాచారాలకు వ్యతిరేకంగా అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే)లో గాంబియా ప్రభుత్వం వేసిన కేసు మంగళవారం విచారణకు వచ్చింది. గాంబియా తరపున ఆ దేశ న్యాయశాఖ మంత్రి అబూబకర్ వాదనలు వినిపించారు. మయన్మార్‌లో మారణకాండ ఆ దేశం అంగీకరించిన ఒప్పందానికి వ్యతిరేకమన్నారు. అక్కడి ముస్లింలపై సాగుతున్న హేయమైన హత్యలు, పాశవిక చర్యలను వెంటనే ఆపేలా చర్యలు తీసుకోవాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ అమానవీయ ఘటనల్లో కౌన్సెలర్‌గా ఉన్న అంగ్ సాన్ సూకీ పాత్ర కూడా ఉందని ఆరోపించారు.

### చెక్ రిపబ్లిక్‌లో కాల్పులు

**ఆరుగురి మృతి**

**ప్రేగ్:** చెక్ రిపబ్లిక్ దేశంలోని ఒస్ట్రావా నగరంలో మంగళవారం ఓ వ్యక్తి ఆసుపత్రిలో కాల్పులకు పాల్పడటంతో ఆరుగురు మరణించారు. ఆ తరువాత ఆ వ్యక్తి తనను తాను కాల్చుకుని మరణించారు. చెక్ రాజధాని ప్రేగ్‌కు సుమారు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒస్ట్రావాలో కేవలం కొన్ని సెకన్ల వ్యవధిలో జరిగిపోయిన ఈ కాల్పుల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఏ కారణాల చేత అతడు ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడో తెలియ లేదని పోలీసులు తెలిపారు. ఆసుపత్రిలోని వెయిటింగ్ రూమ్‌లో కూర్చుని ఉన్న వారిపై ఈ ఆగంతకుడు కాల్పులు జరిపినట్లు తనకు సమాచారం అందిందని, ఇది అత్యంత దురదృష్టకరమైన సంఘటన అని చెక్ ప్రధాని అంద్రేజ్ బాబిస్ స్థానిక మీడియాతో చెప్పారు.

### చిలీలో విమానం గల్లంతు

**శాంటియాగో:** చిలీకి సంబంధించిన మిలటరీ విమానం ఒకటి సుమారు 38 మంది ప్రయాణీకులతో గల్లంతయ్యింది. దేశానికి దక్షిణాన ఉన్న ఓ స్థావరం నుంచి అంటార్కిటికా వెళ్లేందుకు టేకాఫ్ తీసుకున్న విమానం కూలిపోయి ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. సోమవారం ఉదయం సుమారు 4.55 గంటలకు సీ–130 విమానం పుంటా ఎరీనా నుంచి టేకాఫ్ తీసుకుందని, 6.13 గంటలకు సంబంధాలు తెగిపోయాయని చిలీ వైమానిక దళం ఒక ప్రకటనలో తెలిపింది. విమానంలో ఎమర్జెన్సీ పొజిషనింగ్ సిస్టమ్ అందుబాటులో ఉన్నప్పటికీ అది పనిచేస్తున్నట్లుగా లేదని వాయుసేన అధికారి ఎడ్యురాడో మోస్కొయిరా తెలిపారు.

## అత్తల కనుసన్నల్లో పల్లెపడుచులు



**పల్లె మహిళ ప్రగతిపై కుటుంబ ఆంక్షల ప్రభావం**

**సామాజిక సంబంధాల్లో మెరుగైన స్థితిలో పట్టణ మహిళలు**

### సామాజిక సంబంధాలపై అత్తల ఆంక్షలు

**దేశంలోని గ్రామీణ ప్రాంతాల మహిళలు కనీస వ్యక్తిగత విషయాల్లోనూ స్వేచ్ఛగా వ్యవహరించలేకపోతున్నారట. గ్రామీణ మహిళలు తమ కుటుంబాలకు మాత్రమే పరిమితం అయిపోవడానికి అత్తల పెత్తనమే కారణమని బోస్టన్ యూనివర్సిటీ విద్యార్థులు చేపట్టిన సర్వేలో వెల్లడైంది. అత్తల పెత్తనానికి కూడా వారిలోని పురుషాధిపత్య భావజాలమే కారణమని గుర్తించింది. గ్రామాల్లో కంటే పట్టణ ప్రాంతాల మహిళలు పునరుత్పత్తి, కుటుంబ నియంత్రణ విషయాల్లో మెరుగ్గా ఉండడానికి వారికున్న సోషల్ మొబిలిటీ, సామాజిక మాధ్యమాలు అందుబాటులో ఉండడమే కారణమని ఈ సర్వే పేర్కొంది.** - న్యూఢిల్లీ

బోస్టన్ యూనివర్సిటీకి చెందిన మహేష్ కర్రా, నార్త్ ఈస్టన్ యూనివర్సిటీకి చెందిన కాటలీనా హెర్రేరా అల్మాంజా, బోస్టన్ కాలేజీకి చెందిన ఎస్.అనుకృతి, ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన ప్రవీణ్ పాతక్‌లు 'కర్స్ ఆఫ్ ద మమ్మీజీ'(అత్తల కనుసన్నల్లో) పేరుతో పరిశోధనా పత్రాన్ని విడుదల చేశారు. అధ్యయనంలో భాగంగా 2018లో

### కర్స్ ఆఫ్ ద మమ్మీజీ

ఉత్తరప్రదేశ్‌లో 18– 30 ఏళ్ల మధ్య వయస్సు గ్రామీణ వివాహితల ప్రాథమిక సమాచారాన్ని సేకరించారు. మహిళల ఆరోగ్యం, కుటుంబ నియంత్రణపై సామాజిక సంబంధాల ప్రభావంపై ఈ అధ్యయనంలో గుర్తించిన కీలకాంశాలు..

- గ్రామీణ స్త్రీ తన కుటుంబంలోని భర్త, అత్త కాకుండా సగటున తమ జిల్లాలోని 1.6 మంది వ్యక్తులతో మాత్రమే వ్యక్తిగత విషయాలను చర్చిస్తున్నారు.
- సగటున ఒకరికన్నా తక్కువ 0.7 వ్యక్తులతో వ్యక్తిగత, గోప్యతాంశాలపై మాట్లాడుతున్నారు.
- గ్రామీణ స్త్రీలలో 36 శాతం మందికి తమ ప్రాంతంలోని అన్ని రకాల విషయాలూ చర్చించుకోగలిగే ఒక్క సన్నిహిత వ్యక్తి కూడా లేరు.
- 22 శాతం మందికి జిల్లాలోనే కాకుండా మరెక్కడా సన్నిహితమైన వ్యక్తులు లేరు.
- 14 శాతం స్త్రీలకు మాత్రమే ఒంటరిగా ఆరోగ్య కేంద్రాలకు వెళ్లేందుకు అనుమతి ఉంది.
- 12 శాతం మంది స్త్రీలకు అదే గ్రామంలోని బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళ్లే అనుమతి ఉంది.

గ్రామీణ స్త్రీల సామాజిక సంబంధాలపై అత్తల ప్రభావం ఎక్కువగా ఉంది. కోడళ్లు కనీసం గడప దాటి బయటకు వెళ్లాలన్నా చాలా ఇళ్లలో అత్తల అనుమతి తప్పనిసరి. తమకున్న పరిమిత సన్నిహితుల రీత్యా వ్యక్తిగత విషయాలను ఎవరితోనూ వారు చర్చించే అవకాశాల్లేవు. దీంతో పిల్లల్ని కనడం,, కుటుంబ నియంత్రణ విషయాల్లో కోడళ్ల ఇష్టాఇష్టాలతో నిమిత్తం లేకుండా అత్తల నిర్ణయాలే అమలవుతున్నాయి.

అత్తలతో కలిసి జీవించని స్త్రీలతో పోల్చుకుంటే అత్తలతో ఉండేవారు కుటుంబ నియంత్రణ కోసం 50 శాతం తక్కువగా ఆసుపత్రులను సందర్శిస్తున్నారు. అత్తలతో జీవించడం వల్ల ఆధునిక గర్భనిరోధక పద్ధతులను అనుసరించేవారు 12.5 శాతం వరకు తగ్గారు. 2018 ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 21.4 కోట్ల మంది స్త్రీలు ఆధునిక కుటుంబ నియంత్రణా పద్ధతులను అవలంభించడం లేదు. పట్టణ స్త్రీలు సామాజిక సంబంధాలు, సామాజిక మాధ్యమాల కారణంగా ఈ విషయంలో గ్రామీణ స్త్రీల కంటే ఎక్కువ ప్రయోజనం పొందే అవకాశం ఉందని ఈ అధ్యయనం గుర్తించింది. గ్రామీణ స్త్రీలు అత్తల కనుసన్నల్లో మెలగాల్సి రావడం వారి పునరుత్పత్తి హక్కులను ప్రభావితం చేస్తోంది. వీరు తమ సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో తెలియక సందిగ్ధంలో పడిపోతున్నారు. ఇల్లు దాటి బయటకు వెళ్లిగానీ, ఇతర కుటుంబ సభ్యులతోగానీ వ్యక్తిగత విషయాలను చర్చించే వేదికే కరువైన స్థితిలో వారు ఉన్నారు. పైపెచ్చు, సంతానోత్పత్తికి సంబంధించి పురుషుల్లో సమస్య ఉంటే, దాన్ని సైతం అత్తలు బయటపడకుండా గోప్యంగా ఉంచుతున్నారని ఈ అధ్యయనంలో గుర్తించారు.

**ఆధునిక కుటుంబ నియంత్రణకు 21.4 కోట్ల మంది దూరం**

### ఎందుకీ ఆధిపత్యం?

అత్తాకోడళ్ల మధ్య పరస్పర విరుద్ధ భావాలు ఈ అవరోధానికి కారణం. అయితే, ఇందుకు మూల కారణం మాత్రం అత్తల్లోని పురుషాధిపత్య ధోరణేనంటున్నారు అధ్యయనవేత్తలు. ఇవే అత్తల్లోని ఆధిపత్య ధోరణికీ, పెత్తందారీ పోకడలకీ, తమ మాటే చెల్లుబాటు కావాలనే మొండి పట్టుదలకు కారణాలని అధ్యయనం వెల్లడించింది. అత్తలతో లేని వివాహితలు చాలా విషయాల్లో సొంతంగా నిర్ణయాలు తీసుకోగలుగుతున్నారు. పురుషాధిపత్య భావజాలం ప్రభావంలో ఉన్న అత్తల ఆధిపత్యం యువతుల అభివృద్ధికి అడ్డుకట్టగా నిలుస్తోందని ఈ అధ్యయనం తేల్చి చెప్పింది.

# స్థిరీకరణ నిధితో పంటలకు గిట్టుబాటు ధర

### రైతులు, వినియోగదారుల ప్రయోజనమే ప్రభుత్వ ధ్యేయం

### అసెంబ్లీలో మార్కెటింగ్ శాఖ మంత్రి మోపిదేవి

**సాక్షి, అమరావతి :** సాగు నుంచి పంటలకు గిట్టుబాటు ధర వరకు అన్ని దశల్లోనూ రైతులను ఆదుకోవడమే ధ్యేయంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. అందుకే అధికారంలోకి వచ్చిన రెండో నెల లోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ మిషన్‌ను ఏర్పాటు చేశారని చెప్పారు. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి పంటలకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు చేపడుతున్నారన్నారు. అసెంబ్లీలో మంగళవారం వైఎస్సార్ రైతు భరోసా – పీఎం యోజన, పంటలకు మద్దతు ధరపై అసెంబ్లీలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వంలో మూడేళ్ల పాటు శనగ పంటకు గిట్టుబాటు ధర రాకపోయినా చంద్రబాబు పట్టించుకోలేదని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడగానే శనగ రైతులను ఆదుకునేందుకు క్వింటాల్‌కు రూ.1,500 చొప్పున ఒక్కో రైతుకు గరిష్టంగా 5 ఎకరాలకు రూ.45 వేల వరకు బోనస్ కింద రూ.330 కోట్లు కేటాయించామన్నారు. అపరాలు పండించే రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం కోసం మరో రూ.100 కోట్లు కేటాయించామని చెప్పారు. దళారీ వ్యవస్థతో టమాటా రైతులు నష్టపోతుండటాన్ని గుర్తించి ప్రభుత్వం నేరుగా మార్కెట్‌లోకి దిగిందన్నారు. అప్పటికి కిలో రూ.10 కూడా పలకని టమాటాను ధరల స్థిరీకరణ నిధి ద్వారా కిలో రూ.25 చొప్పున కొనుగోలు చేసిందని వివరించారు. ప్రస్తుతం ఉల్లి కిలో రూ.100 నుంచి రూ.120 చొప్పున కొనుగోలు చేస్తూ రైతు బజార్లలో రూ.25 చొప్పున విక్రయిస్తోందని చెప్పారు. దీనివల్ల ప్రభుత్వంపై నెల లోనే రూ.20 కోట్లకుపైగా భారం పడిందన్నారు.

### రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

పంటల సీజన్ ప్రారంభం అయ్యింది కాబట్టి కనీస మద్దతు ధరను ప్రకటించామని వెల్లడించారు. రాష్ట్రం లో పలు చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. టీడీపీ హయాంలో పత్తి కొనుగోలులో అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరుగుతోందన్నారు. ఈ–క్రాప్ విధానంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి నిబంధనలను సడలించి కాటన్ కార్పొరేషన్ (సీసీఐ) ద్వారా ప్రభుత్వం పత్తి సేకరిస్తోందని చెప్పారు. ఇప్పటివరకు దాదాపు లక్ష క్వింటాళ్లు సేకరించామన్నారు.

### కనీస మద్దతు ధర ఇలా

| పంట (క్వింటాల్) | ధర (రూపాయల్లో) |
|---|---|
| వరి (ఏ గ్రేడ్) | 1,835 |
| వరి (కామన్ గ్రేడ్) | 1815 |
| జొన్న (హైబ్రీడ్) రకం | 2,550 |
| జొన్న (మల్దాని రకం) | 2,570 |
| సజ్జలు | 2,000 |
| రాగి | 3,150 |
| మొక్కజొన్న | 1,760 |
| కందిపప్పు | 5,800 |
| పెసలు | 7,050 |
| మినుములు | 5,700 |
| సెనగ | 4,875 |
| వేరుసెనగ | 5,090 |
| పత్తి (24.5 – 25.5 మైక్రాన్) | 5,255 |
| పత్తి (29.5– 30.5 మైక్రాన్) | 5,550 |

**పసుపు క్వింటాల్ రూ.4,800 నుంచి రూ.5,700 వరకు ఉంది. (ఇంకా పంట రాలేదు) మిర్చి రూ.13,000 నుంచి రూ.18,500 వరకు ఉండగా, ఉల్లిపాయలు రూ.9,150 నుంచి రూ.12 వేలు వరకు ఉన్నందున ప్రభుత్వ జోక్యం అక్కర్లేదు.**







### ఆర్టీసీలో 40 శాతం వేతన సవరణ బకాయిల చెల్లింపు

**సాక్షి, అమరావతి:** ఆర్టీసీ కార్మికులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 40 శాతం వేతన సవరణ బకాయిలు చెల్లించడానికి వీలుగా సంస్థ ఎండీ కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులిచ్చారు. బకాయిలను ఈ నెల 12న చెల్లించేందుకు యాజమాన్యం ఏర్పాట్లు చేసింది. పెండింగ్‌లో ఉన్న 40 శాతం బకాయిలు రూ.210 కోట్లు విడుదల చేసేందుకు ఉత్తర్వులు జారీ చేయడంపై యూనియన్ల నేతలు చంద్రయ్య (వైఎస్సార్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్), దామోదరరావు (ఈయూ), రమణారెడ్డి (ఎన్‌ఎంయూ) వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు.

### 13న విజయవాడలో 'స్కిల్ కనెక్ట్ డ్రైవ్'

#### కియాలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఈనెల 13న విజయవాడలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 'స్కిల్ కనెక్ట్ డ్రైవ్' నిర్వహించనున్నట్లు కృష్ణా జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రణయ్ తెలిపారు. అనంతపురం జిల్లా పెనుగొండలోని కియా మోటార్స్ కంపెనీలో పనిచేయడానికి నిర్వహించే ఈ స్కిల్ కనెక్ట్ డ్రైవ్‌కు హాజరయ్యేందుకు 2017, 18, 19లో పాలిటెక్నిక్ (డిప్లొమా) పూర్తి చేసినవారు, ఇంతకు ముందు అప్రెంటిస్ షిప్‌కు ఎక్కడా రిజిస్ట్రేషన్ చేసుకోని అభ్యర్థులు అర్హులని చెప్పారు. ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని ఇందుకు www.apssdc.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 63050 04318 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### సీపీడీసీఎల్ ఏర్పాటుకు మార్గం సుగమం

**సాక్షి, అమరావతి:** విజయవాడ కేంద్రంగా విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) చేసిన ప్రతిపాదనను ఆమోదిస్తూ ఇంధన శాఖ మంగళవారం జీవో జారీ చేసింది. మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (సీపీడీసీఎల్) పేరుతో కంపెనీని రిజిస్టర్ చేస్తూ, ఎస్పీడీసీఎల్ సీఎండీ హరినాథ్‌రావు, డైరెక్టర్ వనజ, ఇంధన శాఖ ఉప కార్యదర్శి కుమార్‌రెడ్డిని ప్రారంభ డైరెక్టర్లుగా నియమిస్తున్నట్లు జీవోలో పేర్కొన్నారు.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.